భారతి

జనవరి 1973

వ్యవస్థాపకులు:

దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు

వెల ఒకరూపాయి

భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1938–1972)

★

జనవరి 1973

సంపుటము : 50 : సంచిక : 1 :

విడిపత్రిక వెల ఒక రూపాయి

విషయానుక్రమణిక

జనవరి 1973

స్వ వి ష య ము

50 వ సంవత్సరం ప్రారంభం కాక ముందే 'భారతి'కి తీరని గాయం తగిలింది. దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారి తరువాత ముప్పయినాలుగు సంవత్సరాలుగా 'భారతి' సంపాదకత్వం వహించిన శ్రీ శివలెంక శంభుప్రసాద్ గారు 1972 జూన్‌లో శివసాయుజ్యం చెందారు. వారి అస్తమయంవల్ల ఏర్పడిన లోటు తీరనిది. మూడు దశాబ్దాల పయిగా వారు చూపించిన మార్గాన్ని అనుసరించటమే 'భారతి' ధ్యేయం. ఈ ప్రయత్నంలో రచయితలు ఎప్పటివలె సహకరించగలరని భారతి ఆశిస్తున్నది. సహకరించిన వారందరికీ కృతజ్ఞత తెలుపుకుంటున్నది.

పరిమేయం

డా. ముదిగొండ శివప్రసాద్

ఏరీ ఇంత చిన్న కాన్వాసు మీాదనా
మహిమాన్వితమైన చిత్రాలు చిత్రించడం?
గీచిన బొమ్మల తడి ఆరీ ఆరే లోపలే
కుంచెలు జారిపోతుంటే ఏమిటి చేయడం??

ప్రతిభావంతుడైన భావుకునికి ఈ
ప్రకృతి మొత్తం పెద్ద చిత్రశాల అంటారు సరే కాని
ప్రకృతి మాత్రం ఏమంత పెద్దది?
భూమి మాత్రం ఏమంత విశాలమైనది??

పరిమేయ జీవన ప్రవాహ పార్శ్వాల కవతల
ప్రకృతి నిలబడే వుంటుంది,
నిన్నా నేడూ రేపూ —
తనువు మొత్తం విరబూచుకొని లేదా
తల మొత్తం విరబోసుకోని;
ఆమె ప్రతిబింబాలు బింబించే లోపలే
అయ్యో! పరుగెత్తిపోయింది జీవనం
పగిలిన తరంగ గతితో అంతరంగ హతితో —

పొద్దున్నే తలిరాకు జొంపాల మీాది మంచు బిందువు
కొత్త ముత్తైదువులా స్నిగ్ధంగా ముగ్ధంగా వున్నదని మురిసే లోపలే
సూర్య కిరణ సంస్పర్శలో రాగ వల్లికలను విరిసే లోపలే
ప్రచండ ప్రభంజనంతో దృశ్యం చెదిరిపోతున్నది
చిత్రం మారిపోతున్నది —

సాయంత్రం నింగీ నేలా కలిసిన చోట నిలబడి సంధ్యాదేవి
నీలాల కుంతలాలు ఆరబోసు కొని

సుస్ఫుట అరుణా రుణ కుంకుమాన్ని తీర్చి దిద్దుకొని,
మాజిష్ఠ రాగా రుణ తోరణాలు దిశలకు చుట్టి
మంజీర హంసధ్వని రాగాలతో ఎదలను తట్టి
భావ వీణాల గవిసెన విప్పి
ప్రశాంత సంగీతాన్ని పలికించే లోపలే
అమృతం తొణికించే లోపలే,
మబ్బులతో ఆమె పిచ్చుక గూళ్ళు కట్టుకొని
వెన్నెల కుప్పలు పెట్టుకొని ఆడుతూ
చంద్ర ధనుస్సుల మీద మధు వ్రతంతో
ఊయల లూగే లోపలే
ఒయ్యారం ఒలక బోసే లోపలే,
రాహు గ్రస్తమైన రజని
రాక్షసునిలా తమాల వనవాటిలా నిలిచిన తమోమయ నిశీధి.

> సత్య ప్రాభాత ధవళిమను త్రోసిరాజన్న అరుణిమ—
> రజోమయ సూర్య రాగాన్ని మింగివేసే తమస్సు—
> తమోమయ నిశీధ గహ్వరం చివర
> ధవళ ప్రాభాత సంధ్య వికసిస్తుంది సరే కాని
> సంధ్యను అందుకునే వరకూ
> జీవనాలు, నిమ్నగలు, నిలబడివుండాలి కదా విత్తుగా!

అందుకే అంటున్నాను నేను
అయ్యా! ఈ చిత్తరువు చాలా చిన్నదని.
అవే నవ్వులు అవే పువ్వులు
రసాలు రంగులు రాగాలు ద్వేషాలు
ఆలింగనాలు అపనమ్మకాల హత్యలు ఆత్మ హత్యలు
యుద్ధాలు—కల్యాణ తోరణాలు
అవే ముఖాలు అవే చేతులు హావ భావాలు
కాళ్ళు కళ్ళు నడకలు నడతలు
బిగించిన ఆరడుగుల పిడికిలి
ప్రవహించే ఆరడుగుల కన్నీటి సెలయేరు

ప రి మే య ం

నవ్వే ఆరు రేకుల మందారం
కొప్పెక్కిన అరడుగుల కొండ చిలువ—

వాల్మీకీ వ్యాసుడూ
భాసుడూ భవభూతీ కాళిదాసూ
ఎవడైనా సరే ఒక పరిమేయ జీవన చిత్రకారుడే తన
పాత్ర కొద్దీ ఉద్ధరించెడు రసాన్ని తీర్థాన్ని
ఆనందసాగరంలో నుండి అందించిన
ఆద్యంతాలు తెలియని పథ శ్రాంతుడే!

నిన్నా — రేపూ — తెలియని నాకు
'నేడు' — 'ఇప్పుడు' — 'ఇక్కడ', ఈ కాలఖండంలో ఉపాధి,
ఏమిటిది??
ఇందులోనే మళ్ళీ ఒక సాహిత్య తరంగం,
ఒక సాంస్కృతిక కనీనిక,
ఒక పునర్జన్మ విశ్వాసం
ఒక అఖండతా ప్రవాహ భావం—

ఏమైనా
ఈ పరిమేయ చిత్రణం కూడా లేకంటే
నిజంగా
బ్రతుకు ఎలా సాగుతుంది ఆనంద మయంగా అభయంగా?
అందుకే అన్నా తెలిసిన ఆ మహర్షులు కూడా, ఈ
పరిమిత జీవనం ప్రతిబించాలనే,
బొమ్మలుగా గీస్తూ 'పోతున్నారు'
ప్రవాహ గతిలో ఎక్కడికో!!

———

తుంగపాడు, కన్నెకల్లు శిలాశాసనములు

శ్రీ బి. ఎన్. శాస్త్రి

ఆంధ్రప్రదేశ్‌లోని నల్లగొండ మండలము చారిత్రకముగా ప్రసిద్ధిజెందినది. ఈ మండలము ప్రాచీన కాలమునుండియు, వివిధ మతములకు, విభిన్న సంస్కృతికి, వివిధ రాజవంశీయుల పాలనకు నిలయమై అపూర్వమైన శోభతో విలసిల్లిన ప్రాచీనాంధ్ర మహానగరములను కలిగి ఆంధ్రదేశ చరిత్రలో ననుపమానమైన స్థానమలంకరించినది. జైన, బౌద్ధమతము లచటి రాజుల ఆశ్రయమును పొంది వర్ధిల్లినవి. ఇచటి జైనవసతులు[1], బౌద్ధారామ విహారములు[2] పూర్వవైభవమును చాటుచున్నవి. శైవ, వైష్ణవ మతము లిచట వ్యాపించి, ప్రజల నుత్తేజ పరచినవి. అసమాన శిల్పకళాశోభితములైన బృహదాలయము[3]లీ ప్రాంతమున నేటికిని నిలిచియున్నవి. ఆంధ్రదేశ చరిత్రకు సంబంధించినంతవరకీ ప్రాంతమును వరుసగా, శాతవాహనులు, ఇక్ష్వాకులు, విష్ణుకుండినులు, పశ్చిమ చాళుక్యులు, కాకతీయులు, పద్మనాయకులు, గోలకొండ నవాబులు పాలించినారు. ఆయా రాజవంశీయుల పరిపాలనా కాలమున వారి, వారి సామంతులు, మాండలికులు, నల్లగొండ మండలములోని వివిధ ప్రాంతములను పాలించిరి.

ఈ మండలమున వివిధ రాజవంశీయులకు, వారి వారి సామంత, మాండలికులకు సంబంధించిన శాసనము లసంఖ్యాకముగా నున్నవి. ఈ శాసనములలో గొన్ని చదువుటకు వీలుకానంత వరకు చెడిపోయినవి.

తుంగపాడు శిలా శాసనము

శాసనము :

ఈ శాసనము నల్లగొండ జిల్లా, మిర్యాలగూడ తాలూకా కేంద్రమునకు, ఆరుమైళ్ల దూరమున మిర్యాలగూడ — నాగార్జునసాగర్ రోడ్డుపై నున్న తుంగపాడు గ్రామమున, ప్రాచీనమైనట్టిదియు, నేడు శిథిలావస్థలో నున్నట్టిదియు నగు కోటప్రక్కన శిథిల దేవాలయము చెంత నున్నది. ఇది నల్లరాతిపై నాలుగువైపుల జెక్కబడినది. తుంగపాడు, తుంగపాడు వాగుయొడ్డున నున్న గ్రామము. శిథిలమైన పట్టణము వాగునకు తూర్పుదిశలో నున్నది. తుంగపాడు వాగు, పెద్ద దేవులపల్లి రిజర్వాయరు అలుగు (మత్తడి) మిగులు నీటివలన నేర్పడి, పవిత్రమైన కృష్ణానదిలో కలియు చున్నది.

ఆకారాదికములు :

ఈ శాసనము నల్లరాతిపై నాలుగువైపుల చెక్కబడినది. శాసనారంభమున సూర్యచంద్రుల చిహ్నములును, పానవట్టముతో గూడిన శివలింగమును, శాసన శిల రెండవప్రక్క నంది విగ్రహమును చెక్కబడినవి. శాసన శిల నునుపుగా చెక్క బడినది. శాసనాక్షరములు పొంకముగానుండి చక్కని వరుసల లోను చెక్క బడినవి. శాసనమున కాకతి రుద్రదేవుని ప్రశంస యున్నది. శాసనము మొదటిప్రక్క 25 పంక్తులు, రెండవ ప్రక్క 21 పంక్తులు, మూడవప్రక్క 20 పంక్తులు, నాలుగవ ప్రక్క 10 పంక్తులు మొత్తము 76 పంక్తులున్నవి. ఈ శాసనము శక

---

1. కొలనుపాక, సిరికొండ.

2. ఇంద్రపాల నగరము, ఫణిగిరి, గాజుల బండ, సిరికొండ.

3. పిల్లలమర్రి, పానగల్లు, ఇంద్రపాలనగరము. నాగులపాడు, గణపవరము, ఘాటపల్లి, ఛందు పట్ల :

సంవత్సరము 1102 లో వేయింపఁబడినది. శకసంవత్సరము 1102. క్రి. శ. 1180 కి సమానము. శాసనము వేయించిన కాకతి రుద్రదేవ మహారాజు కాకతి రెండవ ప్రోలరాజు జ్యేష్ఠపుత్రుఁడు. మహా వీరుడు. ఆంధ్రదేశము నేకచ్ఛత్రాధిపత్యముగ పాలించిన వాఁడు.

రుద్రదేవుని కాలమున కాకతి సామ్రాజ్యము మహోన్నత స్థితి యందుండెను. రుద్రదేవుడు వేయించిన ఈ శాసన విషయ మతి స్వల్పము. శాసన శిల రెండవప్రక్క 9 వ పంక్తినుండి వ్యాస గీతా శ్లోకము లారంభ మగుచున్నవి. ఇట్టి శ్లోకముల సంఖ్య ఆరు. శాసనశిల మూడవప్రక్క పూర్తిగా ఈ శ్లోకము లున్నవి. నాలుగవ ప్రక్క శాసనము రక్షించిన వారికి కలుగు ఫలమును, రక్షింపనివారికి కలుగు పాప ఫలమును, వచనములో చెప్పబడినది.

భాష - లిపి

ఈ శాసనము తెలుఁగు భాషలో వేయింప బడినది. శాసనమున 12 వ శతాబ్ద్యంతమున ఆంధ్రదేశమున వాడుకలో నున్న తెలుఁగు కన్నడ లిపి వాడబడినది. ఇందలి అక్షరములు గుండ్రఁబత్తు అక్షరములు, ఆరు శ్లోకములు తప్ప, తక్కిన శాసనమంతయు, తెలుఁగు వచనములో నున్నది. శాసనము 'స్వస్తిశ్రీ'తో నారంభ మగుచున్నది. శాసనమున, ద్విత్వాక్షరములు, 'ఱ' రకారపొల్లు వాడబడినవి. కొన్నిచోట్ల పూర్ణానుస్వారము వ్రాయబడినది. నేడు మనము వ్రాయు లిపికి, శాసనమున వ్రాయఁబడిన లిపికిని కొలది భేదము కనిపించు చున్నది. శాసనమున

శార్వరి	బదులు	శావ్వఱి.
వర్షములు	—	వష్షఁములు.
నాఁడు	—	నాండు.
శ్రీ పర్వత	—	శ్రీ పవ్వఁత.
తూర్పున	—	తూప్పఁణన.
ఆచంద్రార్క	—	ఆచంద్రాక్కఁ.
షష్టిర్వర్ష	—	షష్టిర్వఁష్షఁ.
బహుభిర్వసుధా	—	బహుభిర్వఁ సుధా.

ఆదులు వ్రాయబడినవి.

ఈ శాసనమందలి లిపి కాకతీయుల నాటి శాసనముల లిపిని పోలి యున్నది. ముఖ్యముగా పండ్రెండవ శతాబ్దిలో వెలసిన రుద్ర దేవుని వేయిస్తంభాల గుడి శాసనము[4], పిల్లలమఱ్ఱి[5], నాగులపాడు[6], అన్నవరము[7], శాసనాక్షరములను పోలిన అక్షరము లీ శాసనమందున్నవి.

శాసనము నాలుగవ ప్రక్కగల తెలుగుభాష నేడు మనము వాడుచున్న భాషకు సన్నిహితముగా నున్నది. శాసనమున కాకతి రుద్రదేవ మహారాజు. 'స్వస్తి సమధిగత పంచమహాశబ్ద మహా మండలేశ్వర పరమ మాహేశ్వర, పరహిత చరిత, వినయ విభూషణ, అనుమకొండ పురవరేశ్వర నామాది సమస్త ప్రశస్తి సహితం శ్రీ మన్మహా మండలేశ్వర కాకతీయ రుద్రదేవ మహారాజులు' అని వర్ణింపఁబడినాడు.

శాసన విషయము :

ఈ శాసనమున కాకతి రాజన్యులలో అసమాన ప్రతిభావంతుఁడును, కాకతిరాజ్య విస్తీర్ణమునకు గారకుఁడైన రుద్రదేవ మహారాజు వర్ణింపఁబడినాఁడు. ఇందుకాకతి రాజన్యులకు గల బిరుదావళి ఇతనికి జేర్చఁబడినది. సమధిగత పంచమహాశబ్ద, మహా మండలేశ్వర, పరమ మాహేశ్వర, పరహిత చరిత, వినయ విభూషణ, ఆది బిరుదములు. ఇతని పూర్వము కాకతి రాజ్యమును పాలించిన రాజులు వేయించిన శాసనము లందు వ్రాయించి నట్టివే. కాని శాసనకాలము నాటికి కాకతి రుద్రుడు సర్వ స్వతంత్రుడు. పశ్చిమ చాళుక్య రాజులకు సామంతుడు కాని, మాండలికుడు కాని కాడు. కందూరినాడును పాలించు ఉదయన చోడమహారాజు, అతని పుత్రులు, భీమ గోకర్ణులును, రుద్రదేవుని సామంతులై యుండిరి. వంశాచారము

4. తెలంగాణ శాసనములు. Vol. I కాకతీయ శాసనములు No. 5.
5. ,, Vol. I ,, No. 7.
6. ,, Vol. I ,, No. 10.
7. ,, Vol. I ,, No. 12.

ననుసరించి ప్రశస్తి చేర్చబడినదే కాని, న్యాయముగా, రుద్ర దేవునికి 'మహామండలేశ్వరాది బిరుదముల అవసరము లేదు. సకల సామంత రాజ్యము లీతని స్వాధీనమై యుండుట, పశ్చిమ చాళుక్య రాజ్యము పతనమగుట, గాడ కాకతి రుద్రుడు సర్వాంధ్ర దేశమునకు సార్వభౌమునిగా గుర్తింప బడినాడు. కాకతి రుద్ర దేవ మహారాజు, శ్రీ పర్వతమునకు ఈశాన్య ద్వారమైన ఏలేశ్వర క్షేత్రమునకు, అచటి ఆరాధ్య దైవమగు, ఏలేశ్వర మహాదేవర అంగభోగ రంగభోగ దూప దీప నివేద్యములకు, సత్రమునకు, అంబలిపలి (అంబటి పల్లి)లోని పెద్దకాలువ, పిన్నకాలువ, పడు కాలువ. (పడుచాటు నీళ్లపోవు కాలువ) తొరకల కాలువ, తూర్పున దనద ప్రెగ్గడ చెఱువు, పడుమట చెప్ప చెఱువు, అడ్డగూడి, అస్థాన చతుస్సీమ సహితముగా ఆచంద్రార్కముగా దానము గావించెను. శాసన విషయము తరువాత దాన ఫలమును తెలుపు ఆరు శ్లోకములున్నవి. దాన శాసనములను రక్షించిన వారికి కలుగు పుణ్య ఫలము, దాన శాసనమును పాటింపని వారికి కలుగు పాప ఫలము తెలుపబడినది.

కాలనిర్ణయము :


ఈ శాసనమును కాకతి రుద్ర దేవ మహారాజు శక సంవత్సరము 1102 శార్వరి సంవత్సర ఆషాఢ శుద్ధ పౌర్ణమి గురువారము నాడు వేయించెను. శక సంవత్సరము 1102 క్రీ. శ. 1180 కి సమానము. అప్పటికి రుద్ర దేవ మహారాజు కాకతి సింహాసన మధిష్ఠించి 22 సంవత్సరములు. రుద్ర దేవ మహారాజు రెండవ ప్రోలరాజు ప్రథమ పుత్రుడు. ప్రోలరాజు క్రీ. శ. 1115—1158 వరకు పాలించెను. కాకతి రుద్ర దేవుడు క్రీ. శ. 1158 లో సింహాసన మధిష్ఠించి, అవిచ్ఛిన్నముగా నాంధ్రదేశమును 37 సంవత్సరములు అనగా క్రీ శ. 1195 వరకు పాలించెను. ఈ శాసనము రుద్రదేవుని 22 వ విజయరాజ్య సంవత్సరమున వేయింప బడినది. రుద్రదేవుడు అనుమకొండ శాసనమును, శక సంవత్సరము 1084 చిత్రభాను సంవత్సర మాఘ శుద్ధ 13 వడ్డవారమునాడు తన పేర రుద్రేశ్వరమును, శ్రీ వాసుదేవర శ్రీ సూర్య దేవరాను, ప్రతిష్ఠ చేయించెను. శక సంవత్సరము 1084. క్రీ. శ. 1162 కు సమానము. అనగా హనుమకొండ శాసనము వేయించు కాలము నాటికే కాకతి రుద్రుడు కందూరి భీమదేవ చోడ మహారాజు నోడించి, ఆతని సోదరియగు పద్మావతీ దేవిని వివాహ మాడి యుండెను. రుద్ర దేవుని నాలుగవ విజయ రాజ్య సంవత్సరమున అనుమకొండ శాసనము వేయింపబడినది. అనుమకొండ శాసనము వలన రుద్ర దేవుడు కందూరి ఉదయనచోడ, భీమదేవచోడుల నోడించి, పద్మావతీ దేవిని వివాహ మాడినట్లు తెలియు చున్నది. ఈ శాసనము వేయించు కాలము నాటికి రుద్ర దేవుడాంధ్ర దేశమున కేకైక ప్రభువు. సమస్త సామంత మాండలిక ప్రభువులకు ప్రభువు.


తుంగపాడు శిలాశాసనము

శాసనము — మూలము

మొదటి ప్రక్క

1. స్వస్తిశ్రీ శక వర్ష్షం
2. ములు 1102 యగు
3. శార్వ్వరి సంవత్సర ఆ
4. షాఢ శుద్ధ 15 గురు వా
5. రము నాండు స్వస్తి స
6. మధి గత పంచ మ
7. హా శబ్ద మహా మండ
8. లేశ్వర పరమ మా
9. హేశ్వర పర హిత చ
10. రిత. వినయ విభూ
11. షణ అనుమకొండ
12. పుర వరేశ్వర నామా
13. ది సమస్త ప్రశస్తి
14. సహితం శ్రీ మన్మ
15. హా మండలేశ్వర కాక
16. తీయ రుద్ర దేవ
17. మహారాజులు
18. శ్రీ పర్వ్వతము ఈ
19. శాన్య ద్వార శ్రీ యే
20. లేశ్వర మహా దేవర
21. కు అంగ భోగ రంగ
22. భోగ దూప దీప ని
23. వేద్యముల కూ నత్రా
24. నకూ అంబలి వలి
25. ప్ర విష్టము తికేపాటి.






రెండవ పర్శ్వము

1. పెద్దకాల్వ పిన్నకాల్వ పె
2. ద్దుం గాలువ తూర్పకలి
3. కాల్వాం దూర్పణ్ణన దన
4. దె ప్రెగ్గడ చెఱ్వు పడమ్రట చె
5. వ్వ చెఱ్వు అడ్డు గూడి ఆ
6. స్థాన చతుస్సీమ సహి
7. తమ్మై ఆ చంద్రార్క్క
8. స్థా ఇగా న్నిచ్చిన దత్తి॥
9. స్వ దత్తాం పరదత్తాం వా॥
10. యోహా రేత వసుంధ
11. రా షష్టిర్వ్వర్ష సహస్రా
12. ణి విష్ఠా యాం జాయతే
13. క్రిమి॥ స్వ దత్తా ద్విగుణ
14. ం పుణ్యం పర దత్తాను
15. పాలనం పరదత్తాప హా
16. రేణ స్వ దత్తా నిష్ఫలం॥
17. భవేత్॥ బహుభి ర్వ్వ
18. సుధా సమ్యగ్రా జభి
19. శ్చాను పాలితా యెస్య
20. యెస్య యదా భూమిస్త
21. స్యతస్య తదా ఫలం"


తుంగపాడు శిలాశాసనము

మూఁడవ ప్రక్క

1. మద్వంశ జాః పరమ
2. హీ పతి వంశ జావా
3. పాపా దపేత మనసో
4. భువి భావి భూపా
5. ః యే పాల యంతి మ
6. మ ధర్మ్మ మిమం స
7. మస్తం తేభ్యో మయా
8. విరచితాంజలి రేష మూ
9. ర్ద్ధ్నిః॥ ఆదిత్య చంద్రావని
10. —లో నలశ్చ ద్యౌ భూమి
11. రాపో హృదయం య యా
12. శ్చ అహశ్చ రాత్రిశ్చ యుభ యేతి
13. సంధ్యా ధర్మ్మశ్చ జానాతి న
14. రస్య విత్తం॥ సామాన్యో
15. యం ధర్మ్మ సేతుర్ నృపా
16. ణం కాలే కాలే పాలనీయో
17. భవద్భిః సర్వ్వా నేతాన్భావి
18. నః పార్త్థివేంద్రాన్భూయో.
19. భూయో యాచతే రామ
20. చంద్రః॥.



తుంగపాడు శిలాశాసనము



నా ఒ గ వ ప్రి క్క

1. ఈ శాసనమునం గలం
2. త నట్టు నకు ఎడికు న
3. సి నాను ఎవ్వరేని విఘ్న
4. ము సేసినా దీన్కి యోవా.
5. ము సేసికొన్న వారూ ను
6. గంగకఱ్ఱు వే ఇ నెన్నూ ఆ
7. గవిలలం బొడ్చిన వారి గ
8. తికిం బోదురు వారణా
9. సి లోన బ్రాహ్మనిం జంపిన
10. వారి గతికిం బో దురు--


తుంగపాడు శిలాశాసనము

కన్నెకల్ శాసనములు

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ తాలూకా లోని కన్నెకల్లు గ్రామము కాకతీ రాజుల కాలమున ప్రసిద్ధిగన్న పట్టణము. నేడది పెద్దవూర సమితిలో నున్న గ్రామ పంచాయతీ గల పెద్ద గ్రామము.

మిర్యాలగూడ – నాగార్జున సాగర్ రోడ్డుపై వెంపాడు ప్రక్కనుండి కన్నెకల్లు గ్రామము వరకు జిల్లా పరిషత్తు రోడ్డు కలదు. మిర్యాల గూడ నుండి కన్నెకల్లు గ్రామము చేరుటకు సర్వీసు కలదు.


కన్నెకల్లు గ్రామము ప్రాచీనమైనది. గ్రామము వెలుపల పెద్దకోట యున్నది. కోటలో శిథిలమైన శివాలయము లున్నవి. కోట నానుకొని యున్న విశాలమైన ప్రాంతము పూర్వము పట్టణముగా వర్థిల్లినట్లు తోచును. సుమారు అరమైలు దూరము వరకు శిథిల నగర చిహ్నములు కనిపించు చున్నవి. ఆ ప్రాంతమందే నాలుగు శిథిల శివాలయములు లున్నవి. ఈ ఆలయముల నంటియే కన్నెకల్లు తటాక మున్నది. తటాకములో కొన్ని శిథిల మంటపముల ఛాయలు స్తంభములు కనిపించు చున్నవి. శిథిలాలయముల ప్రాంతమున చెక్కు చెదరక నిలిచియున్న విగ్రహము లున్నవి



నంది విగ్రహము

నల్లరాతితో మలచబడిన రెండు నందులు శిల్పకళా శోభితములై యున్నవి. అందొకదానికి పదమూడు, పదమూడు మువ్వలు గల పెద్ద గంట పట్టెడ ఎంతో అందముగ మలచ బడినది. కొమ్ముల చుట్టు పట్టెడ త్రాడు కలిగి కాళ్ళు మడిచి కూర్చొని, శివాలయమున కభిముఖముగా నిశ్చల ధ్యానముతో నున్నట్లు కనిపించు నంది విగ్రహము చూపరుల నాకర్షించుచు, పూర్వ వైభవమును చాటుటకు నిలిచి నట్లు కనిపించు చున్నది.

రెండవ నంది విగ్రహము మొదటిదానికన్న ఎత్తైనది. నల్లరాతితో మలచ బడినది. ఈ నంది



నంది విగ్రహము

ముక్కు కుడి రంధ్రము, దాని పై భాగము విరిగిపోయినది. ఈ నందికి, 24, 24 మువ్వలకన్న పెద్దగా కనిపించు గంటలతో పెద్దగంటగల పట్టెడ, ఒకే గంటగల పట్టెడ, మామూలు పట్టెడలు, కొమ్ముల క్రింద మూడు పట్టెడ త్రాళ్ళు, మూపురము పై నుండి తోక క్రింది వరకు చక్కని నగిషీ పనిగల పట్టెడ త్రాడు. మూపుట కందముగ కనిపించు చున్నవి.

ఈ నందులకు చేరువలో ఒక శిలపై పడగ విప్పి, తక్కిన శరీరమును మెలికలుగా చుట్టుకొని



మహానాగము – దేవతా విగ్రహము

గంభీరముగ కనిపించు మహానాగము చెక్కబడినది. ఈ మహానాగము చెక్కబడిన శిలకు దగ్గరలో దేవీ విగ్రహము చెక్కబడిన శిల యున్నది. ఆలయములకు చేరు



రతీమన్మథులు

వలో శిథిలమైన ప్రాంతములందు భిన్నమైన పానవట్టములు, శివలింగములు కనిపించు చున్నవి. శిథిలమైన ఒక శివాలయము చెంత నల్లరాతిపై మహిషాసుర మర్దని చెక్కబడినది. ఈ విగ్రహము చూడ ముచ్చటగా



మహిషాసుర మర్దని – వీరగల్లు

నున్నది. వీరగల్లు కలదు. ఈ విగ్రహము ప్రక్కన శివాలయమునకు సమీపమున వామ హస్తమున విల్లు ధరించి, దక్షిణ హస్తమున అమ్ము ధరించియున్న మన్మథుడు, మన్మథుని నడుముపై చేయివేసి నిలిచిన రతీదేవి. చెక్కబడిన రాయి క్రిందపడి యున్నది. ఈ విగ్రహములు సర్వాలంకార శోభితములై యున్నవి.




వీరగల్లు

గ్రామీణులు ప్రతి సంవత్సరము శ్రావణ మాసమున పూజించి జాతరలు చేయు, ముత్యాలమ్మ



ముత్యాలమ్మ

విగ్రహము చిన్నగుడిలో స్థాపింప బడినది. విగ్రహము నిండ పసుపు కుంకుమతో బొట్లు పెట్టబడినవి. విగ్రహము చూచుటకు, గంభీరముగ నున్నది.



దిగంబర విగ్రహము

వామహస్తమున త్రిశూలము దక్షిణహస్తమున పరశువు వంటి ఆయుధము ధరించి నిలిచిన దిగంబర విగ్రహము చెక్కబడిన శిల, ఈ ఆలయ శిథిలముల కనతి దూరములో పడియున్నది. ఒక శిథిల శివాలయము చెంత ఎత్తైన గణపతి విగ్రహమున్నది. గణ



గణపతి విగ్రహము

పతి విగ్రహము ఉదరము చుట్టు మహానాగము చుట్ట బడినది. గణపతి కోరలు పెరికి వేయబడినవి. నల్ల రాతితో మలచబడిన ఈ విగ్రహము చక్కని చెక్కడములతో వివిధాలంకారములతో శోభాయమానముగా నున్నది.

యుద్ధవీరుడు వామహస్తమున డాలు, దక్షిణ హస్తమున పొడవైన బల్లెము ధరించినట్లు ఆ బల్లెము




సప్తమాతృకలు

చివర శత్రు సైనికుడు వ్రేలాడుచున్నట్లును చిత్రింప బడిన వీరగల్లు శిథిలాలయములకు చేరువలోనున్నది.

సప్తమాతృకలు, వారి వాహనములు, ఆయుధములు చెక్కబడిన శిల వినాయకుని విగ్రహమునకు ఏబది గజముల దూరములో నున్నది.

కన్నెకల్లు గ్రామమున భూమిలో మూడు పాళ్ళు క్రుంగిపోయిన దేవాలయ మున్నది. ఇది విశాలమైన మంటపము కలిగి యున్నది. గర్భగుడి, అంతరాళ మంటపము, రంగమంటపము, ముఖమంటపము కలిగి చక్కని శిల్పసంపదతో కూడియున్న స్తంభములుకల ఈ ఆలయము జీర్ణావస్థలో నున్నది. ఈ ఆలయము భూమిలో పూడుకపోయియుండుట వలనను, ఆలయము కనిపించనంతగా చుట్టు పెంటకుప్పలు, రాళ్లు, తుమ్మచెట్లు ఉండుటవలన, తెలిసిన వారు చెప్పుటను బట్టి ఆలయమున్నట్లు గ్రహింప వీలగు చున్నది. ఈ



భూమిలో కూరుకుపోయిన శివాలయము

దేవాలయము పశ్చిమ చాళుక్యుల కాలమున నిర్మింప బడినది. ఈ దేవాలయమునకు, తూర్పుదిక్కులో గ్రామము మధ్య భాగమున, మల్లినాథ దేవర ఆలయ మున్నది. ఈ ఆలయము నల్లరాతితో నిర్మింపబడినది. గర్భగుడి, అంతరాళ మండపము, ముఖమండపము, ముఖద్వారము చుట్టు ప్రహరి కలిగి గొప్పశిల్ప సంపదతో నొప్పారు ఈ దేవాలయ కుడ్యములపై రెండు తెలుగు శాసనములున్నవి. ఆలయము గంభీరముగ కనిపించుచు పూర్వవైభవమును చాటుచున్నది. మంటపము నిండుగా గడ్డివాము పేర్చబడినది. ఆలయము ముందు చుట్టుప్రక్కల తుమ్మలు మొలిచినవి. ఈ దేవాలయము సైతము పశ్చిమ చాళుక్యుల కాలమున నిర్మించి నట్టిదే.

ఆలయ కుడ్యములపై చెక్కబడిన రెండు శాసనములలో మొదటి శాసనారంభమున సూర్య చంద్రుల చిహ్నములు, శివలింగము చెక్కబడినవి. ఇది తెలుగు శాసనము. పదునాలుగు పంక్తులలో నున్నది. దేవాలయము నిర్మించి, శివుని ప్రతిష్ఠించిన పిదప, దేవర అంగరంగభోగ ధూపదీప నైవేద్యాదులకు భూమి దానమొసంగుచు వేయించిన శాసనము కానరాలేదు. శిథిల ప్రాంతములందు త్రవ్వించిన కన్నెకల్లు గ్రామమున మరికొన్ని ముఖ్యమైన శాసనములు బయలుపడ వచ్చును.

మొదటి శాసనమున పదునాలుగు పంక్తులలో తెలుగు వచనము వ్రాయబడినది. ఈ శాసనము కాకతి రుద్ర కుమారునికి పుణ్యముగా వేయింప బడినది. సర్వార్థశాలిని ముట్లనుంచిరాజు కన్నెకంటి మల్లినాథదేవరకు అంగరంగ భోగాదులకు ఎఱంబల్లి అడ్డనలనాను, రెండు కార్లు పండునట్టి భూమిని దానమిచ్చు సందర్భమును పురస్కరించుకొని ఈ శాసనమును వేయించెను. ఈ శాసనమున పేర్కొనబడిన ఎఱంబల్లి — కన్నెకంటికి, దగ్గరలోనున్న ఎఱ్ఱబల్లి గ్రామము నేటికిని కనిపించు చున్నది. ఈ శాసనము క్రోధన సంవత్సరములో వేయింప బడినది.

రెండవ శాసనము కూడ క్రోధన సంవత్సరములో వేయింప బడినదే. ఇది ఆరు పంక్తులలో నున్న శాసనము.


ఈ రెండు శాసనములే గాక, కన్నెకంటి గ్రామము వెలుపల అంజనేయస్వామి దేవాలయమున తెల్లరాతిపై రెండు వైపుల నొక తెలుగు శాసనము చెక్కింపబడినది. ఈ శాసన శిల రెండవ వైపుగల అక్షరములు చదువుటకు వీలుగాకుండ చెదిరి పోయినవి.

కన్నెకల్లు గ్రామము పశ్చిమ చాళుక్య ప్రభువులకు సామంతులుగానున్న వంశీయులకు రాజధానిగా నుండెను. కాకతీయుల కాలమందును ఈ గ్రామము ప్రసిద్ధి కెక్కినదే. కాకతి రాజన్యుల దండనాధులు కాని, సామంతులు గాని కన్నె గ్రామమున నివసించి, చుట్టుప్రక్కల ప్రాంతములను పాలించుచు ప్రభువులకు విధేయులై యుండిరని భావింప వచ్చును.


కన్నెకల్లు శాసనములు

మొదటి శాసనము

1. క్రోధన సంవత్సర చైయి
2. త్ర శుద్ధ 1 గుఱువారానా
3. స్వస్తి శ్రీ మన్మహా మండలే
4. శ్వర కాకతి రుద్ర కుమారు
5. నికి పుణ్యముగాను స్వస్తి
6. శ్రీమతు సర్వాఙద్దిఙశాలి
7. ను మల్లమంచి రాజుగారు
8. కన్నెకంటి మల్లినాథ దేవర
9. కు ఎఱంబల్లి ఆడ వలనాను
10. సులు సేసి యె గాఱవక గ
11. ంప సహితముగాను ఈ దేవ
12. ర అంగరంగ భోగానకు ఈచు
13. వారు దీని లేదని వారి
14. కి దోశ(ష)ము.




మల్లినాథ దేవర ఆలయ శాసనము – 1



మల్లినాథ దేవాలయ శాసనము 2

రెండవ శాసనము

1. క్రోధన సంవత్సర చైత్ర శు 1 లు
2. వారాన ఇతఃఖ ఎఱ్ఱగూరయ భ
3. క్తుండు తాడ్లవల్లి మల్లి నా
4. థ దేవర భోగానకు మా
5. డ చెఱకు మూరయకు బో
6. ల్లయకు పుణ్యముగాను—



అంజనేయ స్వామి ఆలయ శాసనము

ఆంజనేయస్వామి ఆలయ శాసనము

మొదటి ప్రక్క

1. వికా...సంవత్సర చైత్ర శుద్ధ
2. పంచమి గురువారమున స్వస్తి
3. శ్రీ గణపేశ్వర దేవరకు మగు
4. — బంలయ కనకరి దేవుండు
5. నీరు నే
6. ల మఱుతురు 1 ఆమడల క--
7. లువ నీరు సమఱుగ 1 వెలి కొ
8. ల ముఖ 1 కంద.........
9. ....
10. ....

అసిధార

శ్రీ నెల్లుట్ల వేంకటేశ్వరరావ్

స్వాతంత్ర్యం
కామధేనువూ కాదు,
కల్ప వృక్షమూ కాదు,
సాగుచేస్తే ఫలిత మిచ్చే,
భూమాత!
సక్రమంగా పఠిస్తే శాంతి నిచ్చే,
భగవద్గీత !!

పెంచుకున్న వారికి,
ప్రేమ లతలు, అనురాగ సుమాలు,
కష్టించే వారికి,
అష్టైశ్వర్యాలు, ఆనంద రేఖలు,
శ్రమించే వారికి,
సత్ఫలితాలు, సుఖాలు,
అడు గడుగునా కోకొల్లలు
ఇది మహాపురుషు లుపదేశించిన,
మహా మంత్రం
ఇది హైవోల్టేజ్ కరెంటుతో నడిచే,
భారీ యంత్రం
పొల్లు పలికినా,
ఒళ్లు మరచినా,
కుండెడు తేనెలో విషపు బొట్టు !
జాతివృక్షానికే గొడ్డలిపెట్టు !!

పండితరాయల నిట్టూర్పులు

డా. మహీధర నళినీమోహన్

(గత సంచిక తరువాయి)

చెట్టు

నలుగురూ నడిచి వెళ్లే దారికి దగ్గరలో ఒక అపురూపమైన మొక్క పెరిగింది. దాని లేలేత చిగుళ్లు రుచిగా ఉన్నాయని కొందరు కోసుకు వెళ్లేవారు. చిక్కని పరిమళాలను విరజిమ్మే దాని పూగుత్తులను కొందరు పుణుక్కు పోయారు. మధురాతి మధురమైన దాని పళ్లను కొందరు తెంపుకు పోయారు. ఆ చెట్టువల్ల అంతా లాభం పొందిన వాళ్లేగాని, మండు వేసవిలో ఎండ నిప్పులు చెరుగుతూ ఉంటే వాడి పోతున్న దాని కుదుట్లో ఓ చెంబెడు నీళ్లు పోసిన వాడు లేక పోయాడు.

మహాదాత ఉన్నాడు. అతడి వల్ల అందరూ ఏదో ఉపకారం పొందినవాళ్లేగాని, అతడికి కష్టాలు వచ్చినప్పుడు అంతా మొహం చాటు చేసే వాళ్లేగాని, మాట సాయమైనా చేసినవాడు లేక పోయాడు.

ఉపజాతి

కశ్చిన్నవం పల్లవ మా దదాతి
కశ్చిత్ప్రసూనాని ఫలాని కశ్చిత్
పరం కరాలేఽస్య నిదాఘ కాలే
మూలేన దాతా సలిలస్య కశ్చిత్.

ఉత్పలమాల

కొందరు లేజివుళ్లు మరికొందరు
పూవులగుత్తు లింకనుం
గొందరు దోరకాయలను కోసుక
పోదురుగాని గ్రీష్మ మ
ధ్యందిన భానుతేజ పరిదగ్ధ మ
హీజపు బోదె దాపులన్
బిందెడు నీరుపోయ తలపెట్టరు
వారలలోన నొక్కరున్.

* * *

లత

అప్సరస లాంటి పిల్ల. చిదిపి దీపం పెటుకోవచ్చు. ఆ ఊళ్లో నవ మన్మథుల్లాంటి అందగాళ్లు ఉన్నారు. ఉక్కు ముక్కల్లాంటి కండలు తిరిగిన మొనగాళ్లు ఉన్నారు. కవికుమారు లున్నారు. పండితు లున్నారు. గాయకు లున్నారు. ఆ పిల్ల వీళ్లల్లో ఎవరిని వరించినా పువ్వుల్లోపెట్టి అపురూపంగా చూచుకొందురు. కాని, వీళ్లనందరినీ కాదని ఓ తాగుబోతు జూదరి జూలాయి వెధవని తగులుకుని లేచిపోయింది. అయ్యయ్యో! నుదుటి రాత!

తేనె సెలయేళ్లు పారే తియ్యమామిడిచెట్లున్నాయి. తుమ్మెదల ఝుంకారాలతో చూడ ముచ్చటగా ఉన్న సురపొన్నచెట్లు ఉన్నాయి. సువాసనలతో మైమరపింపజేసే బొగడచెట్లున్నాయి. చుట్టుపక్కల ఇంకా ఎన్నెన్నో మహావృక్షాలు ఉన్నాయి. వీటి నన్నింటినీ వదిలిపెట్టి బహునాజూకైన ఈ పూలతీగ తుమ్మచెట్టును కౌగలించు కుంది! శివ శివా!

శార్దూల విక్రీడితం

మాకందే మకరంద శీధు మధురే
పున్నాగ యూని భ్రమ
ద్భృంగీ నాద వినోద భాజి వకుళే
పుష్పోద్గ మా మోదిని

అన్యేష్వత్ర మహీ రుహేషు పరితః
ప్రాప్తేషు కా చిల్లతా
బాలా కంటకితం తరుం శివశివ!
స్వైరం సమా లింగతి.

మత్తేభ విక్రీడితం

మకరంద ద్రవ వాహినీ మధురమై
మా కందముల్ నిల్వగా
వకుళంబుల్ సుమ సౌరభా నిలములన్
ప్రాకింప నిందిందిర
ప్రకటంబై సురపొన్న లుండ, నితర
ప్రఖ్యాత భూమీ రుహ
ప్రకరంబుండగ ముండ్లచెట్ల బెనగెన్
బాలా లతల్ శ్రీహరీ!

* * *

ఎర్రని చిగుళ్లతో, మహాబలిష్ఠమైన మొదలుతో, తాపాన్ని హరించగల దట్టమైన నీడ నిచ్చే శాఖోపశాఖలతో మాంచి యౌవనంలో ఉన్న మద్దిచెట్టును చూచి, కామించి, వెనుక ముందులు చూచుకోకుండా ఒక పూలతీగ దానిని కౌగలించు కుంది. కానీ, తన గరళాగ్ని జ్వాలలచే చుట్టుపక్కల వనమునంతనూ భస్మీపటలం చేసేసే సామర్థ్యం గల ఒక క్రూర భుజంగం ఆ చెట్టు తొర్రలో దాగి ఉన్నదని దానికేం తెలుసు పాపం!

లతను ముగ్ధా నాయికతో పోలుస్తున్నాడు. 'తాప విలయం' అనడంలో మన్మథ తాపాన్ని పోగొట్టే విషయం సూచితం. పాము, విటుడు అనే రెండు అర్థాలు గల భుజంగ శబ్దం సాభిప్రాయం.

శిఖరిణీ

ఇయం బాలా వల్లీ మృదు కిసలయం
తాప విలయం
ఘనచ్ఛాయం సాలం నవ మతి
విశాలం పరిగతా
పరంత్వస్యా వ్యంతర్గరళ లవ
భస్మీకృత వనం
భుజంగం ప్రోత్తుంగం కథ మివ
వరాకీ కలయతు.

శార్దూల విక్రీడితం

స్థూలంబై, నును లే చివుళ్ల నెరుపై,
దుర్వార తాపఘ్నమై
సాల క్షోణిజ రాజమబ్బె ననుచున్
సంతోషిత స్వాంతయై
బాలా వల్లి పెనంగె గాని గరళ
జ్వాలాగ్నులం గ్రక్కు నీ
కాలోత్తుంగ భుజంగ పుంగవు నటన్
గానంగ లేదయ్యయో!

* * *

గాలి

వసంతకాలంలో తామర పువ్వుల తాలూకు పరిమళాలను పులుముకొని అఖిల జనాహ్లాదకరంగా తెరలు తెరలుగా వీచిన సమీరుడు ఈ నాడు వీధులలోని దుమ్మును ఎగజిమ్ముకుంటూ మన్నూ మిన్నూ ఏకం చేసేస్తూ పిచ్చివాడిలా తిరుగుతున్నాడు చూశావు కదూ!

ఉత్తర హిందూదేశంలో వేసవిలో తరుచుగా విజృంభించే దుమ్ము తుఫానులను సూచిస్తున్నట్లు కనిపిస్తుంది.

ఒకప్పుడు పెద్దబతుకు బతికి, అందరికీ తలలో నాలుకలా మెలిగి, ప్రస్తుతం దిగజారి పోయి, పిచ్చివాడిలా తిరుగుతున్న మహానుభావుణ్ణి ఎవరినో చూచి చేసిన కల్పన ఇది.

వసంతతిలక

రాజీ వినీ విపిన సౌరభ సారగంధో
యోఽభూ ద్వసంత వివసేషు జనైక బంధుః
రథ్యా రజాంసి విను దన్ని రుజ న్నగేంద్రా
నున్మత్తవ ద్భ్రమతి పశ్యసి సోఽద్య వాయుః

ఉత్పలమాల

మున్ను వసంతకాలమున భూరి
సరోరుహ కాననాంత రో

తృష్ణ సుగంధ సార పరిభాసితుడై
జనపైక బంధువై
యున్న సవారు దిప్పు డొక యున్మద
విత్తుని పోలె మిన్నునున్
గప్పుచు ధూళి ధూసర మొనర్పుచు
గ్రీష్మపు మండె మహాసుహా!

* * *

చేప

వేసవిలో సరస్సు ఒకటి క్రమక్రమంగా ఎండి పోతోంది. అందులో నివసిస్తున్న చేపలకి త్వరలో చావు తప్పనట్లు కనిపిస్తోంది. వాటి దీనావస్థను చూసి జాలిపడుతున్నాడు పండిత రాయలు.

ఓ తటాకమా! నీ ఉదరాన్నే నమ్ముకున్నాయి ఈ చేపలు. నీ అభివృద్ధికి అపరిమితానందం పడిపోతాయి ఇవి. నీ జీవనాలతో (నీళ్లతో) చాటుగా తమ జీవనాలను (ప్రాణాలను) కూడా ఒడ్డెయ్యడానికి సిద్ధంగా ఉన్న త్యాగమూర్తులు ఇవి. పాపం, ఇంక ఈ దీనములైన మీనములు ఎల్లా బతుకుతాయో, ఎవరిని ఆశ్రయిస్తాయో కదా!

ఆశ్రయ దాతకి దుర్దినములు సంప్రాప్తించగా అతడినే నమ్ముకుని, ఎట్టి పరిస్థితులలోనూ అతడిని విడువకుండా, ఆత్మత్యాగానికి కూడా సిద్ధపడ్డ మహానుభావులను ఉద్దేశించి చెప్పినది ఇది.

వసంతతిలక

భో భోః సరస్త్వ ముదరాంతర వర్తి తస్య
త్వత్పూర్ణ లాతి పరితోషిత చిత్తవృత్తేః
త్వజ్జీవనేన సహజీవన మస్య నశ్యే
న్మీనః క్వజీవతి కమాశ్రయతేఽతి దీనః.

ఉత్పలమాల

నీ యుదరమ్ము నమ్ముకొని, నీ యభి
వృద్ధికి మానసంబు నం
దాయత మోదమంది, చెరువా!
ఇపు డీ విటు జీవనంబులన్
బాయగ స్వీయ జీవన విభంగము
తప్పని దీన మీన మిం
కే యెడ బోవునో? అసువు లే గతి
నిల్పుకొనంగ నేర్చునో?

* * *

పద్మం

మహామహులు ఎందరెందరో స్నేహితులూ, బంధువులూ అయినప్పటికీ ఒక్కొక్క దురదృష్ట జాతకుడు అష్టకష్టాలూ పడుతూ ఉంటాడు. ఎవరేం చెయ్యగలరు పాపం!

తామరపువ్వు ఉంది చూడ రాదూ. అది సాక్షాత్తూ విష్ణుమూర్తి బొడ్డులోనుంచి పుట్టుకు వచ్చింది. అందులోనుంచే బ్రహ్మదేవుడు పుట్టేడు. అందులోనే లక్ష్మీదేవి నివసిస్తూ ఉంటుంది. సూర్య భగవానుడికి ఇది ప్రియురాలు కూడాను. ఇందరు ఉండి కూడా పద్మానికి మంచుబాధలు తప్పించలేక పోయారు కదా!

వసంతతిలక

కిం బాంధవేన రవిణా హరిణాపి కిం వా
లక్ష్మ్యాపి కిం సరసి జోద రజేన కిం వా
ఏకస్య శుద్ధ చరితస్య సరోరుహస్య
నైషా తుషార జనితా శమితా విపత్తిః.

తేటగీతి

బాంధవులు కారె పద్మజ పద్మ భవులు
పద్మనాభుండు పద్మినీ ప్రాణ విభుడు
భవ్యచరితకు కోమల పద్మమునకు
మంచు బాధలు మాత్రము మాయ కుండె.

* * *

మరకతమణి

ఓ మరకత మణీ! మహాసముద్రంలో జన్మించావు ఒకనాడు సార్వభౌముని శిరోభూషణమవై ప్రకాశించావు. బంగారంతో కలిసి రాచ కన్నెల శరీరాలను అలంకరించావు. ఈనాడు గాజుపూసల మధ్య తీగకు గుచ్చబడి ఈ కొండజాతిపిల్ల మెడలో వేలాడుతున్నావా? నీ కింతటి దుర్గతి పట్టిందే!

అనేక రాజసభలలో అపూర్వమైన సన్మానా లను అందుకున్న పండిత రాయలు ఒకనాడు మార్గ మధ్యంలో గాజులపాలెంలో బస చేయగా, అక్కడ ఇతడి విద్వత్తు నెరిగిన వాడెవడూ లేక జరగవలసినంత మర్యాద జరగలేదు. ఆ సందర్భంలో చెప్పిన శ్లోకం ఇది.

మందాక్రాంతా

ఆసీత్ పూర్వం విమల జలధౌ
మండనం భూపతీ నాం
నారీ నాం చ ప్రబల మకుటే
కాంచనేన ప్రసంగాత్
తంత్రీ బద్ధః కథ మిద మహో
కాంచ ఖండేన సార్థం
భిల్లీ కంఠే మరకత మణే!
కామ వ స్థాం గతోఽసి.

ఉత్పలమాల

పుట్టితి వబ్ధిలో తొలుత భూషణ మైతి
నృపాల మౌళులన్
మెట్టితి రాచకన్నియల మేనుల—
పూసలతోడ తీగకుం
గట్టి నినున్ ధరించినది కంఠము
నందొక భిల్లకాంత నే
డెట్టి యవస్థ గాంచితి విసీ!
అపురూపపు రత్న రాజమా!

*　　*　　*

చాతకం

చాతకపక్షి ఒకటి దాహ బాధతో గిలగిలలాడి పోతున్న సమయంలో ఆకాశంలోనుంచి ఒకే ఒక చినుకు రాలి పడుతూ ఉండడం కనిపించింది. అది చటుక్కున ఎగిరివెళ్లి సరిగ్గా దానికింద నోరు జాపింది. అంతలో హఠాత్తుగా ఒక గాలి తెరపిచ్చి ఆ చినుకును పక్కకు గెంటేసింది దాని నోట్లో పడకుండా.

ప్రభువు వారి అనుగ్రహం కోసం పడిగాపులు పడి ఉన్న ఒకానొక దీనుడికి ఒక్కపూటకి సరిపడే స్వయం పాకం మాత్రమే మంజూరు అయింది. అది అయినా అతడికి దక్కకుండా గద్దలా తన్నుకు పోయాడు మరొకడు.

స్వాగతా

చాతకేన తృషితేన యదంభో
బిందు మాత్ర మమలం పరి లబ్ధమ్
దైవతస్త దపి వాత నిపాతా
దన్యతః పతిత మాస్య మపాస్య.

ఆటవెలది

చాతకమ్ము దప్పిచేత కుందుచు నుండ
ప్రాప్తమయ్యె నొక్కవాన చినుకు
గాలి విసరి దైవ లీలచే నా చిన్కు
దాని నోట పడక తప్పిపోయె.

*　　*　　*

మేఘుడు గర్జించి గర్జించి ముక్కి మూలిగి నాలుగు చినుకులు విదలిస్తే చాతకం నోరు జాపి తాగుతోంది. అవునులే. దాత ఎన్నితిట్లు తిట్టినా మరో దారిలేని ఆశ్రితులు సహించి ఊరుకోక ఏం చెయ్యగలరు పాపం!

స్వాగతా

గర్జితాఽపి జలదేన వికీర్ణా
శ్చాతకైర్జ గృహిరే జలరేఖాః
దాతు రాశ్రిత జనాః పరుషోక్తీ
రప్య నన్య గతికా హి సహంతే.

ఆటవెలది

గర్జనమ్ము చేసి ఘను డిచ్చు చినుకులే
చాతకమ్ము నోరు జాపి త్రాగు
అన్యగతి విహీనులైన యాశ్రితు లెల్ల
దాత పరుషములను సైతు రెందు.

*　　*　　*

ఎర్రటి తామరపువ్వులతోనూ, ఒయ్యారాలు చిందించే రాజహంసలతోనూ కలకల లాడే సరస్సులు ఈ లోకంలో ఎన్ని లేవూ? దాహంగా ఉంటే వాటి లోని తియ్యని నీళ్లు నాలుగు గుక్కలు తాగ రాదూ? వీటి నన్నింటినీ విడిచిపెట్టి, పిడుగులు వర్షించే భయంకరమైన కాలమేఘాలను పట్టుకు దేవుల్లాడు తుం దేమిటో ఈ పిచ్చి చాతక పక్షి? అంతా ఖర్మ!

వసంతతిలక

కేవా వసంతి భువి వారి రుహోవతంసా
హంసా వలీ వలయినో జల సన్నివేశాః
కిం చాతకః ఫలమవేక్ష్య సువజ్రపాతాం
పౌరందరీం కలయతే నవ వారి ధారాన్.

ఉత్పలమాల

ఎన్ని సరోవరమ్ము లగుపింపవు
రాజమరాళ పంక్తులన్
కన్నుల విందుసేయు నవకంజ
వనమ్ముల సందడించుచున్
ఇన్నిటి వీడి యీ పిడుగు లేయు
నహంబు ధరంబు నందు నే
మున్నదటంచు నాసపడి యూరక
చాతక మంగలార్చునో!

*　　　*　　　*

కోకిల

కొత్తగా దర్బారుకివచ్చిన ఆంధ్రదేశప్పండితుణ్ణి తలుచుకుంటూ, వరాగ్గా అడుగులువేస్తూ రాజ నర్తకి లవంగి చాందినీ చౌకుదాటి ఏదో గల్లీలో ప్రవేశించింది ఆమె అడుగులలో ఏదోలయ. ఆమె నడుములో ఏవో హొయలు. ఆ ప్రాంతాల్లో ఉండే అనాగరికులైన మోటు మనుషులు ఆమె చుట్టూ జేరి వికవికలు పకపకలు మొదలుపెట్టేరు. ఆమెను విషపు చూపులతోనూ, ఎత్తి పొడుపులతోనూ హింసిం చారు. రాజసభలలో సార్వభౌముల సన్నిధిని అపూర్వ మైన నాట్య కౌశలాన్ని ప్రదర్శించి, రసిక హృద యాలను ఉర్రూత లూగించ గల ఆ కళాతపస్వినికి ఖర్మకాకపోతే ఇల్లాంటి చోటికి రావడమేమిటీ, ఇల్లాంటి మోటు మనుషులతో వివాదం ఏమిటి?

ఏ తియ్య మామిడి చెట్టుమీదనో, ఏ మంచి గంధపు చెట్టు చిటారి కొమ్మల మీదనో లేలేత చిగుళ్ళు కొరుకుతూ, కమ్మగా పాడుకుంటూ కాలం గడిపే గండుకోయిల ఈ రోజున గీత బాగులేక వేప చెట్టుమీదికి వచ్చిపడింది. అక్కడి బొంత కాకులు దానిని పొడిచి పొడిచి తరిమివేశాయి పాపం!

వసంత తిలక

యే నోషితం రుచిర పల్లవ మంజరీషు
శ్రీ ఖండ మండల రసాల వనే సద్వైవ
ద్వైవా త్సకోకిల యువా నిప పాత నింబే
తత్రాపి దుష్ట బలి పుష్ట కులై ర్వివాదః

మత్తకోకిల

మావిగున్నల మీదనో యెల
మంచిగంధపు చెట్లనో
కావి వన్నె చిగుళ్ల గుంపుల కమ్మ
కమ్మగ పంచమా
రావమున్ సవరించు కోకిల
వ్రాలె నేడొక వేపపై
త్రోవ తప్పగ—అందు కాకులతో
వివాదము దుర్విధీ!

*　　　*　　　*

కోతి

చాలా కాలం తరవాత జగన్నాథుడు పెద్దమేన మామగారి ఊరు—బెల్లంపూడి—వెళ్లేడు. మేనమామ కూతురు సీత, ఆమె భర్త పండుగకి వచ్చారు.

ఆ పిల్లా, తానూ చిన్నతనంలో కలిసి ఆడు కునే వారు. తుమ్మెండ, కిరికి, గచ్చకాయలు, చింత గింజలు—ఒకటేమిటి? తరుచు దెబ్బలాడుకునేవారు. జతపచ్చి చేసేసే వారు. మళ్లీ కలుసుకునే వారు. ఆమె సిసింద్రీ లాంటిది. దొడ్లో ఉన్న మామిడిచెట్టు ఎక్కేసేది. తనతో కుస్తీ పట్టేది. 'తోక లేదుగానీ కిష్కింధలో ఉండవలసిన దానివి' అనే వాడు తాను.

వయో భేదం ఎక్కువ లేదని మరొకరి కిచ్చి పెళ్లి చేశారు గానీ, లేకపోతే తనకు దక్కవలసినది ఆమె.

ఎన్నెన్ని జ్ఞాపకాలు! ఎన్నెన్ని సరదాలు! ఎన్నెన్ని ముచ్చట్లు!

ఆ పాత సంగతులు నెమరు వేసుకుంటూ బెల్లంపూడి వెళ్లి, సీతని చూచి, నిర్ఘాంతపోయాడు జగన్నాథుడు. ఆమె వెనకటి సీత కాదు. వెనుకటి ఉత్సాహం, నవ్వులూ, కబుర్లూ మచ్చుకైనా లేవు. జీవచ్ఛవంలా ఉంది. ఆమెను అల్లా తయారుచేసిన ఘనత ఆమె భర్తది. అతడొక మొరటువాడు. కోపిష్టి. అనుమానపు మనిషి. తరుచు ఆమెకు దేహ శుద్ధి కూడా జరిగేదిట.

ఆమె వాలకం చూసి జగన్నాథుడు నీరు కారి పోయాడు.

వీధిలో డమరుకం వాయిస్తున్న చప్పుడు విని పించి, బయటికి వచ్చాడు. పాముల వాడొకడు నడి వీధిలో కోతిని ఆడిస్తున్నాడు. ఆ కోతిలో ఉత్సాహం ఏమీ లేదు. యజమాని భయంచేత తప్పదన్నట్లు ఈసురోమంటూ ఆడుతోంది. దానిని చూడగా సీత పరిస్థితి గుర్తుకు వచ్చింది.

ఓ కోతీ! గబగబా చెట్లెక్కడం, కొమ్మలు ఊపడం ఏమయి పోయాయి? కోపంగా పళ్లు ఇగిలించడం ఎక్కడికి పోయిందీ? ఒకదాన్ని ఒకటి తరుము కుంటూ, కిచకిచ మంటూ, పేలు కుక్కుకుంటూ పొందే అసౌఖ్యమూ, ఆ సరదాలూ ఏమయిపోయాయి? ఈ పాపిష్టి పాములవాడికి చిక్కి, వాడిచేత తన్నులు తింటూ, పామును మెడకి చుట్టుకుని, ఒంటికాలి మీద నృత్యం చేస్తున్నావా? అయ్యయ్యో!

శార్దూల విక్రీడితం

వృక్షాందోళన మద్యతే క్వనుగతం
నర్మ స్వయూథ స్యవా
యూకా న్వేషణ రోష సౌఖ్య బహుళా
శ్చేష్టా ముఖోత్థాః క్వతాః
క్వారణ్యే ఫలపూర్ణ గల్లకుహర స్యా
న్యేషు తా భీషికాః
భీతః సంప్రతి కౌశికా ద్గలవల
ద్వ్యాలః కపే! నృత్యసి.

ఉత్పలమాల

ఎక్కడబోయె చెట్లపయికెక్కుట
దూకుట కొమ్మ లూపుటల్?
ఎక్కడ బోయె పండ్లు నిగిలించుటలున్
తలపేలు కుక్కుటల్,
వెక్కిరిపించి మమ్ము భయపెట్టుట?
పాముల వానిచేతికిం
జిక్కిన కోతి! నర్తనము చేసెదు
పీకకు పాము చుట్టుచున్.

* * *

సముద్రం

మనదగ్గర ఉన్న మంచి మంచి వస్తువులన్నింటినీ నాకంటే నాకు అని గడుసుగా తీసుకుపోయే వాళ్లేగాని, మనకి కష్టాలువస్తే ఆదుకునే వాళ్లు ఒక్కరూ ఉండరు కదా! అని నిట్టూరుస్తున్నాడు పండితరాయలు.

సముద్రంలోనుంచి పుట్టుకు వచ్చిన లక్ష్మీ దేవిని విష్ణుమూర్తి ఎగరేసుకు పోయాడు. అమృతాన్ని దేవ గణములు జుర్రేశాయి లొట్టలు వేసుకుంటూ. కల్పవృక్షాన్ని ఇంద్రుడు తీసుకుపోయి తనపెరటి దొడ్లో పాతుకున్నాడు. అర్ధచంద్రుణ్ణి శివుడు తీసుకుని తలలో అలంకరించు కున్నాడు. మందర పర్వతాన్ని కవ్వంగా అమర్చి తన గర్భాన్ని మథించి బాధించి నప్పటికి వారికందరికీ తన సర్వస్వాన్నీ సంతోషంగా సమర్పించేశాడు సముద్రుడు. అప్పనా? అటువంటి సముద్రాన్ని అగస్త్యుడు పురిషిట్లో పోసుకుని తాగేస్తూ ఉంటే, వాళ్లల్లో ఒక్కరంటే ఒక్కరైనా వచ్చి అడ్డుపడ్డారా? ఆఖరికి చిటికెన వేలైనా పైకి ఎత్తేరా?

శార్దూల విక్రీడితం

పీయూషేణ కృతార్థితా దివిషదో
లక్ష్మ్యైవ హరిః ప్రీణితః
చంద్రార్ధేన విభూషితః పశుపతిః
కల్పద్రుమై ర్వాసవః
ఆత్మానం పరిమథ్నతా ముదధినా
కిం కిం నతేషాం కృతం
తస్యాగస్త్య ముని ప్రసీత పయసో
నోచ్చైః కృతైకాంగు ళిః

మత్తేభ విక్రీడితం

తనిపెన్ విష్ణువు లక్ష్మిచేత, సుధచే
దైవాళి, కల్పద్రుమం
బున దేవేంద్రుడు, నర్ధ చంద్రకళ చే
ముక్కంటి, తీవ్రోద్ధతిన్
తన గర్భమ్ము మథించు వారికి
సముద్రం బిచ్చె సర్వస్వమున్
వనరాశిన్ ముని పీల్చువేళ నొకరైనన్
వచ్చి వారించిరే?

[ఇందులో ఉదాహరించిన తెలుగు పద్యాలు డా. మహీధర నళినీమోహన్ అనువదించిన భామినీ విలాసంలోనివి.]

తిక్కనగారి "ఉభయ కావ్య ప్రౌఢి"

శ్రీ ముదిగొండ ఈశ్వర చరణ్

అమలోదాత్త మనీష నే నుభయ
కావ్య ప్రౌఢిఁ బాటించు శి
ల్పమునం బారగుఁడం గళావిదుఁడ
నాపస్తంభ సూత్రుండ గౌ
తమ గోత్రుండ మహేశ్వరాంఘ్రి
కమల ధ్యానైక శీలుండ న
న్నమకుం గొమ్మన మంత్రికిం సుతుఁడఁ
దిక్కాంకుండ సన్మాన్యుఁడన్!'

తెలుఁగు దేశము, తెలుఁగుజాతి 'మోదము, బోరయు'ఁ గంటముఁ బట్టిన 'తెలుఁగుకవి' తిక్కనామాత్యుఁడు. ఆ కవిబ్రహ్మ తనను గూర్చి పై రీతిని జెప్పుకొనెను. ఇందాయన తనవిగా రెండు విశేషణములను గూర్చు కొనినాడు. అందొకటి—'ఉభయ కావ్య ప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుఁడు.' రెండవది—'కళావిదుఁడు.'

అమలోదాత్తమైన మనీష చేత నుభయ కావ్యములయొక్క ప్రౌఢి (ని) యందుఁ బాటింపవలసిన శిల్పమునందునఁ బారగుఁడనియుఁ, గళయొక్క సొంపు విదితమై యున్నవాడనియు నన్వయముఁ జేసుకొనవలసి యున్నది.

ఇది యిట్లుండ—కేతన యాదిగాఁగల ప్రాచీనాధునికాంధ్ర కవిత్వ తత్త్వ వివేచనా శీలు రెల్లరు 'నుభయ కావ్యము' లనఁగా సంస్కృతాంధ్ర భాషోభయ కావ్యములుగా గురుతించి వ్యాఖ్యానించి యున్నారు. ఆ యభినవదండి తిక్కనామాత్యునకు సన్నిహితుఁడు. మిక్కిలి కూర్చువాఁడు. ఆయన చేత సగౌరవముగా 'గృతిని'మ్మని గోరఁబడిన వాఁడు. అట్టివాఁడు తిక్కన గారు 'తెనుఁగున సంస్కృతమునఁ జతురుఁ 'డనియు' 'నుభయ భాషలయందు లలిత నానా కావ్యములు చెప్పు'ననియు కంఠోక్తిగాఁ జెప్పిన విషయమును గాదనుట సాహసమూలమే యగును. మఱి యా కవిబ్రహ్మ

సకుఁగల సంస్కృతాంధ్ర భాషా పాండిత్యప్రకర్షయు, నుభయ భాషా కావ్య రచనా సంవేదిత్వమును జెప్పుకొనఁదలఁచి వాచ్యముగా 'నుభయ భాషా కావ్యము' లనుటకు మారుగా సూచ్యముగా 'నుభయ కావ్యము' లని గణములకై కక్కుర్తి పడెననుట యా మహనీయునకుఁ దీరని యపచార మొనర్చుటయే యగును. ఎగనేసిన శిశుహత్య. దిగవేసిన బ్రహ్మహత్య. ఎట్లు సమర్థించుట?

ఒక మహావిషయ మున్నది. అనాదిగా తెలుఁగు దేశమును, తెలుఁగు బాసను, తెలుఁగు ప్రజలనుబట్టి పీడించుచు నున్న యొక మహారుజ యది.

ప్రాచీన కాలమునఁ దెలుఁగునఁ బరిశ్రమించిన యెల్లరును దొల్త సంస్కృతమున విశేష పరిశ్రమ యొనర్చి యందలి మెళుకువలను దలస్పర్శిగా గ్రహించి తెలుఁగు విషయమునఁ దాము చెప్పెడి చొప్పునంతయు సంస్కృత మర్యాదల చేత మెప్పించెడి వారు.

ఆధునిక కాలమునం దాంగ్లభాషా కావ్యవిశేష వైశిష్ట్యముల నెల్లఁ బుక్కిలించుకొని తెలుఁగు రీతుల కొక యుపాధి కల్పన గావింపుచు నున్నారు.

ఈ యిరు దెగల పండిత మాన్యుల మేధాశక్తిని గించ పరచుటకుఁ గాదు కాని, వాస్తవము విచారింప వీరి వీరి దురభిమానములచేత తెలుఁగుఁదనమునకు నపచారము జరిగిన దనుట శాంతముతో నోచించిన తెలియ నగును. ఒకరు సంస్కృతమున నాలోచించి తెనుఁగున మాటాడ, మరియొక రాంగ్లమున భావించి తెనుఁగును సంభావింతురు. ఈ యిరువురు తెనుఁగుఁదన మొకటి యున్నదనుట మరచినారు. వీరల నడుమఁ జిక్కి యొకఁడు తాను తెనుఁగుననే యాలోచించి భావించునని మొత్తుకొనిన నాతని మరు మాటాడఁగనీక వీరు తమ తమ సిద్ధాంతముల కనుసారముగా నాతని వ్యాఖ్యానింతురు.

ఇచ్చట సరిగా నింతియే జరిగినది. కేతనార్యునకు సంస్కృతము మిక్కిలి యభిమాన పాత్రము. ఈ విషయము నాతఁ డొకటికి రెండు మార్లు తన కృతి దశ కుమార చరిత్రమున 'సంస్కృతాది భాషలఁ గావ్య కర్తృత్వమున నతిఁ గన్నవా'డు, 'సంస్కృతాద్యనేక భాషా కావ్యరచనా విశారదుం'డని (ద. కు. చ. పీఠిక 23, 24) నొక్కి చెప్పుకొనినాడు. తనకుఁ గల సంస్కృతాభి నివేశమును తిక్కన గారికిని యంటఁ గట్టినాడు.

ఇట్లు వ్రాయుట తిక్కనా మాత్యునకు సంస్కృతమే రాదనుట కాదు. ఒక్క శ్లోకము చేతనే సర్వ జగన్నియామకుని మెప్పించి యొప్పించిన వాఁడా మహితాత్ముఁడు. వాల్మీకి కృత రామాయణ మహాకావ్యమును దెనుఁగున నూత్నమునైన స్వయం నిబద్ధ విశిష్ట నిబంధనల తోడ వ్రాయఁబూనిన వాఁడా మహనీయుఁడు. వ్యాసకృత మహాభారతము 'నాంధ్రావళి మోదముం బొరయ' వెలయింపఁ దలఁచిన వాఁడా కవి వృషభుఁడు. అట్టివానికి సంస్కృతము రాదనుటయా? అగుచో చెప్పఁదలఁచిన దేమి?

ఆతని సంస్కృతాభిమానము మేర మీరినది గాదనుట. అది సర్వజనీన మగుఁగాక. అది సమస్త వాఙ్మయ ప్రతిపాదక మగుఁగాక. అది దేవ భాషయే యగుఁగాక. అందాయనకుఁగల విజ్ఞాన సంపచ్చాతురి యంతయు తెలుఁగు 'బాస'ను సంపన్న మొనర్చుటకే వినియోగింపఁబడిన దనుట. తెలుఁగుఁ దనముఁ గూర్పవలసిన చోట నా తెలుఁగు కవికి తదితరమేదియు, నెంత గొప్పది యైనను బనికిమాలినదే యనుట. ఆయన 'తెలుఁగు కవిత్వము చెప్పందలచిన కవి' (ని. రా. 7.) 'జాత్యము గామి నొప్పయిన సంస్కృత మెయ్యెడఁ జొప్ప'నని యాతని ప్రతిజ్ఞ. (ని. రా. 14.)

అట్టి యా కవిబ్రహ్మ 'యాంధ్రావళి మోదముం బొరయు నట్లుగ......మహాకవిత్వ దీక్షా విధి నొంది' మహాభారతామ్నాయమును 'దెనుంగు బాస' వినిర్మింపఁ బూనెను. పూని ఆదికవి నన్నపార్యుని స్మరించెను. 'అందాది దొడంగి మూడుకృతులాంధ్ర కవిత్వ విశారదుండు విద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్.'

రాజ రాజుచే సంప్రార్థితులై నన్నయగారాంధ్ర భారత రచన కుపక్రమించి తనను గూర్చి కొంత చెప్పుకొనిరి. ఆయన 'అవిరళ జపహోమ తత్పరుఁడు, విపుల శబ్ద శాసనుఁడు. సంహితాభ్యాసుఁడు. బ్రహ్మాండాది నానాపురాణ విజ్ఞాన నిరతుఁడు. ఉభయ భాషా కావ్య రచనాభి శోభితుఁడు.'

ఇట్లింం కెన్నెనియుఁ జెప్పుకొనినాడు. అయినను తిక్కన గారి నాకర్షించిన నన్నపార్యుని గుణ విశేష మొక్కటియే! అది ఆయన 'ఆంధ్ర కవిత్వ విశారదత్వము.'

ఒక మహావిషయ మున్నది. అది పలువురచే సంభావింపఁ బడును. ఇట్లు సంభావింపఁ బడుటలో నొక రీతి యుండును. ఒక విలక్షణత యుండును. ఇది యా విషయగతమైనది కాదు. దానిని సంభావించెడి వారి మనోగత మైనది. ఏ రెండు ఘటికా యంత్రములు సరిగా నొక సమయముఁ జూపవనుట కలదు గదా! అట్లే ఏ యిద్దరు వ్యక్తులు నొకే రీతిని భావింపరు. అది వారి వారి సంస్కారముపై యాధారపడి యుండును. అది వారి వారి వివేచనా సరళిపై యాధారపడి యుండును. అనగా నది యా జీవుల తత్త్వ నిష్ఠము. తిక్కనామాత్యుని జీవ తత్త్వమునకు నన్నపార్యుని యాంధ్ర కవిత్వ విశారదత్వము సరి పడినది. ఎందులకు? తానును ఆంధ్ర కవిత్వ విశారదుఁడు గనుక. ఆంధ్రాభి మానము, ఆంధ్ర కవిత్వాభిమానము తనను లోగొనినవి కనుక. ఇందుల కర్థము నన్నయ గారి తక్కిన గుణములు తిక్కనగారి కనిష్టములని కాదు. లోకమున యొకఁ డున్నాఁడు. వాఁడు తన బిడ్డలను ప్రేమించును. ఇతరుల బిడ్డలను సైతముఁ బ్రేమించును. ఈ రెండు ప్రేమలు నొకటియే కావు కదా? తనది యను దానిపై గల మక్కువ మరియొక దానిపై నుండదు. ఇది లోకముయొక్క స్వభావము. ఒకడు షేక్స్పియరు. ఒకడు కాళిదాసు. ఒకడు నన్నయ. లోకాతీత కవితా కళా వ్యాపారులుగా

మన కీ మూపురు సంభావ్యులే! కాని వారల మనను సంభావించెడి తీరులో భేద మున్నది. నన్నయగారు మన వాఁడు. కాళిదాసు మన దేశీయుఁడు. షేక్స్పియరు మన మానవుఁడు. ఈ తర తమ భేదము మానవుఁ డన్నవానికి నుండును. లేనిచో వాఁడు మానవుఁడు కాడు. మానవాతీతుఁడు. రాగ ద్వేష రహితుఁడైన దైవతుల్యుఁడు. తిక్కన గారు మానవుఁడు. ఆయనకుఁ దన జీవ తత్త్వమున కధి(ప్రేత)మైన యాంధ్ర కవిత్వ విశారదత్వము నన్నయ గారిలోనూ కానుపించినది. కానిచో తనకై తాను నన్నయ గారు కూర్చుకొనిన సమస్త విశేషణముల వదలుట యేమి? ఆతని యాంధ్ర కవిత్వ విశారదత్వము నెన్నుట యేమి? వలయుచో మరియొక తీరునఁ గీర్తింప లేకయా? ఇట్లే కేతన గారికిని తన కథిమాన పాత్రమైన సంస్కృత భాషా కావ్య నిర్మాణ దక్షత తిక్కనామాత్యునియందుఁ గాన్పించినది. తిక్కన గారు పూను కొనలేదు గాని— నిజమున కా మహానుభావుని గంటము సంస్కృత కావ్య రచనమునకే గడంగిన కాళిదాసునితో సరి గద్దె నధివసింప కుండునా?

మఱియొకమాట. తిక్కన గారు నిర్వచనోత్తర రామాయణమునఁ జెప్పిన నేమి? 'తెలుఁగు కవిత్వము చెప్పందలచిన కవి' యెట్లు చెప్పవలెనో చెప్పిరి. 'సంస్కృత శబ్దము తెలుఁగు విశేషణంబు తేట పడంగాఁ బలుకు నెడ లింగ వచనంబులు భేదింప' కుండ వలె నని చెప్పిరి. 'జాత్యము గామి నొప్పయిన సంస్కృత మెయ్యెడఁ జొన్ప' ననిరి. ఇంతయు నాడు శివ కవులు ప్రచారమునకుఁ దెచ్చిన 'మణి ప్రవాళ' రచనా సరళిని నిరసించుటకై చెప్పిరి. తెనుఁగుఁదనము రూపించుటకై చెప్పిరి.

విరాట పర్వమున నా కవి బ్రహ్మ మఱియు స్పష్టముగాఁ జెప్పెను. " 'తెనుంగు బాస' జన సంప్రార్థ్యంబులై పెంపును దుది ముట్టన్ రచియించు టొప్పు బుధ సంతోషంబు నిండారగన్" (7). తెనుఁగు జనులచేత సంప్రార్థ్యంబులై, తెనుఁగు బుధులకు సంతోషంబు కాగా 'తెనుంగు బాస'లో—రచియించుట యాతని యభిమతము. ఇచట 'తెనుంగు బాస' యనుట గమనార్హము. 'తెనుంగు భాష' యన వచ్చును గదా! ఆయన యొక పద్యమును ప్రారంభించెను. అది యంతయు తత్సమ పదభూయిష్ఠమై యున్నది. 'హృదయాహ్లాది చతుర్థ మూర్ఛిత కథోపేతంబు, నానా రసాభ్యుదయోల్లాసి' యిత్యాది. ఇట్లు వ్రాయుచు 'తెనుంగు భాష' యన్న మరియు నుచితముగా నుండెడిచోటఁ గావలెనని పనిగట్టుకొని 'బాస' యనెను. ఆయనయే కాదు. ఆయన కృతిపతి హరిహరనాథుఁడును 'తెనుఁగు బాస' యనెను. ఇట్లు రెండు మార్లు ప్రయుక్తమైన యీ వికృతి వివేకము యొక్క విలక్షణత గుర్తింపవలె. 'ఋషీణాం పునరాద్యానాం వాచ మర్థోఽనుధావతి' యని కదా!

నన్నయ కవి నాథుని త్రోవనే చనినను తిక్కన గారు తమ జాతీయాభిమానమును సంపూర్ణముగా వెలయించిరి. నన్నపార్యునిది తత్సమ భూయిష్ఠమైన రచన యగుటయు, తిక్కనార్యునిది తెనుఁగు పలుకుబడి ప్రధానముగాఁగలది యగుటయు తత్త్వ వివేచనాశీలురకు సుస్పష్టమే! మహాభారత తొలి పర్వము లందున కన్న మలి పర్వముల యందు తిక్కన గారు తెలుఁగు మాటల మరియు విరళముగా ప్రయోగించుటయుఁ దెల్లమే. ఇట్లు బహుభంగుల తన యభినివేశమునుఁ దెలియఁజెప్పు యొక కవి వరేణ్యుఁడు, తన వారికై, తన 'బాస'లో నొక మహాకృతి నెలయింప నాతఁడు సూచ్యముగాఁ దనకుఁగల యన్య భాషా కావ్య రచనా ప్రౌఢిమను సూచించి నాడన్న నేమనఁగలారము?

ఇది యొక రీతి. మఱియొక తీరును గలదు.

కేతనగారు మరియుఁ జెప్పిరి. 'అగుననఁ గొమ్మయ తిక్కఁడు జగతి నపూర్వార్థ శబ్ద చారు కవితమై నెగడిన 'బాణోచ్ఛిష్టం జగత్త్రయం' బనిన పలుకు సఫలం బయ్యె' (ద. కు. చ. పీఠిక. 90) నని చెప్పెను.

తిక్కన గారు రచించినవి రెండు. అవి రెండును దశకుమార చరిత్ర కృతిగొనిన తరువాతనే రచియించి

రని చెప్పఁబడుచున్నది. ఇవికాక 'విజయసేన' మను ప్రబంధ మొకటియు; ఛందోగ్రంథ మొకటియు రచియించి రను ప్రతీతి కలదు. ఇవి సంశయాస్పదములు. ఇందు 'విజయసేన' మలభ్యము. మఱి 'బాణోచ్ఛిష్టం జగత్త్రయం' బను ప్రశస్తికిఁ దగిన తిక్కనగారి వేరొక కృతియేది? కేతన గారి పలుకుల సమన్వయ మొనర్చుకొనుట యెట్లు? కొందరు 'నిర్వచనోత్తర రామాయణము' 'దశకుమార చరిత్ర'కుఁ బూర్వమే వ్రాయఁబడిన దందురు. ఇది నిక్కువమే యగచోఁ దన కృతిభర్త కీర్తి సౌధమునకు మూలస్తంభమైన కృతి పేరు కేతన గారు తలంపక పోవుటకు కారణ మేమి? ఇంతయుఁజూడ కేతన గారు కొంత యతి శయోక్త్యలంకారము నభిమానించి యుందురని తలంపవలసి వచ్చు చున్నది. మఱియొక మాట. కేతన గారు తాము స్వయముగా 'సంస్కృతాది భాషలఁ గావ్య కర్తృత్వమున నుతిఁగన్నవా'డ నని జెప్పుకొను టయే కాక తమ కృతిభర్తయుఁ దమను 'సంస్కృతా ద్యనేక భాషా కావ్య రచనా విశారదుం'డని సంభా వించిరని చెప్పుకొనిరి.

కేతన రచితములు దశకుమార చరిత్ర, లక్షణ సార సంగ్రహము, విజ్ఞానేశ్వరీయములు. ఇవి మూఁడును తెలుఁగుననే రచియింపఁబడినవి. ఇంక నాతఁడు రచి యించిన 'సంస్కృతాద్యనేక భాషా కావ్య'ములేవి? అట్టివేవో రచియించి నట్లు ప్రతీతియైన లేదు కదా? పై వాక్యముల కర్థమేమి? ఇట్టి వెన్నియో ప్రశ్నలు గలవు. మరి సమాధానములో...? ఒక యవకాశము గలదు. 'వాక్యం రసాత్మకం కావ్యమ్!' నాఁడు పండిత సదస్సు లుండెడివి. తిక్కన గారు అట్టి సదస్సుల నగ్రాసనాధిపతులై పండితుల, కవుల పరీ క్షించి, సన్మానించుచుండిరి. అట్టితరి తిక్కన కేతన గారలు తాము ను ఒకటి రెండు శ్లోకములనో పద్యములనో చెప్పియుందురు. అవి యెల్లరకు స్తుతి పాత్రములైనవి. ఇట్టి వానిని దృష్టి నిడు కొనియే కేతన గారు పై రీతిని చెప్పియుందురు. ఇది యొక యూహ. కానిచో నా యభినవదండి యస త్యము చెప్పినా డందువా?

సంస్కృతాంధ్ర భాషా కావ్యములని కానిచో 'నుభయ కావ్యము' లనుటను మరియొక తీరునను గురుతింప వచ్చును. కుమారసంభవ కర్త 'కవిరాజ శిఖా మణి' నన్నెచోడుడు తిక్కనగారి కన్న కొంత ముందు తరము వాడని నిర్ణయమైనది. అపవాదము లున్న నవి పరాభూతములైనవి. ఆయన 'మార్గ', 'దేశి' కావ్యము లని రెండు తీరులు చెప్పెను. ఆయనకు సమకాలి కులు, తరువాతి వారునైన కొందరు శివ కవులు తమ కవిత్వము 'దేశి' యని చెప్పుకొనిరి. తిక్కనగా 'రుభయ కావ్యము'లఁ గూర్చి ప్రసంగించు నెడ వారి దృష్టి యీ మార్గదేశి భేదములపై ప్రసరించి యుండెనా యనునది యొక విచిత్రపు టూహ! నన్నెచోడుని 'మార్గ, దేశి' భేదములను తెలుఁగునాఁడు ఆదరించ లేదు. ఏ ఒక కొందరో వీని ననుసరించిన నా యుద్ధృ తము కలకాలము నిలువలేదు. మఱియు తిక్కన గారి స్వభావ పరిశీలన మొనర్చినవారికి నీ భేదములు తిక్కనగా రూహింపనైన లేరని తెలియును. ఆయన కవితా కళ నొక 'యారాధన విశేషంబు'గ స్వీకరించిరి. 'పరమేశ్వరునిం గృతినాథుఁ జేసి యే పట్టునఁ బూజ్య మూర్తి యగు భారత సంహితఁ జెప్పఁగంటి, నా పుట్టుఁ గృతార్థతం బొరసెఁ బుణ్యచరిత్రుఁడ నైతి' (వి. ప. 27.) నని పొంగిపోయిన యా పుణ్యమూర్తి నీరసములు నిష్ప్రయోజనములు నగు తీరుతెన్నుల నాదరించి రనుట యసంగతమగును.

తిక్కనగారు ఋషి కల్పులు. ఆయన యజ్ఞము లొనర్చి మనోవాక్కాయములఁ బునీత మొనర్చుకొని కవితా కళా సాధనయు నొక పవిత్ర యజ్ఞముగా భావించిన మహనీయుడు. అట్టి యాతఁడు చెప్పిన యర్థమును గ్రహియించుటకు శ్రద్ధ కావలె. జిజ్ఞాస కావలె.

ఆయన తా 'నుభయకావ్య ప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుఁడ'నని చెప్పుకొనెను. ఇచ్చట నాతఁడు చెప్పఁదలఁచినది 'యుభయ కావ్యము'ల ప్రశంస కాదు. వాని ప్రౌఢి. తత్కారణమైన 'శిల్పము'. 'ఉభయ కావ్యములకుఁ గౌరవాపాదకమైన ప్రౌఢిమను

బాటించుటకు వలయు శిల్పరీతియందు నేను ప్రవీణుడ'నని యాయన కంఠోక్తిగాఁ జెప్పుకొనిన విషయము. అనగా నిందు ప్రధానముగాఁ బ్రసక్తమైనది 'శిల్పము'.

శిల్పమనగా నేమి? కథా సంవిధానము, పాత్ర చిత్రణము, రస పోషణము, అలంకార భూషణము, రీతి, శయ్య, పాక మిత్యాదిగాఁ గల కావ్యగత బహు విషయ సమాహార భూతమైన యొకానొక మహా విషయము శిల్పము. విచిత్రము, ప్రతిభా చాతుర్య ద్యోతకము. విజ్ఞాన విశేష బోధకము, శ్రవణ నయన హృదయ రంజకము నగు యొకానొక భావ విశేషము శిల్పము. ఇట్టి శిల్పము కావ్యనిష్ఠము. అనగా—నొక నవల వ్రాయుదుము. ఒక కథానిక వ్రాయుదుము. ఒక కావ్యము వ్రాయుదుము. ఒక పురాణము వ్రాయుదుము. వీనియందు నిర్వహింపఁ బడెడి శిల్పములు వేరు వేరుగా నుండును. ఇట్లు వేరు వేరుగా నుండుట చేతనే యిది నవల—యిది కథానిక యిత్యాదిగా పృథక్కరింప వీలగుచున్నది. లేనిచో నన్నియు నొక్కటియే! భిన్నసాహిత్య ప్రక్రియలనుమాట వ్యర్థమగును.

ఇంతియకాదు. శిల్పము కవి నిష్ఠముగూడ. అనగా - నొక కవి వ్రాసిన యట్లు మరి యొకడు వ్రాయడు. ఒకఁడూహించిన యట్లు మరి యొకఁడు భావింపఁడు. అట్లుగానిచో నిందరు కవులేల? ఏ ఒకడో యిద్దరో నుందురు. ఒకే రీతి నున్నవి యని స్థూలదృష్టికిఁ గోచరించెడి బహు ప్రబంధముల సైతము—ఒక భావన లోనో—ఒక చిత్రణ మందో—ఒక ఊహయందో భేద ముండుట చేతనే యవి నేటి వరకు నిలచినవి. ఆ భేదమే శిల్పము. కావున శిల్పమనునది ప్రకియా భేదముచేత, వ్యక్తిభేదము చేత భేదించును. ఉభయ కావ్యములను చోట సంస్కృతాంధ్ర భాషా కావ్యములని చెప్పుకొన్నచో సంస్కృత కావ్య శిల్పము, ఆంధ్ర కావ్య శిల్పమను రీతిని యర్థము చెప్పుకొనవలసి యుండును. అనగా—భాషను బట్టి శిల్పమును మారునని సిద్ధించును. కాని యిది నిజము కాదు. ఎందులకనగా నిదియే **విజ**మైన సంస్కృతమున వ్రాయఁబడిన సర్వా**లంకార** శాస్త్రములు, నేఁ డాంగ్లమునుండి యెరువు తెచ్చుకొనుచున్న సమస్త సాహిత్య విమర్శక సూత్రములు తెలుఁగునకు వర్తించుట యెట్లు? భాషలు మారవచ్చును. కాని శిల్పము మారదు. సంస్కృతాంధ్ర మహాభారతములఁ గానవచ్చెడి భేదము భాషాభేదము చేతఁ గల్గినది కాదు. ఒకటి యితిహాసము గను మరి యొకటి కావ్యము గను వ్రాయఁబడుట చేతఁ గల్గినది. కావున తిక్కనగారి 'యుభయ కావ్యము'లు సంస్కృతాంధ్ర భాషోభయ కావ్యములు గావనుట ఫలితార్థము.

ప్రసిద్ధములైన కావ్యభేదములు రెండు. ఆలంకారికులు వానిని దృశ్య శ్రవ్య కావ్యములనిరి. వాస్తవమునకు మన సమస్త యలంకార శాస్త్రములు దృశ్య కావ్యములవియైన లక్షణమునే ప్రతిపాదించినవి. భరత మహర్షి తొల్దొలుత కావ్య శబ్దమును దశరూపాత్మకముగనే వాడెను. ఆ పిదప యానందవర్ధనాచార్యుఁడు భరతాచార్యాదులు ప్రపంచిన రూపకరస సిద్ధాంతమును శ్రవ్య కావ్యమునకు సమన్వయించెను. అభినవగుప్తపాదులీ సిద్ధాంతమును ప్రచారము గావించిరి. నాటినుండి దృశ్యశ్రవ్య కావ్యభేదములు బహుళ ప్రచారమును గాంచినవి.

ఈ రెండు తీరుల కావ్యములకు నాత్మయొక్కటియే యైనను రచనా శిల్పమున భేదము గలదు. దృశ్యకావ్యములు సువాదాత్మకములు. వీని రచనయందు కవికి స్వాతంత్ర్యము మిక్కిలి తక్కువ. ఉండెడి యన్ని కథలును నాటకోప యుక్తములు కానేరవు. ఉపయుక్తములైన కథలు సైతము ప్రత్యక్షరము నాటకమున వ్రాయుటకు వలనుపడదు. కవి బహు జాగరూకతతో నాటకీయములైన భాగముల నెన్నుకొని నాటకోచితమైన రీతిలోఁ బ్రబంధింప వలసి యుండును. ఇట్టి వివేచన మహాకవియైన వాడు చేయును. అనగా నాటకీయమైన శిల్పముయొక్క తత్త్వరహస్యము నెరింగిన వాడు చేయును. కావుననే 'నాటకాంతః హి సాహిత్య'మ్మనియు 'కావ్యేషు నాటకం రమ్య' మ్మనియు చెప్పఁబడినవి.

శ్రవ్యకావ్య రచనమునఁ గవికి మిక్కిలి యవకాశము గలదు. అతఁడు తనివి దీర తను మెచ్చిన దాని వర్ణింపఁ గలఁడు. తన యిచ్చవచ్చిన రీతి ప్రతి స్వల్పవిషయమును పరిచయము గావింపఁ గలఁడు. ఇట్లయ్యు నాతనికిని హద్దులు గలవు. ప్రధాన కథ కవరోధముఁ గల్పించి యవాంతర విషయముల నెత్తుకొనినచో పాఠకున కాతనిపై సానుభూతి నశియించును. ఆతని కావ్యము సున్నితమైన మనస్కుడైన వాని కుపాదేయము కానేరదు. అనగా నేది వ్రాయుచున్న నెట్లు వ్రాయవలె ననునది యుండనే యుండును. ఇదియే శిల్పము. కాగా శ్రవ్య కావ్యము కథా కథనాత్మక మగుటచేత శ్రవ్యకావ్య శిల్పము దృశ్యకావ్య శిల్పమునకు భేదించును.

ఈ దృశ భేద సాదృశముల క్షుణ్ణముగా నెరింగి వలయు రీతుల నవ్వాని నుపయోగించుకొనుచు రచన చేయువాఁడు మహాకవి. తిక్కనగారు కేవలము మహాకవియే కాదు కవిబ్రహ్మ.

ఆయనకు శ్రవ్య దృశ్య కావ్య శిల్పముల మేళవించి 'యాంధ్రావళి మోదముం బొరయ' సాహిత్యము సృష్టింపవ్వలె నను పవిత్రమైన యూహ నిర్వచనోత్తర రామాయణ రచనా కాలము నాటికే యేర్పడెను. ఇందులకు ప్రముఖమైన కారణము గలదు. శ్రవ్య కావ్యములకన్న దృశ్య కావ్యములు శక్తివంతములైనవి. శ్రవ్యకావ్యముల శ్రోత తాను విన్నదానిని త్వరలోనే మరచి పోయెడి ప్రమాద మున్నది. అంతియ కాదు. తాను విన్నదాని నంతయు నక్షరశః యర్థము చేసుకొన గల్గుటయు నందరచేత యగు నది కాదు. దృశ్య కావ్యములన్ననో—తాను దేనిని వినుచున్నాడో దానిని నటుఁడు రంగస్థలముపై నాంగిక, వాచికాహార్య సాత్త్వికాభినయములఁ బ్రదర్శించి చూపుటచేత భాష యర్థము గాక పోయినను భావము మాత్రము హృదయమునఁ బదిలమగును. వినుకలికన్న కనుకలి బలీయము గదా! తిక్కనగారి కీ రహస్య మవగతమైనది.

తిక్కనగారు నిర్వచనోత్తర రామాయణమును రచియించిరి. మహాభారతము నాంధ్రమున వినిర్మించిరి. ఈ రెండు మహాకార్యముల నామహితాత్ముఁ డూరక యుబుసు పోకకై చేసినవాఁడు గాదు. ధర్మాద్వైత సిద్ధి, పరమత సహనము, విశ్వమానవ సౌభ్రాత్రము

కార్యదీక్ష, ప్రయత్నశీలత, పురుషకారమునందు విశ్వాసముం బెంపొందించెడి 'లోకహిత నిష్ఠం బూని గావించి' నాడు. ఇందుల కాతఁడు తొలుత గ్రహియించినది 'మర్యాదా పురుషోత్తము'ఁడైన శ్రీరాముని కథ. 'వేదములకు నఖిల స్మృతివాదములకు బహుపురాణ వర్గంబులకున్ వాడైన చోటులను దామూదల ధర్మార్థ కామమోక్ష స్థితికి' నైనది ద్వితీయము. (వి. ప. 4)

ఇట్టి 'మహాకవిత్వ దీక్షావిధిఁ బొందిన' వాఁడూరక నీరసమగు రీతి, హృదయాహ్లాదము కాని భంగిఁ గాసట బీసటగా వ్రాసిన యాశయము నెరవేరునా? ఇంతయు నాలోచించి, వివేచించి యా మహానుభావు 'డమలోదాత్త మనీష నే నుభయ కావ్యప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుడ — కళావిదుఁడ'నని చెప్పుకొనెను. మరియు తిక్కనగారి రచనయందలి 'నాటకీయత'ను గూర్చి క్రొత్తగాఁ జెప్పవలసినది లేదు. పలువురు పండిత ప్రవరు లీవరకే తద్విషయమును సంపూర్ణముగా న్వెలయించి యున్నారు. కాని యిట్టి శిల్పద్వయ సమ్మేళన మా మహామహుఁడేల యావరింప వలసి వచ్చినదో యొక్క యుదాహరణముఁ జేత వివరించిన నీ వ్యాసమున ప్రతిపాదితార్థము స్పష్టమగును.

అరణ్యవాసము ముగిసినది. పాండవు లజ్ఞాతవాస మొనర్చుటకై సంసిద్ధులు కానున్నారు. అనగా విరాటపర్వ మారంభమైనది. శ్రోతయైన జనమేజయుఁడు కథకుని యొక ప్రశ్న వేసెను. అది సంస్కృతమున నిట్లున్నది.

'కథం విరాట నగరే మమ పూర్వ పితామహాః
అజ్ఞాత వాస ముషితా దుర్యోధన భయరార్దితాః!
పతివ్రతా మహాభాగా సతతం బ్రహ్మవాదినీ
ద్రౌపదీ చ కథం బ్రహ్మన్నజ్ఞాతా దుఃఖితా
వసత్!!'

'దుర్యోధనుని భయముచే కష్టముల పాలగుచు విరాట నగరమున నజ్ఞాతవాస సమయమును నా పితామహు లెట్లు గడపిరి. దుఃఖిత, పరమ సౌభాగ్యవతి బ్రహ్మవాదిని ద్రౌపదీ దేవి తన నోరు తెరుంగ నట్లజ్ఞాతవాసము నెట్లు గడపినది.'

తిక్కనగా రిట్లను వదించిరి;

'మహిత సముజ్జ్వలా కృతులు
మానధనుల్ జనమాన్యు లంగనా
సహితము గాఁగ నేమి గతి
సమ్యగుపాయ నిగూఢ వృత్తిమై
నహితుల కప్రభేద్యముగ
నా పదమూఁడగు నేఁడు మత్పితా
మహులు చరించి రంతయుఁ
గ్రమంబున నా కెఱుఁగంగఁ జెప్పుమా!'
వి. ప. 44.)

'ఎట్లు గడపినా' రనుటలో విశేషము లేదు. పాండవు లసామాన్యులైదుగురు. అంగనా సహితులు. ఇంత చాలును వారిని గురుతించుటకు. ఈ రీతిని యడుగుటచేత వారల వ్యక్తిత్వములు, రూపములు మన కన్నుల యెదుట నర్తించును. అజ్ఞాతవాస మెంత దుష్కరమో మన హృదయమునకు తెలియును. వారల కష్టదశ మనల శోక పీడితులఁ జేయును. ఇట్లు వ్రాయుట నాటకీయత. ఇది దృశ్య కావ్యముల లక్షణము. దీనిచేత కవి పాఠకులయొక్క సహానుభూతినిఁ బూర్ణముగాఁ బొందు చున్నాఁడు. ఇట్టి రచన పాఠకుఁడు మరచిపోదు మన్నను మరపు రాదు. ఇంక ప్రారంభించిన 'విరాటపర్వమట యుద్యోగాదులుం గూడగాఁ బదియే నింటిన్' 'దుదిముట్టన్' జదువక విడచు వీరడి యుండునా?

ఇట్లు కథయందు, ధర్మమునందు, పాఠకుని బుద్ధిని సమాహిత మొనర్చుకొనుటకు తిక్కన సోమయాజి తాను వ్రాయుచున్నది శ్రవ్య కావ్యమే యయ్యు దృశ్య కావ్య శిల్పమును సైతము సంతరించి సుమనో మనోభిరామ మొనర్చినాడు.

ఈ యర్థమును దెలుపుటకే యా మహనీయుఁ 'డమలోదాత్త మనీష నే నుభయ కావ్య ప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుడ, కళావిదుడ' నని నిర్వచనోత్తర రామాయణమునఁ జెప్పకొని, మహాభారత రచనా కాలమునాటికి నందు మరియు సిద్ధహస్తుఁడాయెను. ఇది యిట్లుండ 'నుభయ కావ్యము' లనుటను సంస్కృతాంధ్ర భాషోభయ కావ్యములని చెప్పుట సరసత యనిపించు కొనదు. అవి శ్రవ్య దృశ్య కావ్యములు.

'తస్మై నమః కవి కర్మణే!'

నువ్వందుకోలేని లేఖ

శ్రీ కె. ఎస్. వి. నరసింహమ్

నువ్వు రాయని ఉత్తరం
నే నందుకో లేదు !
నే నిక్కడ క్షేమంగా 'కుశాల'గా
ఉన్నానని నువ్వనుకుంటున్నావని
నే నెంచుతున్నాను.

డార్లింగ్ ! ఈ మధ్యాహ్నం
పదకొండు గంటల—స్తబ్ధగాలి—నడిరేయి లాంటి
భయం—నిర్లిప్తత—ఒంటరితనం లో
సిరా మరకల డిజైన్లు గల నా టేబిలు పై
పరాకు చిత్రగిస్తున్న కిటికీ అవతలి
బోగన్‌విల్లా మొగ్గిదు నవ్వుల పై
నా గది పై కప్పున వేళ్లాడుతూన్న
నిర్నిద్ర పై
మేలుకున్న చైతన్యం పై
కనుమూసిన జడత్వం పై
ఏమిటీ వింతగా వింటున్నాను?
ఇంతగా మరింతగా
ఏనాడూ ఎరుగనంతగా
ఏమిటీ నా లో కనులతో
కంటున్నాను??

అక్కడెక్కడో ఏదో అరచినట్లు—
ఇక్కడే ఈ చుట్టుపక్కలే ఎక్కడో
ఏదో నరుగ్గిన జారిపడినట్లు—
వేల కోట్ల మైళ్ల దూరాన మరో చోట—
ఓహో ఆ రమ్య కానన సీమలో
ఆ రహస్య కాంతార భూమిలో
బయల్వెడలినదే చిరు సవ్వడి?

చిరునవ్వడి—అదే—రుచిర సంగీతం వంటి
స్నిగ్ధహాసం వంటి
శిల్ప శాశ్వత సౌందర్యం వంటి
నిగమం వంటి
నిరీశ్వరుని వంటి
స్వప్నం వంటి స్వర్గం వంటి
ఏ రసానుభవం? ఏ రమ్యానుభవం??

ప్రియతమా! ఎన్ని బరువు నిమిషాలను
అనువదించి అక్షరాలుగా
ఎన్ని వెలుగు స్వప్నాలను
అనులిఖించి ఆశ్వాసాలుగా
నీయెడ నాకు గల
నిసర్గ సుందరమైన చెలిమిని ప్రకటిస్తే—

ఏ ముడివడిన కనుబొమలతో
చదువుకున్నావు నువ్వు?
ఏ వొంపు తిరిగిన ఎరుపు
పెదవులతో నన్ను అంకమై దూషించి
నా చీకటి కన్నీటి పాటను
నీ వెన్నెటి గుండెలో ఏ మూల దాచుకున్నావు నువ్వు?

డార్లింగ్! ఒకసారి నీకు ఉత్తరం రాసి
పోస్టు చెయ్యడం మరచిపోయాను!
డార్లింగ్! ఒకసారి నీకు ఉత్తరం పోస్టు చేసి
మరునటి సూర్యోదయంలో జ్ఞాపకం చేసుకున్నాను
అడ్రెసు రాయలేదని!!
డార్లింగ్! ఈ ఉత్తరం ఇప్పుడిలా ముగిస్తూ
నాకు నేను గుర్తు చేసుకుంటున్నాను—
ఈ ఉత్తరానికి అడ్రెసు రాయ నవసరం లేదనీ,
ఈ ఉత్తరం నీకు పోస్టు చెయ్యలేననీ,
అసలు నువ్విప్పుడు లేవని!!

మణిప్రవాళ భాష

డా. తిమ్మావజ్ఝల కోదండరామయ్య

(గతసంచిక తరువాయి)

మణిప్రవాళము — కన్నడము

7.1 కన్నడమున కూడ మణిప్రవాళ రచనము కొంత సాగె నని తోచు చున్నది. పార్శ్వ పండితుడు (క్రీ. శ. 1205) అను కవి పార్శ్వనాథ పురాణము[1] అను తన గ్రంథమున అగ్గళు డను జైనకవిని ఇట్లు స్తుతించెను.

క|| వాస్తవ భక్తి యుతం రూ
పస్తవన మణిప్రవాళమం [2] జిననాథ
స్థానస్తవనమ నొద విసి భువ
నస్తుత నా దగ్గళం గగ్గళ ర్గోళరే.

1–62 ప.

వాస్తవభక్తియుతుడును - రూపస్తవన మణిప్రవాళము, జిననాథస్థానస్తవనము అను గ్రంథములను రచించుటచేత భువనస్తుతుడును— అగు అగ్గళ కవిని మించినవారు లేరు—అని పయి పద్యము యొక్క అర్థము.

దీనిని బట్టి అగ్గళు డను జైనకవి 'రూపస్తవనము' అనుపేరుగల గ్రంథమును మణిప్రవాళములో రచించెనని స్పష్టముగా తెలియుచున్నది. కన్నడ సాహిత్యమున మణిప్రవాళమును గూర్చి ప్రస్తావించు ప్రయోగము ఇది యొక్కటి మాత్రమే లభించు చున్నది. మఱి యెచ్చటను ఇది ప్రస్తావింపబడలేదు.

7.2 కాని అగ్గళ కవి రచితముగా చంద్రప్రభ పురాణము అను చంపూ కావ్యము ఒక్కటి మాత్రమే మనకు లభించుచున్నది. అది జైన మతమునకు సంబంధించిన ఇరువది నలుగురు తీర్థంకరులలో చంద్రప్రభు డను తీర్థంకరుని చరిత్రమును అభివర్ణించు కావ్యము. అతడు 'రూపస్తవనము' అను మణియొక గ్రంథమును కూడ రచించి యుండుట యథార్థ మగుచో అది నేడు ప్రాయశః నష్టమయి పోయిన దనియే మనము భావింపవలసి యున్నది. కాని డాక్టరు సి. చిదానందమూర్తిగారు పయిని పేర్కొనబడిన 'రూపస్తవనము' అతడు రచించిన చంద్రప్రభ పురాణములోనే ఒక భాగ మగు నేమో అని అనుమానించు చున్నారు. వారి అనుమానమునకు కారణము లివి. జైన కవులు సాధారణముగా తమ కావ్యముల యందు రూప స్తవనము, గుణ స్తవనము, వస్తు స్తవనము అను వానిని నిక్షేపించుట సంప్రదాయము. చంద్రప్రభ పురాణమునందు వివిధ సందర్భములలో ఈ స్తవనము లిట్లు కలవు.

12-153-6 ఇంద్రుడు నాలుగు సంస్కృత వృత్తములలో జినుని జన్మాభిషేకమును స్తుతించును.

13—1—9 జినుని బాల్యము కందముల లోను, వృత్తముల లోను అభివర్ణింప బడినది.

13—13-25 చంద్ర ప్రభుని యౌవనము సంస్కృత పదభూయిష్ఠ మయిన పద్యములలో అభివర్ణింప బడినది. ఇతడే తరువాత జిను డగును.

14—90—7 ఇంద్రుడు మరల జినుని అష్టకములో స్తుతించును.

---

1. మదరాసు విశ్వవిద్యాలయము వారిచే ప్రకటితము. 1954. యం. మరియప్ప భట్టు, యం. గోవిందరావు గారలచే సంపాదితము.

2. జిననాస్థాన స్తవన మ—అని పాఠాంతరము. జినన—ఆస్థాన—స్తవన అనుపద విభాగమువలన జినుని ఆస్థానమునకు సంబంధించిన స్తవనమని అర్థ మగును, కనుక ఆ పాఠమంత సరసము కాదు.

16—78 ఈ పద్యమునుండి ఒక్కొక్క పద్యము నందును ఒక్కొక్క తీర్థంకరుడు చొప్పున ఇరువది నలుగురు తీర్థంకరుల స్తోత్రము ఇరువది నాలుగు సంస్కృత శ్లోకములలో కలదు.

ఈ కావ్యమునం దెచ్చటను మలయాళము నందలి మణిప్రవాళమును పోలిన భాషాశైలి కానరాదు. కేవలము సంస్కృత కన్నడ పదముల మిశ్రణమే మణిప్రవాళము అగుచో దానికి కన్నడ సాహిత్యమంతయు లక్ష్యము కావలసి వచ్చును. కాని అగ్గళుడు మణిప్రవాళమును రచించియుండు ననుటకు ఒక సూచన లభించు చున్నది. చంద్రప్రభ పురాణమును పరిష్కరించిన విద్వాంసులు ఆ గ్రంథము నందలి సుమారు తొంబది పద్యములను దోషభూయిష్ఠములు అనుకారణమున ప్రకటింపక వదలిపెట్టిరి. అవి బహుశః మణిప్రవాళమునందు రచితము లయిన కారణమున వారు వానిని దోషభూయిష్ఠములుగా పరిగణించి యుండుట సంభావ్యము. వ్రాతప్రతుల లోని యాపద్యము లున్నభాగమును పరిశీలించినగాని యీ సమస్య తేలదు. కనుక ప్రస్తుతము మనకు రెండే మార్గములు శరణ్యములు. ఒకటి—పార్శ్వ పండితుడు పేర్కొనిన విధమున అగ్గళుడు రూపస్తవనము అను గ్రంథమును మణిప్రవాళమున రచించెను. కాని అది నేడు మనకు నష్టమయిపోయినది-అనుట. రెండు—అగ్గళుడు రచించిన చంద్రప్రభ పురాణములోనే రూపస్తవనము ప్రకటింపక వదలిపెట్టిన ఒక భాగము. అది మణిప్రవాళమునందు రచింపబడి యుండ వచ్చును. దానిని ప్రకటింపక వదలుటకు అది మణిప్రవాళమున నుండుటయే కారణము కావచ్చును.

7.3 అగ్గళునికి చాలకాలము పూర్వము నుండియే మణిప్రవాళ రచనా విధానము కన్నడమున ంతవఱకు ప్రచురమై యుండెనని యూహించుటకు కొన్ని యాధారములు లభించుచున్నవి. కాని దానికి మణిప్రవాళ మనుసంజ్ఞ యా కాలమున నుండినట్లు కావ రాదు. అట్లూహించుటకు ప్రధానమయిన యాధారము క్రీ. శ. తొమ్మిదవ శతాబ్దమున నృపతుంగ విరచితమగు కవిరాజమార్గము. క్రీ. శ, 500 సంవత్సరములకు పూర్వము తమిళమున గణనీయమయిన సాహిత్యము వెలసి యుండెను. ఆంధ్రమునందును, కర్ణాటము నందును అప్పటికి సారస్వతసృష్టి జరుగ లేదు. ఆ కాలమునందును, ఆ తరువాత చాలకాలము దాకను కూడ ఉభయ ప్రాంతముల యందును పండితులకు సంస్కృతమే ఉపాదేయ మై యుండెను. ఆ కాలమున పాండిత్య మనగా సంస్కృత భాషా పాండిత్యమే. నాటి సంస్కృత విద్వాంసులకు దేశభాష లన్నను, అందలి సారస్వత మన్నను చిన్న చూపే కాని వానిపై పెద్ద యాదరము లేదు. తెలుగున నన్నయాదుల మూలమున గొప్ప సారస్వతము వెలసిన తరువాత కూడ ఈ పరిస్థితిలో ఏమంత చెప్ప కొన దగిన మార్పు కాన రా లే దనియే చెప్ప వలసి యున్నది. శ్రీనాథునిదాక కూడ ఈ పరిస్థితి యిట్లే కొనసాగె నని చెప్పదగును. విన్నకోట పెద్దన తన కావ్యాలంకార చూడామణిలో 'తెలుఁగంచుం జెవి పెట్టలేమి యుడుపం దేఁ గల్గునే మం దిలన్' అని వాపోవుటకూడ ఈ పరిస్థితినే తెలుపును. క్రీ. శ. పదవ శతాబ్దమునకు పూర్వము ఈ పరిస్థితి యింకను ఎంత గడ్డుగా, విషమముగా నుండి యుండునో మనము దీనినిబట్టి యూహింప వచ్చును. ఆ కాలమున పండితులు తమలో తాము సంభాషించు కొనవలసి వచ్చినప్పుడు సహజముగా సంస్కృతమునే మాధ్యమముగా గ్రహించి యుందురు. కాని సంస్కృతము తెలియని దేశీయులతో మాటలాడ వలసి వచ్చినప్పుడు వారు దేశభాషలయందే మాటలాడక తప్పదు. కాని వారు పండితు లగుటచే వారి సంభాషణమున పెక్కు సంస్కృత పదములు ప్రవేశించుట సహజము. అట్లు సంస్కృత పదములను దేశీయపదములతో కలిపి ప్రయోగింపవలసి వచ్చినప్పుడు ఆ సంస్కృత పదములను ఎట్టి రూపములతో ప్రయోగింపవలయు నను విషయమున విభిన్నము లయిన యభిప్రాయములు కలుగుటకు అవకాశము ఉన్నది. కొందఱు సంస్కృత ప్రాతిపదికములకు దేశభాషా విభక్తులను చేర్చి అట్టి పదములను దేశభాషాపదములతో కలిపి వ్యవహరించి యుందురు. ప్రారంభదశలో సంస్కృత శబ్దములను దేశీయములుగా మలచుకొను నిట్టి పద్ధతులు ఒక వ్యవస్థ లేక పలువిధములుగా నుండుటకు అవకాశము ఉన్నది. నృపతుంగునికి పూర్వము కన్నడమున వెలసిన కవులు ఈ విభిన్న పద్ధతులకు చెందిన తత్సమా

కరణముతో తమ కావ్యములను విరచించి యుందురు. ఇందుచే నృపతుంగుని కాలమునాటి భాషా ప్రయోగమునకును, వారి భాషా ప్రయోగమునకును కొంత వ్యత్యాసము కూడ నుండి యుండును. నృపతుంగుడు తనకు పూర్వు లయిన యా కవుల తత్సమీకరణ పద్ధతులను పరిశీలించియు, తన కాలమునందలి శిష్ట జన వ్యవహారమును దృష్టియం దుంచు కొనియు సంస్కృత శబ్దములను దేశీయములుగా చేసి వాడుకొను పద్ధతులకు ఒక స్థిరమయిన వ్యవస్థను కల్పించి, నిర్దిష్టమయిన ఒక ప్రణాళికను తన కవి రాజమార్గమున తెలిపెను. అందుచేతనే కవి రాజమార్గము నందలి కన్నడ భాషకును, తరువాతి కాలమునందలి కన్నడ కవులు ఉపయోగించిన భాషకును వ్యత్యాసము అంతగా కాన రాదు. కాని సంస్కృత భాషయందు అత్యంతము ఆదరము కల కొందఱు విద్వాంసులకు ఈ తత్సమీకరణము లేక దేశీయము చేయు పద్ధతి రుచించి యుండక పోవుట సహజము. వారు సంస్కృత శబ్దములను సంస్కృత విభక్త్యంతములు గాను, దేశభాషా పదములను దేశీయ విభక్త్యంతములుగాను ప్రయోగించుట యుక్తమగునని భావించి యుందురు. తదనుగుణముగా కొందఱు అట్టి భాషలో కవిత్వము రచించి యుండుట కూడ సంభావ్యమే. అదియే తరువాతి కాలమున మణి ప్రవాళమను పేరుతో ప్రసిద్ధమయినది.

7.4 కవిరాజమార్గమున బెత్తాణె, బెదండె అను దేశికావ్య భేదములు పేర్కొనబడినవి. అవి నృపతుంగుని కాలమునకే పటి గన్నడమని చెప్పదగిన భాషలో రచింపబడె నని యా గ్రంథములోని పీఠికను బట్టి తెలియుచున్నది. కాని సంస్కృత పదభూయిష్ఠమయిన శిష్టభాషవలె ఆ పటి గన్నడము అతనికి రుచింప లేదు. అందు చేతనే ఆతడు 'విరసంకర మవు దేసిగె జరద్వధూ విషయ సురత రస రసికత వోల్'— దేశి కవిత్వము జర ద్వధూ సురతము వలె విరసంకరము— అని నిరసించెను. అట్లు పటి గన్నడ భాషా ప్రయోగమును నిరసించి అతడు దేశభాషలతో సమసంస్కృతమునే (తత్సమము) కలుప వలయును గాని సంస్కృత విభక్త్యంతము లయిన పదములను కలుప రా దని కంఠోక్తిగా నియమము కావించెను.[3] మఱియు అహరహః, ఉచ్చైః, నీచైః, ముహుర్ముహుః, ఇతస్తతః, పునః, అతః, బహిః మున్నగు వానిని కన్నడ భాషా వాక్యములలో వాడకూడ దనియు, అట్లు వాడినచో గరిడియను, మద్దెలను ఒక్కమాఱు వాయించుట వలన కలుగు జర్ఝర ధ్వని కలుగుననియు, సమ సంస్కృతముతో కలిపి చెప్పినచో అది మృదంగ సంగీత కాది మధుర రసమును పోలి యుండుననియు నతడు వివరించెను. ఇట్లే అరసకుమార, ఆయత తర కరెగణ్ణ, కెళది సమేతం— మొదలగు మిశ్ర సమాసములుకూడ పరిహార్యములనియు, వానిని నరపతి తనయ, ఆయత తరళాపాఙ్గ, కెళదియ రొడె— ఇత్యాది విధముగా వాడుట యుక్తమనియు సూచించెను. దీనినిబట్టి సంస్కృత విభక్త్యంతము లగు శబ్దములను యథా తథముగా దేశభాషా పదములతో కలిపి ప్రయోగించుట మాత్రమేకాక సమాసములందు కూడ కేవల సంస్కృత పదములతో దేశీయ పదములను చేర్చి ప్రయోగించుట అతనికి అంగీకార్యము కాదని తెలియుచున్నది. ఇట్టి ప్రయోగములను అతడు పరిహరించె ననగా అతనికి పూర్వకాలమునందును, సమకాలమునందును అట్టి భాషా వ్యవహారము కవులలో కొంత కానవచ్చుచుండె ననియే మనము గ్రహింప వలసియున్నది. దీనినిబట్టి అగ్గళునికి చాలకాలము పూర్వమునుండి కూడ మణిప్రవాళ రచనా విధానము కన్నడమునందు ఉండి యుండు నని ఊహింప దగును. కాని కవిరాజమార్గము రచింపబడిన తరువాత ఆ విధానము చాలవఱకు సన్నగిల్లిపోయి, అగ్గళునివంటి ఒక రిద్దఱు కవులను మాత్రము అది ఆకర్షించి యుండును. దానికి సముచిత మయిన యాదరము లభింపక పోవుటచే ఆ తరువాతి కాలమున అది పూర్తిగా నశించి పోయి యుండును.

7.5 క్రీ. శ. పందొమ్మిదవ శతాబ్దమున జీవించిన 'ముద్దణ' కవి కన్నడ పదములను, సంస్కృత పదములను తన రచనమున నల్లని మణులు—కర్మణులు (నల్లపూసలు), శెంబవతములు (ఎఱ్ఱని ప్రవాళ

---

3. సమ సంస్కృతంగళో (ళ్త)

యుక్తి మర్దిరే కన్నడ మనఱిదు పేళ్గెంబుది దా

గమ కోవిద నిగది తమా

ర్గ మిదం బెర సల్కు మాఱు దీ సక్కదదొళ్.

— కవిరాజమార్గము.

ములు) పాపములో కూర్చిన విధమున ప్రయోగింతు నని చెప్పుకొనెను. ఇది మనకు మణి ప్రవాళమునే స్ఫురింప జేయును. కాని రామాశ్వమేధము అని అతడు రచించిన గ్రంథము ప్రాచీన కన్నడ భాషలోనే రచింపబడెను. అందు మణి ప్రవాళముయొక్క జాడ కూడ ఏమాత్రమును కానరాదు. ముద్దణ కేరళ దేశమునకు సమీపమున నున్న దక్షిణ కెనరా ప్రాంతమునకు చెందిన వాడు. అందుచే మలయాళ సాహిత్యముతో అతనికి కొంత పరిచయము ఉండుటకు అవకాశము ఉన్నది. దానిని పురస్కరించుకొని ఆ చాపల్యముచే తన కావ్యమునందలి భాషను గూర్చి అతడు మణిప్రవాళ భాషా జ్ఞాపకముతో పయివిధమున పేర్కొని యుండ వచ్చును.[4]

7.6 ఇట్లు కన్నడమున మణి ప్రవాళ రచనము లత్యల్పముగా మాత్రమే ఉన్నట్లు కానవచ్చు చున్నను అది యా భాషలో మలయాళమునందు వలె ఒక ప్రత్యేక కావ్యశైలిగా నిలువ ద్రొక్కుకొని నిలువ జాలక పోయినవి.

మణిప్రవాళము – తెలుగు

8.1.1 తెలుగునందు కూడ మణిప్రవాళ రచనా విధానము ఒక కాలమున కొందఱికి ఆదరపాత్ర మై యుండె నని తెలియుచున్నది. కన్నడమున మణి ప్రవాళ రచనమునకు ప్రోద్బలకములయిన పరిస్థితులే తెలుగున కూడ అట్టి రచనమునకు కారణము లయ్యెనని తలప దగును. ప్రాచీన కాలమున కన్నడమునకును, తెలుగునకును ఇప్పుడున్నంత వ్యత్యాసమును, పార్థక్య మును లేదు. అందుచే ఆ యుభయ ప్రాంతము లందలి కవులును, ప్రజలును ఒండొరుల భాషా సాహిత్యములతో పరిచయము కలిగి యుండుటకు అవ కాశము కలదు. అందుచే కవిరాజ మార్గమునకు పూర్వము కన్నడమున వ్యాపించి యుండిన మార్గ కవితా పద్ధతి తెలుగున కూడ వ్యాప్తినంది యుండుట సంభావ్యము. దానితోబాటు సంస్కృత భాషాభిమాను లయిన పండితులు సంస్కృత విభక్త్యంతము లగు సంస్కృత శబ్దములను దేశభాషాపదములతో కలిపి వాడుచుండిన మణిప్రవాళ పద్ధతియు కొంత వ్యాప్తిలో నుండెను. చాళుక్య రాజాదులు ఆ యుభయ పద్ధతు లను అంగీకరింపక దేశికవితకును, సంస్కృత పద ప్రచురము కాని తెనుగునకును ప్రాధాన్యమును కలిగింప యత్నించిరి. ఈ విషయము నన్నెచోడుని పద్యమున్[5] వలన తెలియుచున్నది. వారియట్టి ప్రయత్నఫలమే నాటి శాసనములందును, అప్పటి సాహిత్యమునందును కానవచ్చు దేశికవిత్వము. వా రానాడు అట్టి ప్రయత్న మొనరించి యుండనిచో మార్గకవితా పద్ధతియో, మణిప్రవాళ పద్ధతియో తెలుగుదేశమునందును వ్యాపించి, దేశికవిత్వమునకును, తెనుగున కును కొంత నిరోధము కలిగియుండును.

8.1.2 క్రీ. శ. తొమ్మిదవ శతాబ్దమున నృపతుంగుడు కన్నడమున కవిరాజ మార్గమును రచించి మార్గకవితా పద్ధతికి ఒక ఘంటాపథమును నిర్మించెను. అప్పటి నుండియు కన్నడకవులు ఆ మార్గమును నిశ్శంకముగా అవలంబించిరి. దాని ప్రభావము తెలుగుదేశమునకు కూడ వ్యాపించెను. తత్ఫలితముగా తెలుగుదేశమునందు కూడ పండిత కవుల యాదరము క్రమముగా మార్గపద్ధతియెడ ములు సూప దొడగెను. నన్నయ కాలము నాటికి ఆ యా దరము కొంత ప్రబలమయ్యెను. కాని యా కాలమున కూడ మణిప్రవాళము నభిమానించు సంస్కృత భాషాభిమాను లుండి యుండురు. ఆ కాలమునందలి పరిస్థితుల ననుసరించి నన్నయకు కన్నడ భాషతో పరిచయ ముండుటకు అవకాశ మున్నది. అతని సహా ధ్యాయు డయిన నారాయణభట్టు కన్నడమున కవిత్వము కూడ చెప్పగల ప్రావీణ్యము కలిగి యుండె నని నందం పూడి శాసనము వలన మనకు తెలియుచున్నది. అతడు కన్నడమునందు ప్రచురమయిన మార్గకవితా పద్ధతిని గాంచి దాని సౌందర్య గాంభీర్యాదుల కలరి తనమిత్రు డయిన నన్నయకు ఆ మార్గము అనుసర

---

4. కన్నడములోని మణి ప్రవాళమును గూర్చి నా కీ విషయములు తెలిపిన డాక్టరు సి. చిదానంద మూర్తిగారికి నా కృతజ్ఞతలు.

5. మును మార్గకవిత దేశం
బున వెలయంగ దేశికవితఁ బుట్టించి తెనుం
గు నిలిపి రంధ్ర విషయం
బునఁ జనఁ జాళుక్యరాజు మొదలుగ. బలువుర్.
కుమా. 1—23.

ణీయమని సూచించియుండును సంస్కృత భాషాభి మానులు మణిప్రవాళ పద్ధతియే ఉపాదేయమని వాదించి యుందురు. మహాభారతము వంటి యుద్గ్రంథమును తెలుగున ఎట్లు ఎట్టి భాషలో—వ్రాయుటయా యని డోలాందోళన చిత్తుడై యూగిన లాడుచుండిన నన్నయ భట్టారకునకు 'పాకశాసనికి భారత ఘోర రణంబునందు నారాయణునట్లు'—నారాయణ భట్టు తోడయి అతని సంశయ మనస్కతను పోకార్చి కర్మ మార్గమున కతని నుమ్ముఖుని కావించెను. అతడును సందియమును విడనాడి నారాయణ నిర్దిష్ట మార్గమున—మార్గ కవితా పద్ధతిలో—మహాభారత రచనమును సాగించెను. సంస్కృత భాషాభిమాను లభిమానించిన మణిప్రవాళ శైలి పరిస్థితుల ప్రాబల్యము వలన వెనుకకు తగ్గెను.

8.1.3 అయినను వారు తమ అప్రీతిని వ్యతిరేకతను చాటు మాటుగా వ్యక్తము చేయుచునే యుండిరి. ఈ విషయము నన్నెచోడుని పద్యము[6] వలన తెలియును. వారికి సంస్కృత పదములను తత్సమములుగా చేసి దేశ భాషా పదములతో కలిపి చెప్పు మార్గ కవిత్వము నెడ గాని, కేవల దేశికవిత్వము నెడ గాని ప్రీతి లేదు. వారి యభిప్రాయమున సంస్కృత ప్రాతిపదికములను తత్సమములుగా చేసి వానితో దేశ భాషా పదములను కలిపి చెప్పు మార్గ పద్ధతి కుమార్గము. చాళుక్య రాజాదులు పుట్టించి నిలిపిన దేశికవిత్వము అమార్గము. ఈ రెండును వారికి ఉపాదేయములు కావు. కాని పూటాడక యూరకుండుటకు వారికి మన నిచ్చగింపదు. అందుచే వారు ఒక నూతన మార్గమును—సంస్కృత శబ్దములను సుబాద్యంతములుగానే గ్రహించి దేశిపదములతో కలిపి చెప్పు మణిప్రవాళ మార్గమును అవలంబించిరి. ఈ మూడవ పద్ధతి వారి యభిప్రాయమున సన్మార్గము. కాని నన్నెచోడుని కది దుర్మార్గము. అట్టి దుర్మార్గము నవలంబించు మార్గవులనే యతడు తన పద్యమునందు తెగడెను. సుకవు లట్టి మార్గవులను స్మరింప నక్కఱ లే దని—వారు ఉపేక్షింప దగినవారని సూచించెను. దీనినిబట్టి నన్నెచోడుని కాలమున కూడ మణి ప్రవాళమును అభిమానించు వారు కొంద ఱుండిరని తెలియుచున్నది.

8.2.1. నన్నెచోడుని పద్యమునకు చేసిన అర్థ వివరణమునుబట్టి యిది కేవలము ఊహగా కూడ తోచ వచ్చును. కాని అట్టి మణి ప్రవాళ శైలికి చెందిన రచనా విధానము తెలుగునం దుండె నని నిర్ధరించుటకు పాలకుఱికి సోమనాథుని వృషాధిప శతకమునందు ప్రబలమయిన ప్రత్యక్ష సాక్ష్యము మనకు లభించుచున్నది. అందు మణి ప్రవాళము పేర్కొనబడుట మాత్రమే కాక ఆ శైలిలో రచింపబడిన పద్యములు కూడ మనకు లభించుచున్నవి.

8.2.2. వృషాధిప శతకమున పాలకుఱికి సోమనాథుడు సంస్కృత భాషా రచితము లయిన స్తుతులుగా ఆఱు పద్యములను, తమిళ కర్ణాట మహారాష్ట్ర భాషలలో ఒక్కొక్క భాషయందును ఒక్కొక్క పద్యము చొప్పున మూడు పద్యములను రచించిన పిమ్మట మణి ప్రవాళములో చెప్పితి నని కంఠోక్తిగా పేర్కొనుచు నాలుగు పద్యములను రచించెను. అదనముగా బహు భాషా పదములతో కూడిన యొక పద్యమును కూడ రచించెను. కాని అందు దానిని అతడు మణి ప్రవాళమని పేర్కొన లేదు.

8.2.3. వృషాధిప శతకము నందలి పద్యము లివి.[7]

చ॥ అనయము చేతులందు భవదంఘ్రి
సరోజ యుగం నమామి నె
మ్మనమున సంస్మరామి యను మాటల
నిన్ వరివస్కరో మ్యహ
మ్మనుచు మణి ప్రవాళమున సంకన
సేయుదు భక్తలోక హృ
ద్వనజ విహార రోల! బసవా! బసవా!
బసవా! వృషాధిపా!

---

6. మార్గ కుమార్గము, దేశి య
మార్గము, వగవంగ దమకు మది వదలక దు
ర్మార్గ పదవర్తు లనదగు
మార్గవులం దలఁప నలఁతి మహి సుకవులకున్.
కుమా. 1—28.

7. వృషాధిప శతకము—పద్యములు 59, 60, 61, 63, 64 శ్రీ నిర్మల శైవ సాహితీ గ్రంథ మాలిక—1969.

చ॥ అరుళగిరి ప్రసాద ముడయానె భవ
దుగ్గుణ వర్ణ సల్పి నా
కొరువని నే స్మరామి సుర సత్తమ!
యో గణవర్య! యంచు ని
ట్లరుదు మణి ప్రవాళమున నంకన
సేయుదు నిన్ను మన్మనో
హర! కరుణా విధేయ! బసవా!
బసవా! బసవా! వృషాధిపా!

చ॥ పాయదె ఒందు చేటిగతి పాప అమా
పరమ న్నమామి భో
న్యాయ విధేయ మీావ తరి యన్య న
జాణు కృతార్థయంచు వా
గ్ధ్యేయ! మణి ప్రవాళమున దెల్లను
నిన్ను నలంకరింతు దే
వా! యమి బృంద వంద్య! బసవా!
బసవా! బసవా! వృషాధిపా!

చ॥ హాడువె నా మహా రసవ నంఘ్రియుగ
భ్రమ గొందు సద్గుణా
మాడువె యర్చనం బడె సమగ్ర నుతి
త్వయి సత్క్రియన్ దగన్
గూడ మణిప్రవాళమునఁ గోరి
నుతింతును సంచితార్థముల్
పాడిగ నివ్వటిల్ల బసవా! బసవా!
బసవా! వృషాధిపా!

చ॥ తిరుఘడి నామనంబునను దే
హృదయేశ్వర! కిం విధీయతాం
పరతర త్వం పురాణ నను పాహి
విభో అనువాపితా అమా
వరదనె ఘళ్లె యంచు నినుఁ
బ్రస్తుతి సేయుదుఁ బెక్కు భాషలన్
వరద! వివేక శీల! బసవా! బసవా!
బసవా! వృషాధిపా!

8.2.4 పయిపద్యములలో వరుసగా సంస్కృతాంధ్రములు, తమిళాంధ్ర సంస్కృతములు, ఆంధ్ర కర్ణాట సంస్కృతములు, సంస్కృత కర్ణాటములు, సంస్కృత ద్రవిడ కర్ణాటాంధ్ర మహారాష్ట్ర భాషలు—ఈ భాషా పదములతో కూడిన మణిప్రవాళ రచనము కలదు. తుది పద్యమున మాత్రము మణి ప్రవాళము అనుపేరు పేర్కొనబడ లేదు. దీనిని బట్టి సోమనాథుని యభిప్రాయమున సుబాద్యంతము అయిన సంస్కృత శబ్దములను ఏ భాషాపదములలో చేర్చి రచించినను అది మణి ప్రవాళ మగు నను విషయము స్పష్ట మగుచున్నది. మణిప్రవాళమున సుబాద్యంతము అయిన సంస్కృత పదము నియతముగా ఉండవలసిన ఒక ధర్మము. అట్టి పదములతో ఏ భాషా పదములను కలిపి రచించినను అది మణి ప్రవాళ మను సంజ్ఞతో వ్యవహరింపబడును. దీనినిబట్టి ఏ దేశ భాషయందైనను మణి ప్రవాళ పద్ధతి యుండుటకు అవకాశ మున్నది. ఒక దేశభాషకు చెందిన పదములను మాత్రమే కాక పెక్కు దేశ భాషలకు చెందిన పదము లను కూడ వానితో చేర్పదగును. అప్పుడును అది మణి ప్రవాళమే యగును. ఇట్టి పద్యములు ఒక్క తెలుగు నందు మాత్రమే కాక ఇతర భాషలయందును ఆ కాల మున మణి ప్రవాళ రచనా విధానము ప్రచలితమై యుండె ననుటను సూచించు చున్నది.

8.3.1. పాలకుఱికి సోమనాథుని కాలమునకు తరువాత కూడ మణిప్రవాళము విరళముగా నయినను ప్రచారములో నుండె ననియే మనము తలప వలసి యున్నది. తిక్కన తన నిర్వచనోత్తరరామాయణ పీఠికలో 'జాత్యము గామి నొప్పయిన సంస్కృత మెప్పుడుఁ జొన్ప'నని ప్రతిన చేయుట కూడ సుబాద్యంతము అయిన కేవల సంస్కృత పదములను తెలుగు పదములతో చేర్చి ప్రకటింపరాదను నిషేధమునే సూచించును. అతనికి సమకాలికుడే అయిన కేతన కూడ ఈ విషయమునే మఱికొంత విపులముగా తెలిపి యున్నాడు. అతడు తన ఆంధ్రభాషాభూషణములో వృక్షేణ, దక్షాయ, పక్షిభిః, పుత్రస్య అను సంస్కృత విభక్త్యంతము లగు పదములను—అస్తి, ప్రయాతి, గాయంతి, భుంక్తే మున్నగు క్రియా రూపములను—గత్వా, హసిత్వా, ప్రకాశ్య, సంత్యజ్య మొదలయిన క్త్వార్థములను, ల్యబంతములను—గంతుం, హంతుం మొదలగు తుమున్నర్థక రూపము లను—తెలుగున ప్రయోగింపరాదని స్పష్టముగా శాస

నము కావించెను.[8] ఆంధ్రశబ్దచింతామణి లోని 'సవరాన్య వ్యయ సుప్తిఙ్ క్త్వా తుమునాం' అను సూత్రము కూడ ఈ విషయమునే తెలుపు చున్నది.

8.3.2 మన వ్యాకరణములయందు అనుకరణ విధానమును గుఱించి రచితములయిన సూత్రములు కూడ ఈ విషయమునే తెలుపును. అనుకరణ విరహితముగా సంస్కృత వాక్యమును ప్రయోగింప రా దనుటయు—ఒకానొకచో ననుకరణ విరహితంబుగ సంస్కృత వాక్యంబు గానంబడియెడి, జయపదం బనుకరణ విరహితంబ తఱుచుగ నగునను సూత్రములును తప్పిదారి మహాకవుల రచనములందు దొరలిన మణి ప్రవాళచ్ఛాయలను పరిహరించుటకే యనుటను మనము గుర్తింప వలయును.

8.4 నన్నయ లక్ష్యరూపమునను, తిక్కన. కేతన, ఆంధ్రశబ్ద చింతామణికారులు లక్షణరూపము నను మణిప్రవాళమును నిషేధించి యున్నను అప్పు డప్పుడు సంస్కృత విద్వాంసులు హాస్యమునకై—వినోదక్రీడగా మణిప్రవాళమున శ్లోకములు రచించి అలరించుచునే యుండిరనుటకు తార్కాణము లున్నవి. మణిప్రవాళమున రచితములయిన యీ చాటువులను చూడుడు.[9]

తండులాలు గృహమందు న సంతి
తిండి కైతె బహుమంది వసంతి
కుండ లెల్ల గృహమందు లుఠంతి
రండనా కొడుకు లెల్ల హసంతి.

ఓసి ఓసి వినవే మమ వృత్తం
కాశి వెడితిని గదే కమలాక్షీ
నీకు పుణ్యము గదే మృగనేత్రీ
తీయవే స్తన తటోపరివస్త్రం.

పాంథపంచకము :

....
....
దట్టమైనవన మస్తి పురస్తాత్
చెట్టుకింద విరయన్మ యథేచ్ఛం.

ఇట్లు విభక్త్యంతము లయిన సంస్కృత శబ్దములను యథా తథముగా ప్రయోగించుట మాత్రమే కాక తెలుగు శబ్దములకు సంస్కృత విభక్తులను చేర్చి ప్రయోగించుట కూడ ఇట్టి మణిప్రవాళములో కలదు. మలయాళము నందును ఇట్లే మలయాళ శబ్దములకు సంస్కృత విభక్తులను చేర్చి ప్రయోగించు సంప్రదాయము కాన వచ్చును. చాటుపద్యమణి మంజరి ద్వితీయభాగము ప్రథమ సంపుటములో చేర్చబడిన యీ క్రింది శ్లోకమును చూడుడు. పెద్దిభట్టు అను సంస్కృత కవీశ్వరుడు వెలుగోటి సింగభూపాలుని కాలము వాడు. మల్లినాథునిపేర నితడే గ్రంథములు రచించె నని ప్రతీతి. పెద్దిభట్లొక నాడు చీకరి బాకిరి చినుగుల ప్రాత కట్టుకొని, వంకరటింకరకఱ్ఱ చేత పట్టుకొని సింగభూపతి విద్వత్సభకు పోవుచుండగా త్రోవలో నెవరో అతని నిట్లు అడిగిరట! 'తాతగారూ! రాజసభకు ఇట్టివేష ముతో పోవుచుంటిరేమి?' అని. అపు డాయన యీ క్రింది శ్లోకమును చెప్పె నట!

కిం వాససా చీకరి బాకి రేణ
కిం దారుణా వంకరటింక రేణ
శ్రీ సింగభూపాల విలోక నార్థం
వైదుష్య మేకం విదుషాం సహాయం.

---

8. సీ॥ వృక్షేణ దక్షాయ పక్షిభిః పుత్రస్య
యను విభక్తులు దెనుంగునకుఁ జొరవు
అస్తి ప్రయాతి గాయంతి భుంక్తే సంతి
నయతి స్మరతి యను క్రియలు సొరవు
గత్వా హసిత్వా ప్రకాశ్య సంత్యజ్య నాఁ
దనరు క్త్వాంతల్యబంతములు సొరవు
గంతుం పురీం రిపుం హంతుం సుతం పాతు
మను తుమున్నంతంబు లరయఁ జొరవు
గీ॥ అపి చ తు హి వై న వా నను లనఁగఁ బెక్కు
లవ్యయంబులు చొర వెందు నాంధ్ర కవితఁ
బెఱపదంబుల తోడను దొరలి నిల్చు
నవి తెనుంగులు గావింతు నభిమతముగ.
అం. శా. భూ.

9. వీనిని జ్ఞాపకము తెచ్చుకొని నాకు తెలి పిన గురువర్యులు కీ. శే. శ్రీ కంభంపాటి సుబ్రహ్మణ్య శాస్త్రిగారికి నా కృతజ్ఞతలు,

కట్టుబట్ట చీకరిబాకిరి అయిననేమి? చేతికఱ్ఱ వంకరటింకర అయిననేమి? సింగభూపాలుని దర్శ నార్థము పోవువారికి వీనితో నిమిత్తము లేదు. విద్వాంసు లయిన వారికి వారి వైదుష్యమే సహాయమై నిలు చును—అని పయి శ్లోకమున కర్థము. దీనికి మఱి యొక యర్థము కూడ కలదు. సింగభూపాలుని దర్శ నార్థము పోవువారికి పల్లకీ లేక పోయిన నేమి! పల్లకికి చీకిరి బాకిరి కుచ్చులు, వంకర టింకర బొంగు ఉండును. పండితులయిన వారికి వారి పాండిత్యమే రాజసభలో సహాయమై నిలుచును—అని. దీనియర్థ మే దయినను ఇందు చీకిరి, బాకిరి, వంకర టింకర అను తెలుగు శబ్దములకు సంస్కృత విభక్తి ప్రత్య యములనుచేర్చి యీ సంస్కృత శ్లోకమునందు ప్రయోగింప బడినది. ఇదియు మణిప్రవాళ రచనమే యగును.

8.5 కావ్యాదులలో తెలుగు వాక్యముల నిర్మాణము నందు మాత్రమే సంస్కృత విభక్త్యంతములయిన సంస్కృత శబ్దముల ప్రయోగమును నిషేధించుటతో మన వైయాకరణులు విశ్రమింప లేదు. సమాస కల్పనమునందుకూడ కేవల సంస్కృత శబ్దము వికృతి శబ్దముతో సమసింపదు—అని వారొక నియమ మును కావించిరి. ఇట్లు నియమమును చేయుటను బట్టి సమాస కల్పనము నందు తఱచుగా అట్టిమణి ప్రవాళపద్ధతి చూపట్టు చుండె నని కూడ మనము తలపవలసి యున్నది. ఈ నియమమును కూడ అధిగ మించి వ్యవహార ప్రాబల్యమువలన కాబోలు నన్న యాదులగు కొందరు కవులు కపిల కన్నులు, జీవగఱ్ఱ ఇత్యాది విధము లయిన సమాసములను ప్రయోగింపగా అవి ఆర్యవ్యవహారము లగుటచే అనింద్యములుగా వారు వానిని గ్రహింపక తప్పలేదు. సోమనాథాదు లగు కొందఱు కవుల రచనములలో ఇట్టిమణి ప్రవాళ సమాస కల్పనము (వ్యాకరణ దృష్టిలో వైరి సమా సములు — దుష్టసమాసములు) కోకొల్లలుగా కాన వచ్చును. నేటి వ్యవహారమునందు కూడ అట్టిసమా సములు శుద్ధదండుగ, శుద్ధతప్పు. హస్తవాసి ఇత్యా దులు పదింబదిగా ప్రయోగింపబడుచునే యున్నవి.

8.6 ఇవికాక శిష్ట వ్యవహారములో నేటికి కూడ కాలక్రమేణ, దృష్ట్యా, రూపేణ, ప్రాయశః, బహుశః, వస్తుతః, అథవా మొదలగు సుబా ద్యంతములయిన సంస్కృత శబ్దములు యథా తథముగా ప్రయోగింపబడుట కానవచ్చుచున్నది. అట్టిప్రయో గములను వివిధ కాలములలో సాగుచు వచ్చి నేటికిని వ్యవహారములో నిలిచియున్న మణిప్రవాళము యొక్క అవశేషములుగా మనము భావింపవచ్చును.

సిద్ధాంతము

9. భరతుని (క్రీ. శ. 2 వ శతాబ్దము) నాట్యశాస్త్రమున ధ్రువాగానమునందు త్రైవర్ణికు లయిన మానుషపాత్రములకు 'అర్ధ సంస్కృతము' ఉపయోగింప దగు నని తెలుపబడినది. అందే నాట్య ప్రదర్శనమునందు పాఠ్యము 'భాషావిమిశ్రితపదము' (సంస్కృత దేశభాషా విమిశ్రితమైన భాష)గా ఉండ వలయుననియు, పురాణ కథనమునందు మిశ్రభాష ఉపయోగింపదగుననియు తెలుపబడినది. ఇట్టిభాషకు మణిప్రవాళ మనుసంజ్ఞ తొలుత జినసేను డనుకవి (క్రీ. శ. 837) షట్ఖండాగమమునకు రచించిన 'జయ ధవళ' మను వ్యాఖ్యానము చివర కానవచ్చును. జినసేనుని గురువగు వీరసేనుడు (క్రీ. శ. 9 వ శతాబ్దము) అందలి పూర్వభాగమునకు 'ధవళ'మను వ్యాఖ్యానమును రచించెను. ఉభయులును అందు సంస్కృత ప్రాకృత భాషా మిశ్రమయిన మణి ప్రవాళమును అవలంబించిరి. సంస్కృత భాషా రచిత ములు, ప్రాకృత భాషా రచితములు అగు స్వతంత్ర ములు, ప్రత్యేకములు అగు వచన భాగములతో ఆ రచనము సాగినది. కాశ్మీర దేశమునకు చెందిన అభినవ గుప్తుడు (క్రీ. శ. 11 వ శతాబ్దము) అను విద్వాంసునకు దక్షిణ దేశములోని మణిప్రవాళమును గూర్చిన యెఱుక కలదు. అతడు భరతుని నాట్య శాస్త్రమునకు రచించిన వ్యాఖ్యానములో 'అర్ధ సంస్కృత' మనుమాటకు దక్షిణ హిందూదేశము నందు తన కాలమున ప్రచురమై యుండిన మణి ప్రవాళము అర్థముగా వివరించెను. కాశ్మీర దేశము నందు 'శాటకులు' మనుపేరితో అట్టిశైలి యొకటి

యుండెనని కూడ అతడు తెలిపెను. కాని యీ శైలి యెట్టిదో తెలియవచ్చుట లేదు. మణిప్రవాళము మలయాళమునకు విలక్షణమయిన ఒక విశిష్ట కావ్య శైలి. మలయాళమున అది రూపొంది వెలయుటకు కొన్ని చారిత్రక సాంఘిక పరిస్థితులు కారణము. కులశేఖర పెరుమాళ్ అను ప్రభువుయొక్క ఆస్థానము నలంకరించియుండిన 'తోలన్' అనుకవి (క్రీ. శ. 9 వ శతాబ్దము) రచించిన హాస్యరస స్ఫోరక మగు రచనతో మలయాళమున ఇట్టి రచనా విధానము ప్రారంభమై యుండ వచ్చునని కొందఱి అభిప్రాయము. మలయాళ సాహిత్య చరిత్రమునందు మణిప్రవాళయుగము ఒక స్వర్ణయుగముగా భావింపబడుచున్నది. మణిప్రవాళము తొలుత సంస్కృత గ్రంథముల వ్యాఖ్యానముల యందు ప్రయోగదశలో నుండి తరువాత క్రమముగా మౌలికము లయిన కావ్యాదుల రచనమునకును ఉపయోగింప బడెను. లీలా తిలకము (క్రీ. శ. 14 వ శతాబ్దము) మణిప్రవాళమును నిర్వచించి, యందలి భేదము లను లక్ష్య లక్షణములతో వివరించెను. మణిప్రవాళమునందు ఉత్తమము, మధ్యమము, అధమము ఇత్యాదిగా తొమ్మిది భేదములు కలవు. మణిప్రవాళమునకును, భాషా మిశ్రమునకును మలయాళమున భేదము కలదు. భాషా మిశ్రమునందలి భాష (మలయాళము) పామర జనుల భాష. మణిప్రవాళము నందు గ్రహింప దగిన మలయాళ శబ్దములు త్రైవర్ణికులు మాత్రమే వ్యవహరించునవి. మణిప్రవాళమునకును, పాట్టునకును కూడ భేదము కలదు. మణిప్రవాళమునందు 'యోగము' ప్రధానము. పాట్టునందు ఇట్టి 'యోగము' అవసరములేదు. మణి ప్రవాళము సమస్త రచనములందును గ్రహింపబడును. పాట్టు— గానకావ్య మగుటచే — ఒక్క కవిత్వమునకు మాత్రమే పరిమిత మయినది. మణి ప్రవాళమునందు సంస్కృతశబ్దములు యథా తథముగా స్వీకరింప బడును. పాట్టునందు అవి తమిళ భాషయందలి ధ్వనులకు ఒదుగునట్లుగా మాఱుపాటు చెందును. మణి ప్రవాళ రచనా విధానము తమిళము, కన్నడము, తెలుగు అను ఇతర దక్షిణదేశ భాషలయందు కూడ కలదు. తమిళమునందు జైనకవుల రచనము లందును, వైష్ణవాచార్యుల వ్యాఖ్యానము లందును, మణిప్రవాళ భాష కానవచ్చును. 'వీరచోళియం' (క్రీ. శ. 11 వ శతాబ్దము) అను అలంకార గ్రంథము కావ్యభేదములను గూర్చి తెలుపుచు మణిప్రవాళమును కూడ ఒక కావ్య భేదముగా పేర్కొనెను. కాని అది తమిళమున వేరూనలేదు. తిరుజ్ఞాన సంబంధర్ (క్రీ. శ. 7 వ శతాబ్దము) దానిని 'సంకదపంగము' (సంస్కృత భంగము) అని గర్హించెను. శేక్కిలార్ (క్రీ. శ. 12 వ శతాబ్దము) ఒట్టక్కూత్తర్ కాలమున ప్రచురమై యుండిన సంస్కృతభూయిష్ఠ మగు శైలిని గర్హించి 'శెందమిళు'ను పునరుద్ధరించెను. కన్నడమున కూడ ఒక కాలమునందు మణిప్రవాళ రచనము కొంత సాగెను. అగ్గళు డను జైనకవి 'రూపస్తవనము' అను పేరుకల గ్రంథమును మణిప్రవాళములో రచించెనని పార్శ్వపండితుడు (క్రీ. శ. 1205)తన చంద్రప్రభ పురాణమునందు పేర్కొనెను. అగ్గళునికి చాలకాలము పూర్వమునుండియే కన్నడమున మణిప్రవాళము కొంత ప్రచురమై యుండెనని యూహించుటకు ఆధారములు కలవు. కవిరాజమార్గము రచింపబడిన తరువాత ఆ విధానము అంతగా ఆదరపాత్రము కాలేదు. అగ్గళునివంటి ఒకరిద్దఱు కవులను మాత్రము అది ఆకర్షించినట్లు కానవచ్చును. ఆ తరువాతి కాలములో అది పూర్తిగా నశించి పోయినది. ముద్దణ (క్రీ. శ. 19 వ శతాబ్దము) అను కవి కర్మణులు, శెంబవళములు హారములో కూర్చిన విధమున సంస్కృత శబ్దములను, కన్నడ శబ్దములను తన రచనమున కూర్చుతనని చెప్పుకొనెను. అది మణిప్రవాళమునే స్ఫురింప జేయును. కాని అతని గ్రంథముల యందలి భాష మణి ప్రవాళము కాదు. అతడు కేరళమునకు అతిసమీపమున నున్న దక్షిణ కెనరా ప్రాంతమునకు చెందిన వాడగుటచే మలయాళముతోడి పరిచయ జ్ఞాపకముతో అట్లు పేర్కొనియుండ వచ్చును. తెలుగునకూడ మణిప్రవాళ రచనము ఒక కాలమునందు ఉండెననుటకు ఆధారములు కలవు. నన్నెచోడుని (క్రీ. శ. 12 వ శతాబ్దము) కుమార సంభవమునందలి 'మార్గ కుమార్గము దేశి అమార్గము' అను పద్యమునుబట్టి మణిప్రవాళ రచనమును అభిమానించుచుండిన కవులు కొందఱుండి యుందు

రని, వారినే నన్నెచోడుడు పయి పద్యమున గర్హించె నని యూహింప బడుచున్నది. నన్నయకు నారాయణభట్టు మహాభారత రచనమునందు చేసిన తోడ్పాటు కావ్యభాషా నిర్ణయమునందు కూడ నని తలప బడు చున్నది. పాల్కురికి సోమనాథుడు (క్రీ. శ. 12 వ శతాబ్దము) మణిప్రవాళమును పేర్కొనుట మాత్రమే కాక అందు కొన్ని పద్యములను కూడ తన వృషాధిప శతకమునందు రచించెను. అతనికి తరువాతి కాలమున కూడ మణి ప్రవాళము అతివిరళముగా ప్రచారములో నుండినట్లు తెలియును. తిక్కన కేతనాదులు (క్రీ. శ. 13 వ శతాబ్దము) అట్టి రచనా విధానమును గర్హించిరి. అయినను కొందఱు సంస్కృత విద్వాంసులు హాస్యమునకై-వినోదక్రీడగా మణి ప్రవాళములో శ్లోకములను రచించి అలరింపచేయుచునే యుండిరి. తెలుగు శబ్దములకు సంస్కృత విభక్తి ప్రత్యయములను చేర్చి చెప్పిన మణిప్రవాళ శ్లోకములు తెలుగులో నుండెను. తెలుగు వైయాకరణులు సమాసకల్పనమునందు కూడ మణిప్రవాళ పద్ధతిని నిషేధించిరి. అయినను అట్టి సమాస కల్పనము వ్యవహార ప్రాబల్యమువలన కాబోలు కావ్యాదులలో చోటు చేసికొనుచునే యుండెను. శిష్ట వ్యవహారములో నేడును మణిప్రవాళ చ్ఛాయలు కానవచ్చును. చారిత్రక కారణములచేతనో, సాంస్కృతిక కారణముల చేతనో ఒక భాష మఱొక భాషపై ప్రాబల్యము వహించినపుడును, రెండు భాషలకు సంపర్కము సంభవించినప్పుడును వ్యవహారము తొలుత మణిప్రవాళమునందే జరగుట సహజముగా తటస్థించుచుండును. కొన్ని రచనములును తొలి దశలో అట్టి భాషయందు వెలయుట సంభావ్యము. క్రమముగా ప్రాబల్యము వహించిన యా భాషలోని పదజాలమును తమ తమ భాషా పద్ధతులకు అనుగుణముగా తత్సమీకరించుకొని యితర భాషలు పురోగమించు చుండును. అటు కాక మణిప్రవాళమే ఒక విశిష్ట కావ్యశైలి యగుట, అందు విస్తారమయిన సాహిత్యము వెలయుట ఒక విచిత్ర సంభవము! ఆదికాలమున అది సంస్కృత ప్రాకృత భాషా మిశ్రముగానుండి క్రమముగా మధ్యయుగము నందు సంస్కృత దేశ భాషా మిశ్రమయిన భాషగా పరిణమించినది. తక్కిన దక్షిణ దేశభాషలు దాని ప్రభావమును క్రమముగా తొలగించుకొని స్వీయభాషాశైలులను పరిరక్షించుకొనగా మలయాళములో మాత్రము అని కొంతకాలము ప్రాభవము నెఱపినది. కాని అధునిక కాలమున అందు కూడ శుద్ధమలయాళమే ప్రాముఖ్యములోనికి వచ్చినది. ఆంగ్ల భాషా ప్రాబల్యముచేత నేటి దేశభాషా వ్యవహారమునందును మణిప్రవాళము కానవచ్చును. ఇందు సంస్కృతము యొక్క స్థానమును ఆంగ్లభాష యాక్రమించినది.

ఆధారములు :

1. P. K. Parameswaran Nair - History of Malayalam Literature. Pub. Sahitya Akademe, New Delhi 1967.

2. Dr. T. P. Meenakshisundaram – History of Tamil Literature. Pub. Annamalai University, Chidambaram.

3. Dr. T. P. Meenakshisundaram – Tamil and other cultures (Exterior Relations of Tamil) – Paper submitted to III conference of International studies - Tamils, Paris 1970.

4. Dravidian Linguistic Association - Proceedings of the First All gndia conference of Dravidian Linguists held at Trivandrum-1971.

5. Unknown Authorship - Lilatilakam.

6. Veeracholiam.

7. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి— దక్షిణ భారత సాహిత్యములు.

8. డాక్టరు దివాకర్ల వెంకటావధాని — ఆంధ్ర వాఙ్మయారంభదశ—ప్రాఙ్నన్నయ యుగము—1960.

9. బండారు తమ్మయ్య (సంపా)—శ్రీ వృషాధిప శతకము — శ్రీ నిర్మల శైవసాహితీ గ్రంథమాలిక, కాకినాడ (ప్రక) 1969.

10. కోరాడ రామకృష్ణయ్య — దక్షిణదేశ భాషా సారస్వతములు—దేశి (ప్రక) 1954.

జామ్బవతీ పరిణయమ్

శ్రీ నోరి నరసింహ శాస్త్రి

కర్ణాట క్షితిపాల శేఖరమణియైన శ్రీ కృష్ణదేవ రాయలు రచించిన ఈ సంస్కృత నాటకమును ఆం. ప్ర. సాహిత్య అకాడెమీవారు దేవనాగర లిపిలో అందముగా ప్రచురించుట సర్వవిధముల సంభావ్యము. అనేక సంస్కృతాంధ్ర గ్రంథములకు సంపాదకత్వము వహించిన అనుభవజ్ఞులగు డా. బి. రామరాజుగారికి పరిష్కరణ భారము అప్పగించుటయు సమ్మోదావహము. శ్రీ రామరాజుగారు పరిష్కరణములో తమ గురువర్యు లగు రఘునాథ చక్రవర్తిగారియు మిత్రులగు డా. పుల్లెల రామచంద్రుడు, శిరోమణి వికలదేవులయు సహాయము పొందుట సంపాదకులు చూపిన శ్రద్ధకు నిదర్శనము.

ఆముక్తమాల్యదావతారికలో రాయలు రచించి నట్లు పేర్కొనబడిన సంస్కృత గ్రంథములలో ఈ నాటకము లేకున్నను రాయల కర్తృత్వమున కెట్టి సందేహమును లేదు.

ప్రథమ నాందీ శ్లోకమే ఆర్షతుల్యవాక్కులతో పాఠకులను ఆకట్టుతున్నది.

'వాఞ్ఛాం వ స్ప్రతతం దేయా
త్త ద్వారణ ముఖం మహః
యచ్ఛ్రన్ద వహో శే రానన్ద నిష్యందం
ప్రథమం విదుః'

ఇందులో నాందీ లక్షణము ననుసరించి ద్వాదశపదము లున్నవి. చంద్రదవద మున్నది. ఆశీర్వ చన రూపమైనది. రెండవ నాందీ శ్లోకములోని కమలా నాథుడు, మూడవ దానిలో నీలా రుక్మిణీనాథుడు, నాల్గవ దానిలో వాయుపుత్రుడు సౌఖ్యాదు లిత్తురు గాక అని ఆశీర్వచనము లున్నవి. ఈ నాలుగు నాందీ శ్లోకముల పిమ్మట సూత్రధారుడు ప్రవేశించి రామ మహస్సుకు నమస్కరించి పుష్పాంజలి సమర్పించును. నటిని రావించి సూత్రధారుడిట్లు నాటక ప్రస్తావన చేయును.

'అద్యఖలు భగవత శ్చ రా చరమరోః అపార కరుణాపారావారస్య సమ దమ ర శిరో మన్దార కుసుమ వాసిత పాదారవిన్దస్య విజయనగర నివాస వాసనావ ధీరిత ధనద నగర విహార దోహలస్య హేమకూటగిరి కటక వాస్తవ్య కుటుమ్బినః కర్ణాట రాజ్యరక్షా మణేః శ్రీ విరూపాక్ష దేవస్య చైత్రోత్సవా లోక నాయ సఙ్గతా పరిషత్.'

అని వర్ణింపబడిన సభలో నాటక ప్రదర్శ నము జరుగనున్నట్లు ప్రస్తావింపబడుట గమ నార్హము. తర్వాత 'కృష్ణరాయః కవిః' అని చెప్ప బడినది. పిమ్మట మనోజ్ఞముగా,

'అసారా మపి గృహ్ణన్తి వాచం హరికథాశ్రయామ్
సుమనో గన్ధలోభేన సూత్రం శిరసి ధార్యతే'

ప్రస్తావన పూర్తియగునప్పటికి సూక్ష్మదృష్టి కలవారు ఈ నాటక కర్తయగు రాయలు ఆముక్త మాల్యదలో వలె రామానుజ వైష్ణవాభిమానమును పర మత ద్వేషమును గల రాయలుగా గాక, ఇతర సాక్ష్య ముల వలన మనకు తెలియవచ్చు సర్వమత సామ రస్యము గలిగి ప్రజారంజకుడగు ప్రభువుగా దర్శన మిచ్చుచున్నట్లు గమనింప గలరు. నాలుగవ నాందీ శ్లోకములో వాయుపుత్రుడు ప్రస్తావింపబడుటచేత రాయలకు గల విష్ణుప్రీతి మాధ్వవైష్ణవుల సంప్ర దాయము ననుసరించిన దనియు తోచును. రాయల 'సకల కథాసార సంగ్రహము' అవతారిక లోనిదిగా సంపాదకులు పీఠికలో ఉద్ధరించిన ఈ శ్లోక భాగము ఆ భావమును బలపరచును.

'ఉత్సాహం మమ వీక్ష్య మస్కరు రథ
శ్రీ వ్యాస తీర్థో మునిః......'

ఈ వ్యాసతీర్థులవారు పూర్వపక్షమున ననేక గ్రంథములు రచించిన ఉద్దండ పండితులు. వారికి రాయలు తిరుపతిలోను విజయనగరములోను వస తులు కల్పించినట్లు శాసనాధారము కూడ కలదు. రాయలకు అభిమాన పాత్రమైన మతమును గూర్చి ఇంతవరకు తగినంత విచారణ జరుగ లేదు. దానికీ గ్రంథమెంతయు నుపయోగ పడగలదు. గతాను గతి కముగా నతడు రామానుజమత వైష్ణవుడనుట పునః పరిశీలించదగినది.

జాంబవతీ పరిణయమునకు జాంబవతీ కల్యాణము అను నామాంతరము కూడ కలదు. ఇది ఐదంక ముల నాటకము. కథాసంగ్రహము పీఠికలో సంపా దకులు చక్కగా ఇచ్చినారు. భాగవతాది గ్రంథాలలో కనపడే శమంతకమణి హరణ కథయే కథావస్తువు. లీలాపవాద నివారకముగా వినాయక చతుర్థినాడు అవశ్య పఠనీయములుగా స్కాంద పురాణములో చెప్ప బడిన కథలలో నిది ప్రధానమైనది. ఆ కథలన్నియు చదువలేని వారు ముఖ్యముగా నీ శ్లోకమైన పఠింప వలెనని స్కాందము ఉపదేశించు చున్నది. శ్రీ గౌరి వాక్యమది!

'సింహః ప్రసేన మవధీ
త్సింహో జామ్బవతీ హతః
సుకుమారక మారోదీ స్తవ
హ్యేష శ్యమంతకః'

ఈ నాటక ప్రస్తావనలో,

'లోకాపవాదా ద్భేతవ్యం దుష్ట్వా దాశీ విషాదివ'

ఇత్యాది శ్లోకముండుటయు ప్రథమ నాంది గణపతిని స్మరించుటయు చూడగా రాయ లీనాటక మును లీలాపవాద నివారక కథగానే భావించి రచించి నట్లు తోచును.

ఈ నాటక రచనను గూర్చియు అందలి కవిత్వ వైభవమును గూర్చియు సంపాదకులు పొగడినారు. కాని ఆంధ్రుల కందరికి వలెనే వారికిని రాయలయందు గల గౌరవాభిమానములచేత మాత్రమే ఆ పని చేసి నట్లు పాఠకులకు తోచక మానదు. సంస్కృతములో ఉత్తమ నాటక రచనా పరంపర విచ్ఛిన్నమైన తర్వాత రచితములైన నాటకములలో సర్వసాధారణముగా గోచరించు క్షీణలక్షణము లన్నియు నిందును ప్రత్యక్ష మగు చున్నవి. దీని కూర్పులో బిగువు కాని నేర్పు కాని కన బడదు. నాటకీయత మృగ్యము. సంపాదకులు పీఠికలో నుదాహరించినట్లు ప్రసిద్ధులైన వాల్మీకి, కాళిదాసు, భవభూతి, శ్రీహర్షుడు, మాఘుడు మొదలగు మహాకవుల భావము లయు పదబంధములయు అనుకరణములే కాక సంఘటనల అనుసరణములు కూడ గ్రంథమం దంతట కనిపించు చున్నవి. సంపా దకులు చూపినవే కాక ఇతరము లెన్నియో కూడ కలవు. అది కాల ధర్మముగా మాత్రమే గ్రహింపదగును.

నాటక రచనలో కూర్పులో నేర్పు లేదనుటకు కొన్ని ఉదాహరించెదను.

నాటక ప్రారంభములోనే నారదుడు ప్రవేశించి, 'బిలములో నివసించు జాంబవతికిని ద్వారకలో నివ సించు శ్రీ కృష్ణునికిని సమావేశము కూర్చుమని తన్ను బ్రహ్మ పంపెనని పలికి ఆ కార్యము సాధించు టకు ద్వారవతికి పోయెద ననుచు ప్రారంభించును. కాని అప్పటికే శ్రీ కృష్ణుడు బిలపరిసరా రణ్యమునకు వచ్చియుండెను. నారదుని ప్రయత్న మేమాత్రము లేకుండగనే జాంబవతికిని శ్రీ కృష్ణునికిని సమాగ మమై అనురాగము వృద్ధియైనది. వారి కల్యాణ మునకు గూడ నారదుడు చేసిన దేమియు లేదు. సింహ రూపమున తన శిష్యుని పంపె ననునది ఒక్కటి మాత్రమే నారదుని ఘన కార్యము. ఈ కల్పనకూడ హృదయంగమమైనది కాదు.

నారదుని వలెనే కిన్నరమిథునము, గంధర్వుడు, హంసుడు, బ్రహ్మ, సరస్వతి పాత్రలును వృథాగా ప్రవేశపెట్టబడినారు. కిన్నరమిథునము చేసిన పని జాంబవతి విరహవేదనను శ్రీ కృష్ణుని కడ వర్ణించుట మాత్రమే. జాంబవంతునితో శ్రీ కృష్ణునకు సంభ వించిన యుద్ధమునకు మంచి కారణమైనను కల్పింప బడలేదు.

శ్రీ కృష్ణుడు స్వతంత్రుడు గదా! అతడే జాంబవతిని మరల దర్శింప గోరినచో ద్వారకలో విరహవేదనతో కుమిలిపోక, ఓలపరిసరా రణ్యమునకు వెళ్లియుండవచ్చును. అట్లుగాక ప్రసేనుని గూర్చి విచారించుటకు పొమ్మని బలరాము డాదేశించు వరకు ద్వారకలోనే ఉండి విరహబాధ పడుచుండుట చిత్రముగా తోపక మానదు. కవికి విరహవేదనను వర్ణింపవలె నను ఉబలాటమే కాని వేరు ఆలోచన లేదు. శ్రీ కృష్ణుదు జాంబవతీ సామీప్యమును వదలి వెళ్లవలసి వచ్చుటకు ద్వారకలో అవసర కార్యమైనను కల్పింప బడలేదు. సంస్కృతములో ఉత్తమ నాటక రచన క్షీణించిన తర్వాత పుట్టిన నాటకములలో నాటకీయత లోపించి నను కవితా వైభవము సర్వసాధారణముగా కాన వచ్చును. పద్యభాగములును ఎక్కువ కాసాగినవి. ఇందులోగూడ పద్యభాగము విస్తారమే. 270 శ్లోకాలు ఉన్నవి. అది గ్రంథములో మొత్తమున్న 2,295 పంక్తులలో 900 పంక్తులలో ముద్రింప బడినవి. ఇన్ని శ్లోకము లున్నను కవితావైభవమున్న శ్లోకములు 21 గా సంపాదకులు తెలిపి నారు. అవిగాక మరి కొన్ని కూడ గలవు. అట్టివానిలో గణపతిని స్మరించు ప్రథమ నాందీశ్లోక మొకటి. మరియొకటి ప్రస్తా వనలోనే గల 'అసారామపి గృహ్ణన్తి.........' ఇత్యా దిగా గల పూర్వోదాహృత శ్లోకము. అది చంద్రాలోక ములో అర్థాంతరన్యాసాలంకారమునకు ఉదాహరణముగా చెప్పిన శ్లోక భావమునకు అనుసరణము మాత్రమే కాదు.

'గుణవ ద్వస్తు సంసర్గాత్
యాతి స్వల్పోఽపి గౌరవమ్
పుష్పమాలాను షంగేణ
సూత్రం శిరసి ధార్యతే॥

చివరిపాదము పూర్తిగా ఉన్న దున్నట్లు గ్రహింప బడినది.

ఈ నాటకములో హృదయంగమంగా ఉన్న శ్లోకాల సంఖ్య నిష్పత్తి మొత్తము శ్లోకాలసంఖ్యతో పోలిస్తే అతిస్వల్పము. బాగున్నవనిపించు శ్లోకాలు కూడా తరుచుగా పైదానివలెనే పూర్వకవుల అను

సరణలు. జాంబవతీ శ్రీ కృష్ణుల విరహవేదనలు ప్రబంధనాయికా నాయకుల విరహవేదనల ప్రతిశబ్దాలే.

ఆముక్తమాల్యదాకర్త స్వభావోక్తిలో నిరుపమానుడనుచు, ప్రథమాంకములోని అరణ్యవర్ణన మట్టిదని సంపాదకులు పేర్కొనినారు. అరణ్యవర్ణన శ్లోక మిట్లున్నది.

'అరణ్యానీ సేయం కరటి కరటానర్గల గల
న్మద స్రోతోజాతోదయ బహుల సౌరభ్య భరితా
స్ఫురఝ్ఝిల్లీ ఝాట ప్రకటకటు ఝంకార జనిత
శ్రవ శ్శూలా హేలా కలిత రవ కణ్ఠీ రవ కులా!॥

ఇందులో స్వభావోక్తికంటె అతిశయోక్తియు కేవల శబ్దాడంబరమును మాత్రమే గోచరించు చున్నవి.

ఈ నాటకము బయటపడుట వలన రాయలు ఆముక్తమాల్యదను రచింప లేదనువారి వాదము వీగి పోవునని సంపాదకులు తెలిపినారు. కాని నిష్పక్షపాతముగా నిశితదృష్టితో చూచువారికి సందేహము బలపడునేకాని ఉపశమింపదు. దానికి ముఖ్యమైన ఉపపత్తులివి:

(1) ఆముక్తమాల్యదలో కవితా వైభవము, విశిష్టత, స్వతంత్రరీతి ఆద్యంతము కనిపించును. ఈ నాటకము అందులకు విరుద్ధము.

(2) ఆముక్తమాల్యదా రచయిత ద్రావిడామ్నాయము లెరిగిన వాడు కాకున్నను, రామానుజ వైష్ణవేతర మతములను కంఠోక్తిగా ద్వేషము చూపిన వాడు. ఈ నాటకకర్త అట్టిభావములకు దూరుడే కాక మాధ్వవైష్ణవమందు ప్రత్యేక ప్రీతికల వా డనిపించును.

ఈ రెండు కారణములును ఈ రెండు కావ్యములను రచించిన కవి ఒకడే ఐ యుండునా అను సందేహమే బలపడుచున్నది. 'సాహితీ సమరాంగణ సార్వభౌముడు' అని మహాకవులచేత కీర్తింపబడిన రాయలు కావ్యరచన చేయలేనివాడని వాదింప నక్కర లేదు.

ఈ నాటకమునకు సంపాదకత్వము వహించిన డా. బి. రామరాజుగారు పరిష్కరణాదికములలో ఎంతో శ్రద్ధను ఓర్పును చూపిరి. ఈ నాటకము వ్రాతప్రతులు మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునను, తంజావూరు సరస్వతీమహలునందును, కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తునందునుకలవనుచు మొదటి రెండు గ్రంథాలయములలోని మూడుప్రతులను బట్టిమాత్రమే మూలపాఠము గ్రహించితిమనిరి. కాకినాడ పరిషత్తు ప్రతిని ఎందుకు సంప్రదించలేవో తెలుపరైరి.

సంస్కృత నాటకములం దన్నిటిలోవలె ఇందును సంస్కృత ప్రాకృత భాషలు రెండును ఉన్నవి. సంపాదకులు తమకు సుష్ఠుగా ప్రాకృతము రానందునను, ప్రాకృత భాషా విద్వాంసులు అందుబాటులో లేనందునను, ఇందలి ప్రాకృత భాగము సరిగా లేనందునను, విధిలేక ప్రాకృత భాగము ఉన్నవున్నట్లు ముద్రించితిమని తెలిపిరి. అందువలననే సంస్కృతచ్ఛాయ ఈయ లేదని తోచును. మొహమాటములేని వారి సత్యోక్తికి వారిని అభినందించుచున్నాము.

ఈ నాటకములో మొత్తము పంక్తులు 2,295. వానిలో ప్రాకృత పంక్తులు 831, సంస్కృత పంక్తులు 1464. సంస్కృతము మాట్లాడు పాత్రల సంఖ్య 12, ప్రాకృతము మాట్లాడు వారిది 12. కాబట్టి గ్రంథపంక్తులలో మూడవ వంతునకును, పాత్రలతో సగముమంది భాషకును సంస్కారము జరుగలేదన్న మాట. ప్రాకృతములో ఆవలి పాత్ర మాటాడినదేమో తెలియరా కున్నందున ఈవల సంస్కృతము మాట్లాడిన పాత్ర మాటల సందర్భముకూడ ఎన్నోచోట్ల చక్కగా తెలియరా కున్నది.

ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడెమీవారు 1968 లో నెలకు రు 250/-ల ఉపకార వేతన మిచ్చి ప్రాకృత భాషాధ్యయనము చేయుటకు ఒకరిని పూనాకు పంపియుండిరి. ప్రాకృత భాగ సంస్కరణమునకు వారి సహాయముకూడ అందలేదని భావించుచున్నాము.

సంపాదకులు సంస్కృత భాగములకు పాఠ నిర్ణయములు చేయుటయందును, లుప్తభాగములు పూరించుటయందును, అవసరమైన సంస్కరణములు చేయుటయందును శ్రద్ధయు సమర్థతయు చూపినారు. గ్రహింపని పాఠాంతరములు అథస్సూచికలలో నిచ్చినారు. తాము పూరించిన భాగములు కుండలీకరణము చేసినారు. పూరింప సాధ్యము కానివి చుక్కలు పెట్టి వదలినారు. ఈ విధముగా సంపాదకత్వమున ఔచిత్యము ప్రదర్శించినారు.

సర్వసామాన్యముగా మూలములో ముద్రించిన పాఠములే యుక్తతరములుగా ఉన్నవి. ఎక్కడనో లోపములు లేకపోలేదు. ఉదాహరణము: పే. 19. అం. 1 శ్లో. 41.

'మధుప శుక పిక వ్రతానాం
పుష్పిత పల్లవిత ఫలిత శాఖానామ్...'

క్రింద ఇచ్చిన పాఠాంతరము 'మధుప పిక శుక వ్రతానాం' ఇత్యాదిగా ఉన్నది.

పికములు పల్లవములను శుకములు ఫలములను గ్రహించును. పికశుక పాఠమే యుక్తతరము. గ్రహించిన పాఠములో క్రమభంగము కలిగినది.

లుప్తపూరణములు చక్కగా ఉన్నవనుటకు ఒక ఉదాహరణము. పే. 4 ప్రస్తావన.

'(కర్ణాటక్షితి పాలశేఖర మణిః శ్రీ)
కృష్ణరాయః కవిః
సూక్తిః కర్ణరసా యనం
సుమనసాం శ్లాఘ్య స్వభావా సభా
చారిత్రం యదువంశ శేఖర
మణే ర్దేవస్య సర్వోత్తరమ్
పారమ్పర్య కృత శ్రమః
పున రమీ నాట్యేన పారావయమ్'

'శేఖరమణిః' రెండు చోట్లను వచ్చుటచే పూరణము అందగించినది.

బాగుగానే పూరించినను మనోజ్ఞతరముగా పూరించుటకు అవకాశ మున్నదానికి ఒక ఉదాహరణము పే. 43. అం. 2 శ్లో. 26.

'వహతి పులిన ముచ్చైః కశ్చి దావర్త మారాత్
లసతి వియతి శైల ద్వంద్వ మున్నేయ భేదమ్
శ్రయతి తిమిరరేఖా చన్ద్ర సౌహార్ద ముద్రామ్
(కువలయ యుగ మేత ద్రాజతే పద్మ మధ్యే.')

పూరించిన చతుర్థపాదములో తక్కిన వానిలో వలె విరోధాలంకారము చక్కగా అమరినది. కాని తక్కిన పాదములు 'వహతి, లసతి, శ్రయతి' అని క్రియాపదములతో ప్రారంభమైనట్లే నాల్గవది కూడా ప్రారంభమైతే ఎక్కువ బాగుండేది. 'ధరతి మృదుల తేయం సాధు, రంభో ప్రకాండే'—అన్నరీతిగా పూరిస్తే ఎక్కువ బాగుండును కదా!

నాటక ముద్రణములో నాటకములో వచ్చు పాత్రల పేరు ఇచ్చుట సర్వసాధారణము. ఇందులో లేకుండుట కొరతగా ఉన్నది.

రాయలు రచించిన ఈ యపూర్వ గ్రంథమును ఉత్తమ మార్గము లవలంబించి ఆంగ్లములో తెలుగులో రెండు పీఠికలతో పరిష్కరించి అందించిన డా. రామరాజుగారికి సంస్కృత భాషాభిమానులు ఎంతయు కృతజ్ఞత చూపవలసియున్నది. భారత దేశములోని ప్రాకృతభాషా విద్వాంసులు ప్రాకృత భాగములు సంస్కరించుటకు తోడ్పడి ద్వితీయ ముద్రణమును సంపన్న మొనర్తురు గాక!

ఈ గ్రంథ ప్రచురణము చేపట్టి అందముగా మంచికాగితములమీద దేవనాగరాక్షరములతో సర్వ ప్రపంచమునకు అందుబాటులో నుండునట్లు తక్కువ మూల్యముతో అందించిన ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడెమీవారు అభినందనీయులు. సెక్షను కుట్టు లేకపోవుట ఒక్కటే లోపమనిపించినది. ఆంధ్రభోజుని రచనను ప్రచురించుటలో ధన వ్యయమునకు వెనుకాడవలసిన పని యుండగూడదు గదా!

(జాంబవతీ పరిణయమ్ : కర్త : శ్రీ కృష్ణదేవరాయః సంపాదకులు : డా. బి. రామరాజు, ప్రకాశకులు ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడెమీ, కళాభవనము, సైఫాబాదు, హైదరాబాదు-4—డెమీ 1/8 పేజీలు 166 (పీఠికలతో) పూర్తి కాలికోబైండు. వెల రు. 4/లు.)

కవరు

శ్రీ కె. శివారెడ్డి

ఇంకా భయం
ఇన్ని యుగాల ఎదుగుదల తదనంతరం కూడా
ఇన్ని వేల సంవత్సరాల
సంస్కృతులు నాగరికతలు రక్తంలో, ప్రవహించిం తర్వాత గూడా
ఇంకా భయం భయంగానే—
భయం
నరాల ఇంటిచుట్టూ నక్కలా
గిరికీలు కొడుతూనే ఉంది.
ఇచ్చట గాలికూడా
భయం కలుషితమై
రక్తాన్ని పిరికి తనంలో దొర్లించి
దొంగబ్రతుకే ఆదర్శ ప్రాయమై
నేలచుట్టం గుడిసె లోని మనిషిలా
పాకటమే ధ్యేయం.

నదులు కొండల్లోని నిర్భీతి తో
అగ్నిలా పునీత మౌదా మంటే
అధైర్యంలో పుట్టిన మనకి
విశ్రాంతి నీడగాని, సాహసం తోడగాని, దొరకవు.

రాత్రి పగలూ
తుఫాను కసురులా
సుదీర్ఘంగా సాగుతున్న 'భయం సుడి'-
ఇన్ని అసమానతల అవకతవకల వికృతుల
మధ్య భయం దాడి తప్పదు.

వెలుతురుకి చీకటికి తేడాలేని స్థితిలో
నరాలలో కరెంటు పోయి
తుహిన వర్షాపాతమే
నిర్జీవ శాంతి కామధేనువుమీద, కురుస్తుంది
కురవనీ—కురవనీ
స్వేచ్ఛా హస్తం జన్మించే వరకు
కురవ నీ—

చంద్రహారం

డా. ముదిగొండ శివప్రసాద్

సూర్యుడు ఉదయిస్తాడు. నీటి దొరువుల్లో కమలాలు వికసిస్తాయి. తమలపాకుతోటల నానుకొనివున్న మొగలి పొదలు సువాసనలు వెదజల్లుతాయి. గుంపులు గుంపులుగా జలపక్షు లొక్కసారి పైకి లేస్తాయి—జాలరివాళ్లు గంగమ్మతల్లికి వందనంచేసి కొయ్యతెప్పలను నీళ్లల్లోకి నెట్టుతూ వుంటారు—సముద్రం ఎంతో శ్రమతో పరుగెత్తుకుంటూవచ్చి చెలియలికట్టను తాకి విరిగి విరిగి పడిపోతుంది—ఇంత లోనే మళ్లా కొత్త అతి—కొత్త పరవడి — కొత్త ఉత్సాహం— ఈ కథ ఈనాటిది కాదు. చరిత్ర కందని కాలంనుంచీ యథా తథంగా అలాగే ఏమీ మార్పు లేకుండా కొత్త పట్నంలో జరుగుతూనేవుంది!

చంద్రయ్య పంతులు ఓ వెదురుబెత్తం చేత్తో పట్టుకొని ఊపుతూ నడుస్తున్నాడు. సూర్యుడు పడమటి దిక్కుకు వంగాడు. అయినా ఇసుక ఇంకా చుర చుర మంటూనే వుంది. రెండు చేతులనిండా సీమ సున్నం—మాసిన పంచెమీద నాలుగైదు చేతికుట్టు మాసికలు. రూపాయి వెడల్పున సిరా మరకపడ్డ ముతక ఖద్దరు చొక్కాజేబు. ఆ జేబులో ఓవైపు ఎర్ర రంగూ మరో వైపు పచ్చరంగూ వున్న పెన్సిలు. హరివిల్లులా వంగిన వెన్ను. అలల్లాగా, అల్లల్లాడుతున్న తెల్లని జుత్తు, దుబ్బుగా పెరిగిన తెల్లని మీసాలు—పంచె అంచుతో నుదుటి స్వేదబిందువులు అద్దుకొని వెళ్లి తన మామూలు సింహాసనంపై కూర్చున్నాడు—

ఆ సింహాసనం ఈ నాటిది కాదు.

గత నలభైఅయిదు సంవత్సరాలుగా అలాగే అక్కడే అదే సమయంలో ప్రతి దినమూ కూర్చుంటున్నాడు. ఆ వూళ్లో దానిపై కూర్చునే అధికారం మరెవ్వరికీ లేదు. అందుకే వూళ్లోవాళ్లంతా దానిని 'చంద్రయ్య గారి గద్దె' అంటారు.

చేతిలోని వెదురు బెత్తాన్ని చెట్టు కానించాడు. తనగద్దెపై ధూళి నొకసారి చేత్తో తుడిచాడు. గద్దె ధూళి పోయిందో లేదో కాని చేతి చాక్ పీసుపొడి మాత్రం గద్దె కంటుకున్నది. చంద్రయ్య రాతి గద్దెపై కూర్చొని గొంతుకు బిగుత్తుగా వున్న ఖద్దరు చొక్కా గుండీలు సడలించి ఒకసారి నిట్టూర్చి ఊపిరితిత్తులనిండుగా గాలి పీల్చుకున్నాడు.

'పంతులుగారూ ఇయిగో' గ్లాసుతో కొబ్బరి నీళ్ల నందించాడు శేషు. చంద్రయ్య శేషువైపు ప్రేమగా చూచి గ్లాసెడు నీళ్లు గడగడ తాగేశాడు. అటు పోసుకునే సుబ్బమ్మ కొడుకు శేషు. తన విద్యార్థి. శేషు తండ్రి పుల్లయ్య కూడా తన శిష్యుడే. అతనికీ ఓనమాలూ ఒకటో ఎక్కమూ తానే దిద్దబెట్టాడు. చనిపోయేవరకూ పుల్లయ్యది అట్ల వ్యాపారమే. చనిపోయే రోజూ సాయంత్రం కూడా పుల్లయ్య మామూలుగానే కొబ్బరికాయలుకొట్టి నీళ్లు గ్లాసుకు పట్టివుంచి కొబ్బరి ముక్కలు పళ్లెంలోపెట్టి, భోషాణం పెట్టిలో దాచి, పిండి మొత్తమూ ఒంటిచేత్తో రుబ్బి గిన్నె కెత్తి, చేతులు కడుక్కొని, సూర్యుడు పడమటికి తిరిగే వేళకు చంద్రయ్య పంతులు తన పాఠశాల ముగించి వేపచెట్టుకింది సింహాసనాన్ని అలంకరించగానే గ్లాసెడు కొబ్బరి నీళ్లూ గురువుగారికి ఇచ్చాడు. కొబ్బరి నీళ్లుతాగి సేదతీర్చుకోమని 'పదికాలాలపాటు బతకరా పుల్లయ్యా' అని దీవించి 'అమ్మయ్య' అంటూ చెట్టు మొదటికి జారగిలవడ్డాడు చంద్రయ్య చల్లగాలి పీలుస్తూ, అయితే గురువుగారి ఆశీర్వాదం

మాత్రం ఫలించకుండా ఆ రోజు రాత్రే పుల్లయ్య పోయాడు. పుల్లయ్య పోయినందుకు చంద్రయ్య ఎంతగా మనస్సులో బాధపడ్డాడో చెప్పడం అసాధ్యం. అలా నిశ్శబ్దంగా లోలోపలే కుమిలి పోయాడు. తన కళ్ల ఎదుట పెరిగిన పుల్లయ్య చూస్తూండగానే పోయాడు. తానుమాత్రం అలా జీవితాన్ని లాగేస్తున్నాడు—ఏమిటీ విచిత్రం?? పుల్లయ్యపోయిన మర్నాడు బడికి శలవు ఇచ్చాడు చంద్రయ్య. పుల్లయ్య జాతీయ నాయకుడు కాడు. ప్రపంచ చరిత్రలో మహాయుద్ధాలు చేసి సువర్ణాధ్యాయులు సృష్టించ లేదు. కాకుంటే కొత్తపట్నం ప్రజలందరికీ నిద్రలేచీ లేవకముందే కొబ్బరి పచ్చడీ, అల్లం పచ్చడీ రెండూ మాడువి కులో పెట్టి, రెండు దోసెళ్ల వెడల్పున వుండే అట్లు ఒక్కొక్కటి అర్ధణాకు ఇచ్చేవాడు. చంద్రయ్యగారి కుటుంబానికైతే అర్ధణాకు రెండు అట్లు. పుల్లయ్య పోయినతరువాత ఓ నాలుగు రోజుల వరకూ చంద్రయ్యకు మనస్సు మనస్సులో లేదు—అయిదోనాడు మామూలుగా బడి వదిలిపెట్టి బెత్తం చేత్తో పుచ్చుకొని తన వేపచెట్టు సింహాసనం దగ్గరికివచ్చి కూర్చునేసరికి 'పంతులుగారూ ఇయిగో' అన్న మాటలు విన్పించాయి మృదువుగా. తల పైకెత్తి చూచాడు ఆశ్చర్యంగా. ఎదురుగా పుల్లయ్య కొడుకు శేషు వున్నాడు. చంద్రయ్యకు కళ్లవెంట నీళ్లు వచ్చాయి—పుల్లయ్య పోయాడని పని వదిలితే భుక్తి గడిచే దెటా?? అందుకే పుల్లయ్య స్థానంలో సుబ్బమ్మ కూర్చున్నది. ఆమే పిండి రుబ్బింది—కొబ్బరికాయలు కొట్టింది. ముక్కలు పళ్లానికెత్తి భోషాణంలో దాచింది. నీళ్ల గ్లాసుకుపట్టి కొడుకు ద్వారా చంద్రయ్య పంతులుకు పంపింది. నాటినుంచీ నేటివరకూ అలా శేషు దినం తప్పకుండా కొబ్బరినీళ్లు ఇస్తూనే వున్నాడు. చంద్రయ్య పంతులు తాగి సేద తీర్చుకుంటూనే వున్నాడు.........

ఈనాడు కూడా చంద్రయ్య శేషు చేతిలోని గ్లాసు తీసుకొని గడగడ నీళ్ళు తాగేశాడు. ఓ చుక్క చేతిమీద ఒలికింది. పైనవున్న మాసిన కండువాతో చేతిపై అద్దుకొని గ్లాసును శేషుకు తిరిగి ఇవ్వగానే తుర్రున తిరుగెత్తుకుంటూపోయాడు శేషు ఇంట్లోకి—చంద్రయ్య గట్టిగా నిట్టూర్చి వేపచెట్టు కానుకున్నాడు. దూరంగా సముద్రం. భూన్యాకాశాలు ఒకే నీలమేఘ చ్ఛాయతో కలిసిపోయాయి అక్కడ. గంభీరమైన ఆ సాగరంలో తరంగాలు ఉవ్వెత్తున లేచి విరిగి పడుతున్నాయి. చంద్రయ్యకు కొడుకు కూతురూ గుర్తుకొచ్చారు. గుండె బాగా బరువెక్కింది. 'రేపు తెనాలిలోవున్న బంధు వొకరికి జాబు వ్రాయాలి మళ్లీ పిల్ల సంబంధంగూర్చి' అనుకున్నాడు. ఖాళీ చేపల బుట్టలతో జాలరి వనితలు ఇంటి ముఖం పట్టారు. 'చందూగాణ్ణి రేపు ఫస్టు బస్సుకు ఒంగోలు పంపాలి' అనుకున్నాడు మళ్లీ. అక్కడొక తెలిసినాయన చందూకు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తానని మాట ఇచ్చాడు.

'దండాలు పంతులూ దండాలూ' మహాలక్ష్మి మళ్లె పువ్వుల్లాగా గుడ్డలను దొరువుల్లో ఉతికి ఆరేసి మడతలు పెట్టుకొని వెళ్లుతూవుంది త్రోవన.

'ఏయ్—ఇవ్వాళ మీ బుడ్డోడు రాలేదు—' చంద్రయ్య పంతులు తీగెల కళ్లజోడు తీసి పై పంచెతో తుడుచుకుంటూ అడిగాడు. కిసుక్కున నవ్వింది మహాలక్ష్మి. 'వాడి చదువే అడిగావ్ పంతులూ—ఓ పూటొస్తే రెండు పూటలు సర్వే తోటల్లో ఆడుతున్నాడు. నీ బెత్తానికి పని చెప్పందే లాబం లేదు పంతులూ—' ఒయ్యారం ఒలకపోస్తూ తాపీగా జవాబు చెప్పింది మహాలక్ష్మి.

చంద్రయ్య ఎడమ చేతి బొటన వ్రేలూ చూపుడు వ్రేళ్లతో ఒక్కసారి కణతలనుండి కొలుకుల వరకు కళ్లను రుద్దుకొని, రెప్పలు పెద్దవి చేసి 'ఇదిగో చూడూ వాడు బాగా తెలివైన ఘటం. ఇంటి దగ్గర మీరు మొగుడూ పెళ్లాలు శ్రద్ధ తీసుకోకపోతే ఏమీ లాభం లేదు. ఇటు అక్షరం ముక్కా అబ్బక అటు రేవుకూ పనికిరాక నిజంగా రెండింటికీ చెడిన రేవడు అవుతాడు.'

'ఊ' నన్నట్లు తల ఆడించింది మహాలక్ష్మి శ్రద్ధగా వింటూ. ''పెద్దోడు బుద్ధిమంతుడు పంతులూ ఈడికే వచ్చింది రోగం చదువంటే.''

'సరేలే. పో—పో—చీకటి పడుతున్నది.'

'చిత్తం—' అని మహాలక్ష్మి ఓ పది గజాలు పోయి మళ్లీ వెనక్కు వచ్చి 'పంతులూ మొన్న ఆడి పెనసలు ముక్క రంగయ్యగారి గుంటడు కాజేసి నాడంట - కొంచెం వాడి చెవులు మెలెయ్యాలి పంతులూ' అన్నది మూతి తిప్పతూ.

'ఊ—ఊఁ—' అన్నాడు చంద్రయ్య—మహాలక్ష్మి మళ్లీ నడుచుకుంటూ వెళ్లిపోయింది.

చంద్రయ్య తమలపాకు తోటల మీదుగా వస్తున్న మొగలి పూల గాలిని గట్టిగా రెండు ఊపిరి తిత్తుల నిండా పీల్చుకున్నాడు. ఆ ఊపిరి తిత్తులు పగలల్లా కొలిమి తిత్తుల్లాగా పనిచేసి సూర్యుడితో పాటు విశ్రాంతి తీసుకుంటుంటాయి. మళ్లీ సూర్యోదయంతో పని ప్రారంభిస్తుంటాయి.

తలపైకెత్తి చూచాడు.—

ఎదురుగా, దూరంగా, శిథిలమైన లైటు హౌస్ స్తంభం!

ఈ లైట్ హౌస్‌గూర్చి పరిశోధన చెయ్యాలని చాలానాళ్లనుంచీ చంద్రయ్య మనస్సులో ఓ కోరిక మిగిలిపోయింది. కాని దురదృష్టవశాత్తూ కొత్తపట్నంలోవున్నా మహావిద్వాంసుడల్లా తానొక్కడే. మరెవ్వరికీ రాజవంశావళీ, అక్కడి నౌకా వ్యాపారం జరిగిన కాలమూ చరిత్ర పుటలలోంచి బయటకు లాగే శక్తీలేదు—ఆసక్తీలేదు. అందుకే తనకోరిక ప్రతిరోజూ ఉవ్వెత్తుగా పైకిలేచివచ్చి ఒడ్డును తాకి విరిగి పోతున్నది—మొన్న ఉదయం అమ్మాయి అటకపై నుండి గుడ్డలమూటతీసి 'నాన్నా చూడు ఈ తాటాకుల పుస్తకానికి చెదలుపట్టినట్లున్నది' అన్నది దుఃఖపుతూ. చంద్రయ్య ఆదుర్దాగా పరిశీలించి చూచాడు. నిజమే! తనతండ్రి వ్రాసిన రామలింగేశ్వర శతకం చెదలుపడుతున్నది. ప్రాణం విలవిలలాడింది. భూతద్దం ఒకటి ఒంగోలునుంచీ తెప్పించి దాన్నంతా కాగితాలపై తిరిగి వ్రాసి వీలున్నప్పుడు అచ్చువేయించాలని చంద్రయ్య సంకల్పం. కానీ ఎప్పటికప్పుడు ఆర్థికమైన ఇబ్బందులవల్ల భూతద్దం కొనడమే పడటం లేదు—ఇక అచ్చుమాట చెప్పే దేమిటి—

ఈ లైటు హౌసుపై పరిశోధనకూడా అలాంటిదే...నిట్టూర్చాడు చంద్రయ్య.

ఆకుతోటలనుండీ రైతులు అరిటాకులు కట్టలు నెత్తిన పెట్టుకొని వరుసగా వస్తున్నారు—ఉదయం ఫస్టు బస్సుకు ఇవన్నీ ఒంగోలు చేరుతాయి పెరుగు ముంతలతో సహా. పూర్వమైతే అన్నీ ఊళ్లోనే పందారమై పోయేవి—ఇప్పుడిప్పుడీ వ్యాపారం మరిగారు రైతులు—

సుబ్బమ్మ చిన్నికోడిగుడ్డు దీపం వెలిగించి గోడకు తగిలించింది. ముద్దపులి బొంగరాల బుట్ట నెత్తిని పెట్టుకొని శేషు ఊళ్లోకి బయలుదేరాడు అమ్మటానికి. అంటే చంద్రయ్య గద్దెమీదినుంచీ లేచే సమయమన్న మాట — చిన్నప్పుడు ముద్దపులి బొంగరాలంటే తనకు చాలా ఇష్టం. పుల్లటి మజ్జిగలో పిండి నానబెట్టి పచ్చి శనగపప్పు, పచ్చి మిర్చీ, ఉల్లిపాయిలూ, కరివేపాకు కలిపి, దోరగా గుండ్రగా వేయించిన ఆ ముద్ద పులిబొంగరాలంటే ప్రాణం—అయితే తండ్రి తిననిచ్చే వాడుకాడు. 'కోమటింటి నూనె వస్తువులు కొనుక్కొని తినకూడద'ని నిషేధం విధించాడు—అదేమిటో చందూగాడికి కూడా అవంటే ఇష్టమే—అయితే చందూగాడిపైన తాను నిషేధం విధించలేదు — అప్పుడప్పుడూ చందూ, శేషును పిలిచి బొంగరాలు కొనుక్కొని తింటుంటాడు. తామమాత్రం పెద్ద తనానికి ఊరికే మందలిస్తూ వుంటాడు—అంతే!!

చీకటి బాగా వ్యాపించింది.

చంద్రయ్య ఇంటి ముఖం పట్టాడు. ఇంతలో చటుక్కున జ్ఞాపకం వచ్చింది, ప్రసూన 'సాయంత్రం ఆ రామయ్యకు చెప్పండీ గ్యాస్ నూనె అయి పోయింది పొద్దునే పంపించమనీ' అని చెప్పినమాట—వెంటనే చంద్రయ్య రామయ్య కిరోసిన్ దుకాణంవైపు తిరిగి నడక సాగించాడు. ఆకుతోటలనుంచీ గుంపుగా కొంగలువచ్చి వేపచెట్లపై వాలాయి. 'కొకొక్కొ'మంటూ— మెత్తని ఇసుకలో మెల్లగా నడుచుకుంటూ రామయ్య దుకాణం చేరాడు చంద్రయ్య బెత్తంతో నేలను పొడుస్తూ 'రామయ్యా...'

'ఎవరూ— పంతులా— రా పంతులూ' ఆహ్వానించాడు రామయ్య హరికేన్ లాంతరు కొంచెం పెద్దది చేసి. చొక్కా లేకుండా లాంతరు ముందు కూర్చొని

జవాపద్దుల పుస్తకం చూచుకుంటున్నాడు రామయ్యా మధ్య మధ్య ఎడమచేత్తో జంధ్యాన్ని అటూ ఇటూ లాగి వీపు గోక్కుంటూ. కొంచెం దూరంగా రామయ్యా కొడుకు కిష్టయ్యా కూర్చొని అక్షరాలు దిద్దుకొంటున్నాడు. పంతులు పేరు వినగానే పలకా బలపమూ లాంతరు దగ్గరే వదిలి లోపలకి పరిగెత్తాడు కిష్టయ్యా.

'చూడు—గ్యాస్ నూనె అయి పోయిందిట...అమ్మగారు ఉదయం పంపమని చెప్పింది—' మెల్లగా అన్నాడు చంద్రయ్యా.

'అట్టాగే పంతులూ పొద్దున్నే పంపుతా... అన్నట్లు పాత ఎకౌంటులో నీ పేర కొద్దిగా మిగిలినట్లు కన్పడుతున్నది'

చంద్రయ్యా గుండె కలుక్కు మన్నది.

'అయినా నీ దగ్గర ఎక్కడికి పోతుందిలే పంతులూ.. ఊరికే పుస్తకం చూస్తుంటే కనపడిందని చెప్పా — అమ్మగారితో పొద్దున్నే పంపుతానని చెప్పు పంతులూ నూనె...' చంద్రయ్యా ఇంటి ముఖం పట్టాడు ఆలోచిస్తూ — ఈ రామయ్యా కూడా పుల్లయ్యతోబాటు తన దగ్గర చదువుకున్న తొలి దినాల విద్యార్థుల్లో ఒకడు—రామయ్యా బడికి రావడానికి మారాము చేసేవాడు. వాళ్లయ్యా నలుగురు మనుషుల్ని బెట్టి మోయించి తెచ్చేవాడు రామయ్యాను బడికి. ఒంటికనో మంచినీళ్లకనో వంకపెట్టి బయటకు పోయేవాడు రామయ్యా—అంతే! అదే పోత ఇంక—అందుకే రామయ్యా కెప్పుడూ గోడకుర్చీలే—మూతి పొగ పెడ్తానని బెదిరించడమే—తన కళ్ల ఎదుట పెరిగి పెద్దవాడైనాడు రామయ్యా. పెళ్లి చేసుకున్నాడు. పిల్లల్ని కన్నాడు. తండ్రి ఇచ్చిన పూరిల్లును పెంకుటిల్లుగా మార్చాడు. గ్యాసు నూనె వ్యాపారం చేసుకుంటూ వున్నాడు శ్రద్ధగా—కాలి కేదో తగిలింది—

తొట్రుపడ్డాడు చంద్రయ్యా — ఏమీ లేదు చీల్చిన తాటిమట్టను ఎవరో దారి కడ్డంగా పడేశారు. మరో నాలుగు అడుగుల్లో ఇంటికి చేరుకున్నాడు చంద్రయ్యా. ఆరుబయటే వున్న మలకమంచంలో కూలబడ్డాడు. అమ్మాయి రాధిక వచ్చి బెత్తమూ, చొక్కా లోపలికి తీసుకు పోయింది. దిండు కావుకొని, మళ్లీ లోనికి వెళ్లిన రాధికను చూచి మళ్లీ అనుకున్నాడు. 'అమ్మాయి కిక వెంటనే పెళ్లి చేయాలి...'

చంద్రయ్యకు తన పెళ్లి గుర్తు కొచ్చింది. తనకు ప్రసూనతో చాలా చిన్న వయస్సులోనే పెళ్లయింది. పెళ్లంటే ఏమిటో కూడా తెలియని వయస్సు కేవలం లడ్డూలు తినడం, పల్లకీలో ఊరేగడం మాత్రం గుర్తున్నాయి. అయినా సరే ప్రసూన వయస్సుతోబాటు వికసిస్తూ తన ఇంటిని పరిమళాలతో నింపి తన జీవితంలో జీవితంగా కలిసి పోయింది. ఎన్నడూ తన కిది కావాలి అది కావాలి అని అడిగి ఎరుగదు. ఒక రోజ కాబోలు అన్నది.

'అబ్బ చంద్రుడు పుచ్చ పువ్వులా వెలుగుతున్నాడేమిటివ్వాళ...' చంద్రయ్యా నవ్వి 'ఔనే—భర్త పేరు చెప్పడం నీ వంటి ప్రతివ్రతల ధర్మం కాదేమో'

ప్రసూన కొంచెం సిగ్గుపడి 'బాగుంది మీ సరసం మరీను. ఇన్నేళ్లు వచ్చినా...ఏమండీ అన్నట్టు మీకో విషయం చెప్పడం మరచిపోయాను సుమా' అన్నది అరటికాయ ముక్కలు నీళ్ల గిన్నెలో పడేస్తూ—

'ఏమిటది' పరధ్యానంగా అన్నాడు దీపం ముందు కూర్చొని ఏదో పుస్తకం పుటలు తిప్పుతూ.

'మా సీతాలత్త లేదూ, అదేనండీ సూరారెడ్డి పాలెం వాళ్లు...'

'ఆఁ – ఆఁ...''

'వాళ్ల పెద్దమ్మాయి గుర్తుందా మీకు— దుర్గ—'

'ఆఁ—'

'దానికి పెళ్లి నిశ్చయమైందట...'

'ఊహూఁ—'

'కట్నాలూ కానుకలూ కూడా నిశ్చయించుకోని తాంబూలాలు పుచ్చుకున్నారట...'

'ఊహూఁ—'

'దానికి సీతాలత్త వాళ్లు చంద్రహారం పెడుతున్నారట... 'చంద్రహారం' అనేసరికి చంద్రయ్యా

తలెత్తి చూచాడు. లోగడ ఎప్పుడో ఒకసారి తనతో ప్రసూన ఒంటరిగా వున్నప్పుడు చంద్రహారంగూర్చి ప్రసక్తి చేసినట్లు జ్ఞాపకం...మళ్లీ ఇవ్వాళ... చంద్రయ్య నిట్టూర్చాడు. ఏదో కృతనిశ్చయానికి వచ్చాడు. తరువాత ఓ రెండు నెలలకు పనిమీద ఒంగోలు పోయినప్పుడు బందరు కంపెనీవారి ఓ గోల్డు కవరింగ్ చంద్రహారంకొని తెచ్చి ప్రసూన కిచ్చాడు. ఇప్పుడంటే కొంచెం చెయ్యి వణికింది తనకు.

'ఎందుకండీ ఇది — ఎవరు తెమ్మన్నారు మిమ్మల్ని? అనిమాత్రం అన్నది ప్రసూన. అంతే! ఇంకేమీ వ్యాఖ్యానించ లేదు. చంద్రయ్య అనుకున్నాడు ఆ రోజున 'కనీసం నా పాప రాధిక పెరిగి పెద్దదయ్యే నాటికన్నా నేను దానికి చంద్రహారం చేయించి ఇవ్వాలి' అని.

రాధిక పెద్ద దయింది - పెళ్లీడుకు వచ్చింది—

కాని తానైతే చంద్రహారం చేయించే స్థితిలో వున్నాడా??......నవ్వుకున్నాడు చంద్రయ్య.

'ఆ రోల్డుగోల్డు యుగపు రోజులే బాగున్నాయి నేటికంటే' అనుకున్నాడు—

'పంతులూ' చంద్రయ్య ఆలోచనా ప్రవాహానికి ఏదో అంతరాయం. చూచాడు —సామిగాడు వచ్చాడు.

'ఏరా సాములూ...'

'పంతులూ—చంటి దెందుకో ఒకటే గిరి కీలు తిరిగి పోతున్నది-కూడు ముట్టడం లేదు...'

'ఊఁ—' అని ఒక్క క్షణం ఆగి 'అమ్మాయ్— ఆ పచ్చ సీసాలో మాత్రలు రెండు కట్టి ఇలా ఇయ్యమ్మా' అని ఓ పొడిదగ్గు దగ్గి 'చూడు సాములూ పొద్దున్నే నేను బడికి పోయే లోపలే చంటిదాన్నొక్క సారి తీసుకురా. చూద్దాము. ఈ రెండు మాత్రలూ రాత్రి కెలాగైనా కడుపులోకి పోయేటట్లు చూడు— ఏమీ భయం లేదులే.'

'ఏమో అంతా నీ దయ పంతులూ' సాములు రెండు చేతులతోనూ మొక్కి మాత్రలు తీసుకొని వెళ్లిపోయాడు.

'అమ్మాయ్— మీ నాన్నగారిని మడి కట్టుకో మని చెప్పు—' ఇంట్లోనుండి ప్రసూన కేక.

ఇవ్వాళెందుకో మంచం మీదినుండి లేవ బుద్ధి పుట్టలేదు—అయినా సరే బలవంతంగా లేచి కూర్చున్నాడు.

మడి కట్టుకొని పీటపై కూర్చొని ఓ అయిదు నిమిషాలు, గొణ గొణ మన్నాడు. పారాయణ పూర్తి కాగానే 'ఆ, వడ్డించు అంటూ' ఏరా చందూ...' అని కేక వేశాడు.

'ఊఁ—' వాకిట్లో మట్టి అరుగుమీద చిరు చాపపై పడుకొని వున్నాడు చందూ...

'రేపు ఒంగోలు పోతా వేమిటి...'

చందూ ఔననలేదు. కాదన లేదు.

ప్రసూన వండిన గోధుమ నూకను పిస్తట్లోకి వడ్డించింది. చంద్రయ్య ఓ రెండు ముద్దలు తిని అన్నాడు. 'ఆ తూర్పుపాలెం శివాలయం దగ్గరే బస్సుదిగు—స్టాండుదాకా వెళ్లకు-'

'ఊఁ-'

'ఒకవేళ రైల్వే గేటువేసివుంటే దిగి నడుచు కుంటూ తూర్పుపాలెం చేరు'—

'ఊఁ—'

'అక్కడ రామకోటిని కలుసుకో — అదేరా, పెద్దరెడ్డి గారబ్బాయి రామకోటయ్య గుర్తులేదూ... నీవు ఒకటో క్లాసులో వున్నప్పుడు 'పంతులుగారూ పంతులుగారూ' అంటూ మనింటికి వస్తూండే వాడు...'

'ఊఁ'

'వాడు మన శిష్యుడే—వెళ్లు...ఏం—'

చందూ ఏమీ అనలేదు—

చంద్రయ్య లేచాడు 'అమృతమస్తు' అంటూ—

'అదేమిటి అంతా అలాగే వదిలేశారు...' అన్నది ప్రసూన ఆదుర్దాగా—

చంద్రయ్య బలహీనంగా నవ్వి దొడ్డి గుమ్మం దగ్గర చెయ్యి కడుక్కున్నాడు. లోటాకిందపెట్టి

మళ్ళీ వాకిట్లోకి వచ్చేసరికి రాధిక తనక్కై పక్కవేసి వుంచింది—చంద్రయ్య మంచంపై చేరగిలి పడ్డాడు. ఆకాశాన్ని చూస్తూ ఒక్కొక్క చుక్కనే లెక్కబెట్టాలని ప్రయత్నిస్తున్నాడు. కాని చూపుకు వెనకటి ఊపూలేక పోవడంతో తానే ఓడిపోయాడు. భోజనాలైనాక ప్రసూనా రాధికా పక్కింటి వాళ్లతో కలిసి గుళ్లో హరికథ వుంటే వెళ్లారు. చందూ నిద్రపోయాడు. ప్రకృతి మొత్తం నిద్రపోతున్నది. ఆకు అల్లల్లాడటం లేదు—కాని నిద్రపోనివాళ్లు ఇద్దరే—ఒకటి సముద్రం—రెండవది చంద్రయ్య—ఆయన కళ్ల ముందు ఏవేవో వర్ణదృశ్యాలు...వీధిలో ఒంటరిగా పడుకున్న కుక్క వకటి కలలో మొరిగినట్లు మొరుగుతున్నది — గుడిలోనుండి హరికథా కీర్తనం—దూరాన ఎక్కడో పల్లెనాళ్ల కేక—'హో—హ్హో హో'...

చంద్రయ్యకు మగత నిద్ర పట్టినట్లనిపించింది...

గలగలా మనుషుల శబ్దం...'ఎవరూ...'

'మేము గుడినుండీ వస్తున్నాము—పడుకోండి' ప్రసూన కంఠం—'ఎంతైందే టైము?'

'ఆ, ఒంటిగంట కావొస్తున్నదండీ ... నంచి నీళ్లు ఇమ్మంటారేమిటి?...'

'అక్కర్లేదులే—' చంద్రయ్య ఇటువైపుకు పొర్లి పడుకున్నాడు మళ్ళీ—అయితే ఇక నిద్ర పట్టలేదు.

చంద్రయ్య మనస్సు ఎందుకో వేదాంతం వైపుకు తిరిగింది—

మనుష్యుడు గొప్పవాడని అంటారు—కాని అతని శక్తులన్నీ పరిమితాలే కదా! ఆకలిని జయించలేడు దప్పికను జయించలేడు. నిద్ర అతని జీవితంలో సగ భాగం మింగివేస్తున్నది. ఇక మృత్యువు సరే సరి—మానవుడు మృత్యుంజయుడు కాగలడా?? ఎలా?? ఎప్పుడు?? ఆలోచన ఇక ముగియలేదు—

'కొక్కొరొక్కో' తొలి కోడి కూసింది.

దూరంగా జాలరి వాళ్ల శబ్దం—

ప్రభాత పవనాలు మొగలిపొదల మీదినుండీ వస్తున్నాయి. తమలపాకులతోటల మీదుగా వేగు చుక్క మెరుస్తున్నది. 'ఏరా—చందూ—లే' కేక వేశాడు చంద్రయ్య. రెండు మూడుసార్లు పిలిస్తేనే కాని చందూ లేవలేదు—చాలా అయిష్టంగా లేచి కళ్లు నులుముకుంటూ అలాగే పక్కపై కూర్చున్నాడు 'లే—లే—ఫస్టు బస్సువేళ అవుతున్నది—' చంద్రయ్య నులకమంచం మీద పడుకొనే కేక పెట్టాడు.

చందూ లేచి కాలకృత్యాలు నిర్వహించుకొని గుడ్డలు వేసుకున్నాడు—ప్రసూనమ్మ లేచి దీపంబుడ్డి ఇంకొంచెం పెద్దది చేసి పాత భోషాణంనుండీ తీసిన పాలగిన్నెను పరీక్షించి చూచింది. ఆలస్యంగా తోడు వేయడం వల్లనేమో బాగా తోడుకోలేదు పాలు—వెయ్యనా? వద్దా? అని సంశయిస్తూ రాత్రి వండిన అన్నమూ, గోధుమ రవ్వతో చేసిన పిండీ రెండూ పెట్టింది కంచంలో...

'అమ్మా ఆవకాయి వెయ్యి—' ప్రసూనమ్మ జాడీలోంచి ఓ గరిటెలోకి ఆవకాయ తీసి ఓ బద్ద వేసి శనగగింజలతోవున్న కాస్త కారంవేసి నూనె పంచింది—

చందూ మాట్లాడకుండా తింటున్నాడు.

రాధిక తల్లి దగ్గరికి వచ్చింది నిద్రలేచి. 'అన్నయ్య అప్పుడే అన్నం తింటున్నాడే...' అంటూ కాళ్లు జాపుకొని కూర్చుందొక పీటమీద— 'ఒంగోలు నుంచి ఏం తెస్తావురా అన్నయ్యా'.

చందూ తలపైకెత్తి ఓ సారిచూచి మళ్లీ తలవంచుకొని ఆవకాయ కడి మరొకటి నోట్లో పెట్టుకొని 'ఆఁ—మజ్జిగ పొయ్యి' అన్నాడు—

ప్రసూనమ్మ తోడుకొని తోడుకొనకుండావున్న పాలను పోసింది కంచంలో. ఉప్పుడు రవ్వను అందులో పిసుక్కొని గడగడ తాగేశాడు చందూ.—

'పాం—పపాం—' కారుహారన్—చంద్రయ్య మంచంమీదినుండి లేచి 'అదుగో ఫస్టు బస్సు హారన్ ఇస్తున్నది వెళ్లు త్వరగా ... చందూ గబగబాలేచి చెయ్యి కడుక్కొని తల్లి కాళ్లకు దణ్ణంపెట్టి సంచీ చేతబట్టుకొని పరుగెత్తాడు బస్సువైపు—వీధిలో దాకా వచ్చారు ప్రసూనా, రాధికా—చందూ గుడివైపుగా బస్సుదిగివున్న చెట్టువైపుకు మలుపు తిరిగాడు.

అరిటాకులూ, ఊచా. గెలలూ, పెరుగు దుత్తలూ రైతులు బస్సు దగ్గరకి చేరవేస్తున్నారు—

చంద్రయ్య దూరంగా ఆకుతోటల వైపుకు

నడక సాగించాడు. నక్షత్రాలు వెలుగును కోల్పో తున్నాయి క్రమంగా...

మళ్లీ సూర్యోదయం—

చంద్రయ్య పంతులు బెత్తంతో పాఠశాలకు వెళ్లడం. అటెండెన్సు రిజిష్టరు—చాక్‌పీసు—డస్టరు—పిల్లల అరుపులు—ఏడుపులు—సాడీలు చెప్పుకోవడాలు—బెత్తానికి పని కల్పించడం—నిన్న రానివాణ్ణి గోడ కుర్చీ వేయించడం— అంతా మామూలే—

కాని చంద్రయ్య హృదయం మాత్రం మామూ లుగా లేదు—

పొద్దు తిరుగుడు పువ్వులా సూర్యుని వెంట తిరుగుతున్నది. సాయంత్రమైంది—

చంద్రయ్య పంతులు బెత్తంతో బయట పడ్డాడు. సింహాసనం వైపుకు నడిచాడు—

చేతోత్త రాతిని సిద్ధంచేసి వేపచెట్టు కింద కూర్చున్నాడు.

'పంతులూ ఇయిగో—' శేషు కొబ్బరినీళ్లు ఇచ్చాడు—

సుబ్బమ్మ ముద్ద పులిబొంగరాలు పోస్తున్నది...

చంద్రయ్య, కళ్లజోడు ముక్కు కొనకు లాగి దూరంనుంచి వస్తున్న వ్యక్తిని చూస్తూ అన్నాడు 'ఎవరూ...'

'నేనే' చందూ ముక్తసరిగా జవాబు చెప్పి ఇంటివైపు సాగిపోతున్నాడు.

చంద్రయ్య రోజుకన్నా పెందలాడే తన సింహా సనం మీదినుండి లేచాడు. ఇంటి ముఖం పట్టాడు. గుమ్మంలోకి వెళ్లక ముందే ప్రసూనమ్మతో చందూ చెపుతున్న మాటలు వినిపిస్తున్నాయి 'అంతా మన వాళ్లే—మన బంధువులే—మన శిష్యులే — ఆ రామ కోటయ్య దగ్గరికి పోతే సరిగా పలకరించనే లేదు సరి కదా 'ప్రతి వాళ్లకూ ఈ రికమండేషన్లు మెండైనాయి ఈ రోజుల్లో' అని పక్కనే చీట్లాటకు కూర్చున్న స్నేహితుడితో అంటున్నాడు—శిష్యుట్ట— శిష్యుడు—నాన్న దగ్గర ఈయన నేర్చుకున్న చదువు ఇదే కాబోలు—'

చంద్రయ్య మాట్లాడకుండా నులకమంచంపై కూలబడ్డాడు. రాధిక తండ్రిని చూచి గబగబా వచ్చి దిండు తలకింద పెట్టబోయింది—'మంచినీళ్లు తెస్తా ముందు నాన్నా...'

'చూడు రాధా! చందూ చేత ఓ గ్లాసు నీళ్ళు పంపు...'

అయోమయంగా చూచింది రాధిక—

జల పక్షులు తిరిగి వేపచెట్లపైకి చేరు తున్నాయి—

సూర్యుని రథం పడమటి కొండల్లో దిగి పోయింది .

చీకటి సన్నగా చంద్రయ్య ఆవేదనలా దిక్కు లన్నీ వ్యాపిస్తున్నది—చంద్రయ్య ఆకాశం వైపుకు చూచాడు—

చంద్రహారంలో వెలిగే ముత్యాల పంక్తిలా బారు కట్టిపోతున్న కొంగలు—

చంద్రయ్య, కొడుకు ఉద్యోగస్తుడన్నమాట వినాలని ఎదురుచూచా డింత వరకూ...కాని అదింకా రేపటి దూరంలో వుంది—వర్తమానానికీ, ఆ దూరా నికీ మధ్య ఒక చీకటి రాత్రి...

'ఏమండీ ఇవ్వాళ పిండి వండమంటారా... లేక—' ప్రసూనమ్మ వాకిట్లోకి వచ్చి భర్త స్థితి చూచి కొయ్యబారి పోయింది. జ్ఞానదాత సూర్యుణ్ణి మింగివేశానన్న అహంకారంతో అవిద్యారూపమైన చీకటి అలా తెల్లవార్లూ కుండపోతగా కురిస్తూనేవుంది—

*　　*　　*

కాల ప్రవాహంలో అయిదేళ్లు గడిచాయి.

దేశంలోని మరొక పంచవర్ష ప్రణాళిక ఫలి తంగా అనేకమైన మార్పులూ చేర్పులూ జరిగాయి—

అయితే కొత్తపట్నం మాత్రం వాల్డెన్ వద్ద కూర్చున్న థోరోలాగా సబర్మతిలోని గాంధీ లాగా నవ నాగరికతకు దూరంగానే వుండిపోయింది—

అదే సూర్యోదయం—నీటి దారువుల్లో అవే కమలాలు తమలపాకుల తోటల నానుకున్న మొగలి పొదలనుండి అవే సువాసనలు—

జాలరివాళ్లు గంగమ్మతల్లికి వందనం చేసి అలాగే కొయ్య తెప్పలను నీళ్లల్లోకి నెట్టడం...

ప్రసూనమ్మ కూతురికి పెళ్లిచేసి పంపివేసింది—

ఇంటి కొక కోడలిని తెచ్చుకుంది—

సుబ్బమ్మ స్థానం శేషు ఆక్రమించాడు.

మహాలక్ష్మి కొడుక్కు పట్నంలో కేంద్ర ప్రభుత్వపు ఉద్యోగమొస్తే గుడ్డ లుతకడం మానేసి బస్తీ పోయింది...

ఇంతకు మించి చెప్పకోదగ్గ మార్పు లేవీ జరగ లేదు వూళ్లో...

మామూలుగానే ఆనాడు కూడా సాయంకాలం క్రమంగా రాత్రి కిందికి పరిణామం చెందుతున్నది.

బెత్తం చేత్తో పట్టుకొని చాక్‌పీసు అంటిన చేతిని తుడుచుకుంటూ చందూ తండ్రిగారి సింహాసనం వైపుకు నడిచాడు—

బెత్తాన్ని చెట్టు మొదటికి ఆనించి రాతిని చేత్తో తుడిచాడు. చేతి చాక్‌పీసు దాని కంటుకున్నది—

కొలిమి తిత్తుల్లా పగలంతా పని చేసిన ఊపిరి తిత్తుల నిండా తమలపాకు తోటలనుండీ వచ్చే గాలిని నింపుకుంటూ తల పైకెత్తి దిగంతాల లోకి చూచాడు—

దూరంగా, ఎత్తుగా, శిథిలమైన లైటు హవుస్—

'పంతులూ ఇయిగో నీళ్లు' శేషు చందూకు కొబ్బరినీళ్లు అందించాడు—

'శేషూ ఓ అణా ముద్దపులిబొంగరాలు కూడా పట్రా'—

దూరంగా రెడ్డి గారింట్లో బ్యాటరీతో పని జేసే ట్రాన్సిస్టరు రైతులు వాడవలసిన ఎరువులను గూర్చి ప్రసంగిస్తున్నది...

అరిటాకు కట్టలతో ఇంటి ముఖం పట్టిన రైతులు.

దుమ్ము రేపుకుంటూ ఆవూరి బస్సు నైటు హాల్టుకై గంగరావి చెట్టు కిందికి చేరింది—

సర్వే తోటల్లో మిణుగురులు.

ఊళ్లో మిణుగురుల వంటి దీపాలు.

చందూ మనస్సులో గాలిలోని దీపాల వంటి ఏవో ఆశలు.

బెత్తం చేత బుచ్చుకొని ఊపుకుంటూ ఇంటి ముఖం పట్టాడు. కాలికి తాటిమట్ట తగిలింది—ఒక్క తన్ను తన్నాడు—

'కోడలు పిల్లకు ఒంట్లో నలతగా వున్నట్టుంది పిన్నీ' సరస్వతమ్మ గొంతు—

'అవును—' ప్రసూనమ్మ కంఠం. చందూ పోల్చుకున్నాడు.

గుడిలో కథా కాలక్షేపానికై వెళ్తున్నట్లున్నారు.

'ఏమన్నా విశేషమా?...'

'అనే అనుకుంటున్నాను—'

సరస్వతమ్మ తృప్తిగా నవ్వింది 'అయితే మళ్లీ మా చంద్రన్నయ్యగారు రాబోతున్నారన్న మాట...'

చందూ అలాగే నిలబడి పోయాడు క్షణం! తన కీ విషయం తెలియదే. సావిత్రి మాటమాత్రమైనా అనలేదు...చకచకా ఇంటి వైపుకు నడిచాడు.

సావిత్రి దీపంబుడ్డి దగ్గర కూర్చొని ఏదో పుస్తకం పుటలు తిప్పుతున్నది. 'ఏమండీ— ఈ సినిమా బొమ్మల పుస్తకం చూడండి. మాస పత్రికలు. రెడ్డిగారి అమ్మాయి ఒంగోలునుండి వస్తూ తెచ్చింది—'

'ఊఁ—' నులకమంచంపై కూలబడ్డాడు.

'అబ్బ ఎంత బాగున్నాయో బొమ్మలు—ఇవి చూస్తే వెళ్లి ఈ సినిమాలన్నీ చూచి రావాలని బుద్ధి పుడుతున్నదండీ.'

'ఊఁ—'

'ఇదిగో ఈ సినీ తార మెళ్లో వున్న చంద్రహార మొకసారి చూడండీ—పళ్లు పులిసి పోతున్నాయి చూస్తుంటే—ఏమండోయ్ ఈ బొమ్మ నొకసారి చూడండి మీరు.'

గాలికి బలహీనంకా చెట్టుకొమ్మలు కదిలాయి—'ఏమి టలా ఆలోచిస్తున్నారు?'

'అబ్బే ఏమీ లేదే—'

'ఈ బొమ్మ చూడరూ అయితే—'

'చూచాను సావిత్రీ ఇంతకుముందే—అది క్యాలెండరు కింద రిలీజ్ చేశారు కూడా—రేపు ఒంగోలు పోయేవా ళ్లెవరైనావుంటే ఫాన్సీ షాపునుంచి ఆ కాలెండరు తెప్పించి నీ కిస్తాలే—'

తంత్రములు - శ్రీ విద్య

శ్రీ దోర్బల విశ్వనాథ శర్మ

"తను విస్తారే" అను విస్తారార్థక తను ధాతువు నుండి వ్యుత్పన్నమైన తంత్రశబ్దమునకు 'విస్తరింపఁబడినది' అను అర్థము ఏర్పడును. ఈ యర్థము యౌగికము. 'రహస్యములైన యుపాసనాదు లను బోధించునది' అను అర్థము నేడు రూఢమై యున్నది. కాని ప్రాచీన కాలమున ఈ శబ్దము శాస్త్రశబ్దమునకు పర్యాయముగా నుపయోగింపఁబడి నట్లు కనఁబడుచున్నది. పాణినీయం 'తంత్రమ్' అన్న ప్రయోగమున వ్యాకరణ శాస్త్రము తంత్రముగా వ్యవహరింపఁబడినది. మీమాంసా శాస్త్ర సిద్ధాంతములను బోధించునొక గ్రంథమునకు 'తంత్ర సిద్ధాంత రత్నావళి' యని పేరు గలదు. ఇదిగాక రహస్యములైన యెత్తుగడలు కుట్రలు మొదలగు నర్థములలో కూడ తంత్ర శబ్దముపయోగింపఁ బడినది. నేడును ఉపయోగింపఁబడు చున్నది. ఇట్లీ శబ్దము బహ్వర్థకమైనను ప్రస్తుతము 'రహస్యోపాసనాదులను బోధించు శాస్త్రము' అను అర్థము నందే ఈ తంత్ర శబ్దముపయోగింపఁబడు చున్నది.

అవైదికములైన యుపాసనాప్రక్రియల బోధించు శాస్త్రములే తంత్రములు అనునొక యభిప్రాయము నేడు కొందఱిలో వ్యాపించి యున్నది. ఈ యభిప్రాయమున కనుగుణములైన వాక్యములు కొన్ని తంత్రగ్రంథములందు కలవు. క్రియాసార మను — వీరశైవ తంత్రగ్రంథమందు తాంత్రికి వైదికి అని విద్య ద్వివిధముగా విభజింపఁబడినది. ఈ విభాగము తాంత్రికవిద్య వేదవిద్యకు విలక్షణమని సూచించుచున్నది. అవైదికము లగుటచే తంత్రములు అప్రమాణములు అని కొందఱనగా అవైదికము లైనను ప్రమాణములే అని మఱికొందఱందురు.

వేదమునకు ప్రామాణ్యము స్వతస్సిద్ధము. వేదము అపౌరుషేయము కనుక భ్రమాది దోష దూరమగుటచే వేదప్రామాణ్యము శంకనీయము కాదు అని కొందఱి తాత్పర్యము.

వేదమునకు ప్రామాణ్యము స్వతస్సిద్ధము కాదు. భ్రమప్రమాదములు లేని యథార్థవక్తయగు పరమేశ్వరునిచే చెప్పఁబడినందువనే వేదమునకు ప్రామాణ్యము సిద్ధము అని మఱికొందఱి తాత్పర్యము. వీరి ననుసరించినచో వేదముతోపాటు తంత్రములకును ప్రామాణ్యము నంగీకరింపవలసియే యుండును. పెక్కుతంత్రములలో నవి పరమేశ్వరోక్తములుగానే వర్ణింపఁబడియుండుటచే తంత్రప్రామాణ్యము నిరాకరించుటకు కారణము కనఁబడదు.

వేద ప్రామాణ్యము స్వతస్సిద్ధమని యంగీకరించినను తంత్రములు వేదానుకూల విషయములనే యధికముగా బోధించుటచే వేదమూలకములనియు అందుచేత ప్రమాణములనియు చెప్పుట కాక్షేపమేమియు కనఁబడదు.

కావుననే వేదములతోపాటు తంత్రములును ఆగమములని పేర్కొనఁబడినవి. వేదప్రామాణ్యము నంగీకరించని జైనులు ఆగమ ప్రామాణ్యము నంగీకరించినారు. వీరికి ప్రమాణములైన ఆగమములు వేదములు కావని వేరుగా చెప్పనక్కఱ లేదు. అవి జైనాగమములనుట స్పష్టమే గదా!

ఇదిగాక రహస్యములైన యుపాసనాదులు కొన్ని వేదములలోనే నిరూపింపఁబడియుండుటచే తంత్ర విద్య వేద విలక్షణ మనుటయు అనుపపన్నమే. వ్యాకరణాది శాస్త్రములు వేదమూలకములగుటచే ప్రమాణములైనట్లే తంత్ర గ్రంథములును వేద

మూలకములగుటచేతనే ప్రమాణములని కొందరు తంత్రవేత్తలు భావించెదరు. వేదమూలకములు కాని జైనాది తంత్రములు వేదవిరుద్ధములు అప్రమాణములును. అట్లే వేదవిరుద్ధములైన రహస్యోపాసనాదులను వివరించు క్షుద్రతంత్రములును అప్రమాణములు—అని వీరి యభిప్రాయమై యున్నది. ఇంతే గాక వీరు తమ తంత్రగ్రంథములలోని విషయము ల్లో వేదమూలకములని ఆయా విషయములకు మూలములుగా కొన్ని వేదమంత్రములను పేర్కొని వానిని తత్ప్రతిపాదకములుగానే వ్యాఖ్యానించినారు. ఇట్టివారిలో ప్రధానముగా పేర్కొనదగినవారు ప్రత్యభిజ్ఞా శైవ తంత్రజ్ఞ చూడామణి పరమమాహేశ్వరుడును నైన అభినవగుప్తుడు శాక్తేయ తంత్రజ్ఞ శేఖరుడైన భట్టభాస్కరుడును.

కర్మ ప్రాధాన్యమును బోధించు జైమిన్యాదులను కొన్ని అంశములలో వ్యతిరేకించినను పెక్కు తంత్రములు ఉపనిషత్ప్రతిపాదితమైన అద్వైతమునందు పర్యవసించునవి గాను ఉపాసనా ప్రధానములైనవి గాను మనకు తోచును.

ఉపాస్యదైవముయొక్క నామరూప భేదము ననుసరించి పెక్కుతంత్రములు విస్తరించినవి. వానిలో చాలావఱకు నామావశిష్టములు. ఉన్నవానిలో వైఖానస పాంచరాత్రాది వైష్ణవ తంత్రములు ప్రత్యభిజ్ఞా పాశుపతాది శైవతంత్రములు కౌలాది శాక్త తంత్రములు ముఖ్యములు. శాక్తతంత్ర శేఖరమైన శ్రీ విద్యా తంత్రమునుగూర్చి వివరించుటకు పూర్వము పరిచయము కొఱకు కొన్ని తంత్ర గ్రంథముల పేర్కొనెదను.

1. తంత్రాభిధానము (ఇదియొక తాంత్రిక నిఘంటు గ్రంథము. దీనిలో బీజనిఘంటువు ముద్రా నిఘంటువు. అను రెండు నిఘంటువులు ముద్రింపఁబడినవి.)

2. శ్రీ చక్ర సంభారము (ఇదియొక వజ్రయాన బౌద్ధ తంత్రగ్రంథము)

3. షట్చక్ర నిరూపణము (దీనిని పూర్ణానందస్వామి రచించినాడు. దీనికి శంకరుడొక వ్యాఖ్య రచించినాడు.)

4. పాదుకా పంచకము (కాళీచరణుని వ్యాఖ్యతో కైవల్య కాళికా తంత్రముయొక్క రెండవ పటలమునకు గల విశ్వనాథుని టీకలోని కొన్నియంశములతోడను ముద్రింపఁబడినది.)

5. ప్రపంచసార తంత్రము (తారానాథ విద్యారత్న సంపాదితము)

6. కుల చూడామణి నిగమము (గిరీశ చంద్ర వేదాంత తీర్థ సంపాదితమై అక్షయకుమార మైత్రోపోద్ఘాత సమేతమై యున్నది.)

7. కులార్ణవ తంత్రము (తారానాథ విద్యారత్న సంపాదితము)

8. కాళీ విలాస తంత్రము (పార్వతీచరణ తర్కతీర్థ సంపాదితము)

9. తంత్రరాజము (దీనికి కాదిమతమను మఱొక పేరు గలదు.)

10. కామకలా విలాసము (పుణ్యానందస్వామి రచితమైన కాశ్మీర సాంప్రదాయిక తంత్రమునకు సంబంధించిన గ్రంథము.)

11. కౌలోపనిషత్తు ఇతర ఉపనిషత్తులు (ఈ గ్రంథమందు భట్టభాస్కర వ్యాఖ్యానము కొన్నిటికి లక్ష్మీధరటీక కొన్నిటికిని ముద్రింపఁబడినది. సుందరీశ్వర తాతపాద శిష్యుఁడైన అప్పయ దీక్షితాచార్యుని భాష్యముకూడ కొన్నిటికి కలదు. దీని సంపాదకుడు సీతారామశాస్త్రి.)

12. కర్పూరాది స్తోత్రము (విమలానంద స్వామి ఉపోద్ఘాతముతో 'ఆర్థర్ అవలన్' అను తంత్రశాస్త్రజ్ఞుడైన పాశ్చాత్య విద్వాంసుని అనువాదముతోడను కూడియున్నది.)

ఈ పన్నెండు గ్రంథములకు 'ఆర్థర్ అవలన్' అను పాశ్చాత్య విద్వాంసుని విమర్శనాత్మకోపోద్ఘాతము లున్నవి. ఈ అర్థర్ అవలన్ మరికొన్ని తంత్ర గ్రంథముల ననువదించినాడు. మరికొన్ని తంత్ర గ్రంథములను స్వయముగా రచించినాడు. అనువాదములలో మహానిర్వాణతంత్రముయొక్క అనువాదమైన 'తంత్ర ఆఫ్ ది లిబరేషన్' అను గ్రంథము షట్చక్ర నిరూ

పణముయొక్క అనువాదమైన 'ది సర్పెంట్ పవర్' అను గ్రంథమును ముఖ్యములు.

ఇతడు మహిమ్న స్తవమును 'ది గ్రేట్‌నెస్ ఆఫ్ శివ' అను పేరుతో ఆనందలహరిని 'ది వేవ్ ఆఫ్ బ్లిస్' అను పేరుతో అనువదించినాడు. 'శక్తి అండ్ శక్త' అను గ్రంథమందు కౌల సిద్ధాంతములు క్రియాకలాపములు వివరించినాడు.

'క్రియేషన్' అను గ్రంథమునందు తంత్ర సిద్ధాంతానుసారముగా సృష్టియెట్లు జరుగునో వివరించినాడు. 'ప్రిన్స్‌పుల్స్ ఆఫ్ తంత్ర' అను గ్రంథమందు తంత్ర తత్త్వము వివరింపఁబడినది. (ఇది రెండు సంపుటములుగా ముద్రితము) 'గార్‌లండ్ ఆఫ్ లెటర్స్' అను పేరుతో ఒక మంత్రశాస్త్ర గ్రంథమును రచించినాడు. తన కుమారుడైన 'ఎలెన్'తో కలసి 'హిమ్స్ టు ది గాడెస్' అనుపేరున తంత్రగ్రంథములలోని కొన్ని శ్లోకములకు శంకరాచార్య రచిత శ్లోకములకును అనువాదము చేసినాడు. ఈ గ్రంథములన్నియు కలకత్తాలోని ఆగమానుసాధన సమితి వారిచే ముద్రింపఁబడినవి.

త్రివేంద్రమందలి ప్రభుత్వ ముద్రాలయమందు ముద్రింపబడిన అనంతశయన గ్రంథావళిలో ఆరు తంత్ర గ్రంథములు కానవచ్చుచున్నవి.

1. తంత్ర సముచ్చయము (నారాయణ రచితము శంకరుని విమర్శన వ్యాఖ్యతో మొదటి ఆరు పటలములు ఒక సంపుటముగా ఏడవ పటలము మొదలు పన్నెండవ పటలము వఱకు రెండవ సంపుటముగా ముద్రింపఁబడినవి.)

2. ఈశాన శివగురుదేవ పద్ధతి (ఇది ఈశాన శివగురుదేవ మిశ్ర రచితము. ఇది నాల్గు సంపుటములుగా ముద్రింపఁబడినది. సామాన్య పాదము మొదటి సంపుటమున మంత్ర పాదము రెండవ సంపుటమున క్రియా పాదములోని మొదటి ముప్పది పటలములు మూడవ సంపుటమున ముప్పది యొకటవ పటలము మొదలు అరువది నాలుగు పటలము వఱకు నాల్గవ సంపుటమున ముద్రింపబడినవి. యోగ పాదము కూడ నాల్గవ సంపుటముననే ముద్రింప బడినది.)

3. విష్ణు సంహిత.

4. వైఖానసాగమము (మరీచి రచితము.)

5. తత్త్వ ప్రకాశము (భోజదేవ విరచితము. దీనికి శ్రీకుమారుని తాత్పర్య దీపికా వ్యాఖ్యానము కూడ ముద్రింపఁబడినది.)

6. మహానయ ప్రకాశము (అభినవగుప్త విరచితము) మహానయ ప్రకాశ రచయితయగు అభినవ గుప్తుడు సర్వతంత్ర స్వతంత్రుడు. ఆనంద వర్ధనుని ధ్వన్యాలోకమునకు లోచనమను పేర గొప్ప వ్యాఖ్యానమును భరతుని నాట్యశాస్త్రమునకు అభినవ భారతి అనుగొప్ప వ్యాఖ్యానమును రచించి సాహిత్య శాస్త్ర భాష్యకారుడుగా ప్రసిద్ధినందినాడు. ప్రత్యభిజ్ఞా శైవ సిద్ధాంత మహాగ్రంథమగు తంత్రాలోకమును రచించి పరమ మాహేశ్వరుడుగా ప్రసిద్ధినందినాడు. శాక్తేయ తంత్రములలో విలక్షణమైన మహానయ తంత్రమును మహానయ ప్రకాశమను గ్రంథమున వివరించి శాక్తేయ తంత్రములలో విలక్షణమైన తంత్రమునకు ప్రకాశకుడైనాడు. మహానయ తంత్రమునకు మహార్ధచక్రకమ సంప్రదాయమనియు నామాంతరము కలదు. మహానయ ప్రకాశమును రచించుచు అభినవగుప్తుడు మొదట అపట టంకమయ ప్రతిష్ఠాదేవికి నమస్కరించి మంగళాచరణ మొనర్చినాడు. ప్రథమోల్లాసమున సర్వైలక్ష్యమును ద్వితీయోల్లాసమున పీఠ స్వరూపమును తృతీయోల్లాసమున వ్యోమేశ్వరీ చక్రమును చతుర్థోల్లాసమున ప్రకాశచక్రమును పంచమోల్లాసమున ఆనందచక్రమును షష్ఠోల్లాసమున మూర్తి చక్రమును సప్తమోల్లాసమున బృంద చక్రమును అష్టమోల్లాసమున సృష్ట్యాది చక్రమును (సృష్టిస్థితి సంహార చక్రమును) నవమోల్లాసమున అనాఖ్య చక్రమును త్రయోదశి యను పేరుగల ఏకదేవత యొక్క స్వరూపమును నిరూపించినాడు. నవమోల్లాసమున తత్త్వ తత్త్వములను భావాత్మకముగ భావించుట జీవన్ముక్తియని వర్ణింపబడినట్లు అనుకొనుట కవకాశము కలదు. ప్రమాతృ ప్రమాణ ప్రమేయ త్రిపుటి నతిక్రమించుట చెప్పఁబడుటచే

నద్వైతమునందు పర్యవసించు తంత్ర మీ మహా నయ తంత్రమని భావింప నగును. ద్వైతాద్వైత విశిష్టా ద్వైతములలో మనకు పరిచితమైన పరిభాష యిందు గానరాదు. తర్కముకూడ మిక్కిలి అపరి చితముగా నున్నది. భాష సులభమైనను అతి గంభీర మగుటచేత తంత్రజ్ఞులు కాని వారికి అత్యంత దుర్గ్రాహ్యముగా నున్నది. ఈ పేరుగల తంత్ర మొకటి కాశ్మీర ప్రాంతమున విస్తరించి యుండెనను నొక విషయమును మాత్రము గ్రహించి ప్రస్తుత మునకు తృప్తిపడవలసి యున్నది. ఇంతకును ఈ గ్రంథము అసంపూర్ణము.

శాక్తేయ తంత్రానుసారులు ఆచార భేదము ననుసరించి వామాచారులు దక్షిణాచారులు అని రెండు తెగలుగా నున్నారు. భైరవ కౌలాది తంత్ర గ్రంథ ములు పరశురామ దుర్వాసో దత్తాత్రేయాదులచే రచింపఁబడిన కులార్ణవాది గ్రంథములును వామా చారులకు ప్రమాణ గ్రంథములు. వీరు కాళీ శ్యామలా వారాహీ ఛిన్నమస్తా ధూమవతీ ప్రేత వారాహీ చండీ తారా ప్రభృతి శక్తుల నారాధించెదరు. వీరిలో కొందఱు పరశురామ సూత్ర ప్రకారము తొమ్మిది మొదలుకొని పదునైదు వఱకు పాత్రములను పూజా స్థానమున ఆసాదించెదరు. వామహస్తముతో తర్పణా దులను చేయుదురు. సురా మాంసాదికమును నివే దించెదరు. దేవియొక్క వామహస్తమునందు పూజను సమర్పించెదరు. ప్రత్యక్ష యోని పూజ లేక తదా కృతి పూజ నొనరించెదరు. స్వాధిష్ఠాన కమలమందే బిందు స్థానమును భావించి అచటనే లయమును భావించుట వీరి అంతర్యాగ పద్ధతి. వామాచారుల గురు పరం పరలో శ్రీనాథుడు భైరవుడు గణపతి మొదలగువారు కలరు.

శుద్ధ మొదలు అనుత్తర వఱకు గల ముప్పది రెండు దీక్షలతో దీక్షితుడగువ వానికే దేవి యను గ్రహము కలుగునని యీ ముప్పది రెండు వామాచార దీక్షలను భట్ట భాస్కరులు పేర్కొనినారు. వీనిలో కొన్ని దక్షిణాచార దీక్షలలో కూడ కానవచ్చుట చేత ఈ దీక్షలు కేవల కౌల వామాచార దీక్షలు కావని వీనిలో కొన్ని దక్షిణాచార దీక్షలు కలసిపోయినవని గుర్తింపవలసి యున్నది. యజ్ఞ యాగాదులలో పశు హవనము దోషము కానట్లు పూజాంగ మద్య మాంసాది సేవనము దోషము కాదని వీరి ఆశయము.

మద్య మాంసాదులను దక్షిణాచారు లుపయో గింపరు. అందువలన వీరి యారాధనము సాత్త్విక మనఁ బడును. వింధ్యకు దక్షిణమున గల ప్రాంతముల వారిలో నీ సాత్త్వికమైన శక్తిపూజ ప్రచురముగా నున్నది. అందువలన వీరి ఆచారము దక్షిణా చారమనఁబడి యుండవచ్చును. కాని ప్రస్తుతమీ దక్షిణాచార శబ్దమందలి దక్షిణ శబ్దము దిక్సం బంధిగా కానరాదు. వింధ్యకు దక్షిణమునను మద్య మాంసాది యుక్త తామసోపాసకులుండనే యున్నారు. అదిగాక వింధ్యకు నుత్తరమున ప్రచురముగాగల కౌలాచారమునకు ఉత్తరాచారమని పేరు రాలేదు. కాని దక్షిణ శబ్దప్రతి ద్వంద్వియైన వామశబ్దముచే నా యాచారము విశేషింపఁబడుచున్నది.

దక్షిణ దేశమున వామాచారులున్నట్లే యుత్తర దేశమున దక్షిణాచారులును గలరు.

దక్షిణాచార గురుపరంపరలో శివుడు నారా యణుడు బ్రహ్మ వసిష్ఠుడు సనకస నందనాదులు గలరు.

ఈ దక్షిణాచార సంప్రదాయ ప్రవర్తకుడు దక్షిణామూర్తి కామేశ్వరీ కామేశ్వరుల యభిన్నమైన దేవతామూర్తి యుపాస్యము. వైదికమంత్రములు కల్పోక్త శ్లోకములు పూజా సమయమం దా యా యుపచారములను సమర్పించునప్పుడు పఠింపబడును. దక్షిణ హస్తముతోడనే పూజ చేయఁబడును. క్షీరాది పానీయములు ఫలాది భక్ష్యములు నివేదింపఁబడును.

దక్షిణాచారమున పదునారు మంత్ర దీక్షలు గలవు.

'శుద్ధా బాలాచ మాతంగీ
గురుర్గణపతి స్తథా
సౌభాగ్య విద్యా వారాహీ
తిరస్కరణికా తథా
లోపాముద్రా తురీయాచ
ప్రాసాదా సహ షోడశీ
శ్రీ పరా షోడశీ చైవ
శ్రీ మహాపాదుకా తథా'

అను పదునారు మంత్ర దీక్షలలో దీక్షితుడయినవాడే శ్రీదేవి యనుగ్రహమును పొందగలుగును. క్షత్రియాదులు మద్యమాంసాదుల నివేదించినను అది దక్షిణాచారమే కాని బ్రాహ్మణు లట్లు పూజించుట మాత్రము వామాచారమే అనియు కొందఱభిప్రాయ పడుట గలదు.

శ్రీ రామకృష్ణ పరమహంస ఈ వామ దక్షిణోభయ మార్గములలో దేవి నారాధించినారని చెప్పికొనుట కలదు.

శాక్తేయ తంత్ర విద్యాప్రబోధ ముపనిషత్తుల వలననే ప్రథమముగా కలిగినదని తద్విద్యావేత్తల నిర్ణయము. శాక్తేయ తంత్ర విద్యా ప్రబోధకములైన యుపనిషత్తులలోనే ఈ వామ దక్షిణాచార మార్గద్వయ ప్రామాణ్యము గోచరించును. వానిలో కౌలోపనిషత్తు కౌలమార్గమునకు చెందినదని యా పేరే చెప్పుచున్నది. ఉభయాచారులకును ముఖ్య ప్రమాణ మగు త్రిపురోపనిషత్తులో

పరిస్రుతం ఝష మాజం పలంచ
భక్తాని యోనీస్సు పరిష్కృతాని
నివేదయన్ దేవతాయై మహత్యై
స్వాత్మీ కృత్య సుకృతీ సిద్ధమేతి

(పరిస్రుత మనగా సుర ఝష మనగా చేప ఆజం పలం అనగా మేక మాంసము భక్తాని అనగా సెనగలు పెసలు మొదలగు పప్పులతో కలిపి వండిన పులగము పులిహోర మొదలగు చిత్ర విచిత్రాన్నములు యోనీః అను పదము బ్రాహ్మణ క్షత్రియాది జాతులను సూచించును. తాత్పర్య మేమనగా అన్ని జాతుల వారును పైన చెప్పబడిన పదార్థముల మహాదేవతకౌఱకు నివేదించి సిద్ధిని పొందెదరు) అను మంత్రము పరిస్రుత ఝషాజ పలములు నివేద నీయములని చెప్పుచున్నది. కాని దక్షిణాచార పరాయణులు పరిస్రుత మనగా జ్ఞానమని ఝష మనగా జీవ భావమని ఆజపల మనగా మూలప్రకృతి దానికి సంబంధించిన ఇంద్రియ సముదాయము అని అర్థములు చెప్పి వీనిని నివేదించి సిద్ధిని పొందెదరు అను విధముగా నీ మంత్రమును వ్యాఖ్యానించెదరు.

పరమ ప్రామాణిక శాక్త తంత్రజ్ఞుడును పరశ్శత తంత్ర గ్రంథకర్తయును నగు భట్టభాస్కరుడు మాత్ర మీ మంత్రమును పంచమకార సమర్పణ పరముగానే వ్యాఖ్యానించెను. కౌలోపనిషత్తులోని 'ధర్మ విరుద్ధాః కార్యాః' అను సూత్రమును వ్యాఖ్యానించుచు సురాపానాదులు కౌలాచార పూర్ణాంగములుగా విహితములనియే చెప్పెను.

సూత్రాత్మకమైన కౌలోపనిషత్తు రహస్యమైన ఈ ధర్మమును మరింత రహస్యముగా స్థూల దృష్టికి భ్రామకముగా బోధించుచున్నది. మధ్య మధ్య ఉపక్రమ విరుద్ధార్థ స్ఫూర్తిని కలిగించు వాక్యము లుండుటచే భ్రాంతి కవకాశము కలుగుచున్నది.

కౌలోపనిషత్తు

అథాతో ధర్మ జిజ్ఞాసా. జ్ఞానం బుద్ధిశ్చ జ్ఞానం మోక్షైక కారణమ్. మోక్షస్సర్వాత్మతా సిద్ధిః పంచ విషయాః ప్రపంచః. తేషాం జ్ఞాన స్వరూపాం.

అధర్మ కారణా జ్ఞాన మేవ జ్ఞానమ్. ప్రపంచ ఈశ్వరః. అనిత్యం నిత్యం. అజ్ఞానం జ్ఞానమ్. అధర్మ ఏవ ధర్మః. ఏష మోక్షః. పంచ బంధా జ్ఞాన స్వరూపాః. పిండా జ్జననమ్. తత్రైవ మోక్షః.

ఏత జ్జ్ఞానమ్. సర్వేంద్రియాణాం నయనం ప్రధానమ్. ధర్మ విరుద్ధాః కార్యాః. ధర్మవిహితా న కార్యాః. సర్వం శాంభవీ రూపమ్.

ఆమ్నాయా న విద్యంతే. గురు రేకః. వ్యైక్యతా బుద్ధిమంతే. ఆ మంత్ర సిద్ధేః. మదాదిస్త్యాజః.

ప్రాకట్యం నకుర్యాత్. నకుర్యాత్ పశు సంభాషణమ్. అన్యాయో న్యాయః. నగణయేత్క మపి. ఆత్మ రహస్యం నవదేత్. శిష్యాయ వదేత్. అంతః శాక్తః. బహిః శైవః. లోకే వైష్ణవః. అయ మేవా చారః. ఆత్మజ్ఞానా న్మోక్షః. లోకా న్న నింద్యాత్.ఇత్యధ్యాత్మమ్. వ్రతం న చరేత్. నతిష్ఠేన్నియ మేన. నియమాన్న మోక్షః కౌల ప్రతిష్ఠాం న కుర్యాత్ సర్వసమోభవేత్ సముక్తోభవేత్.


అధర్మ మనగా ధర్మరహితమైన బ్రహ్మము ధర్మ మనగా శక్తి జ్ఞాన మనగా మిథ్యా జ్ఞానము అని గ్రహించి సమన్వయము చేసికొనవలెను. ఇట్లే అన్యాయోన్యాయః అన్నపుడు తర్క మూలములైన న్యాయా న్యాయముల వ్యవస్థ అసంపూర్ణ మైనందున సర్వమును సహింపవలెనని బోధించు వాక్యముగా సమన్వయించుకొనవలెను. ఆమ్నాయా నవిద్యంతే అను వాక్యమునకు సర్వా పరోక్ష బ్రహ్మమును బోధించుటకు వేదములు ప్రవర్తింపఁ జాలవని యర్థము గ్రహింపవలెను. ధర్మ విరుద్ధాః కార్యాః అనగా దేవ నివేదిత మద్యాది సేవనము చేయదగిన దని ధర్మ విహితా న కార్యాః అనగా ఉపాసకుడు వేద విహిత ధర్మ రూపములైన జ్యోతిష్టోమాది యజ్ఞములను చేయరాదని గ్రహింపవలెను.

ఇట్లు కౌలోపనిషత్తు వామాచారమును బోధించుమనే యుపాసకుని యుత్తమ లక్షణములను గూడ బోధించుచున్నది. ఇట్లు తంత్ర విషయములను గూఢముగా బోధించు పద్ధతి ఉపనిషత్తునందే యారంభింప బడినది. అనధికారులు సామాన్య ధర్మ పరిజ్ఞా మాత్రము గలవారు ఇందు ప్రవేశింపకుండ నుండవలె ననుటయే ఇట్లు బోధించుటలోని రహస్యము.

అథర్వణ వేదీయ సౌభాగ్య కాండమునకు చెందిన త్రిపురోపనిషత్తు భావనోపనిషత్తు యజుర్వేదమునకు చెందిన అరుణోప నిషత్తును శాక్తేయోపాసనా ప్రతీకలలో అతి ప్రసిద్ధమైన శ్రీ చక్రమును వర్ణించుచున్నవి. శ్రీ చక్రము ఉపాస్యమైన పరదేవతయొక్క అర్చారూపమునకు బ్రహ్మాండాత్మక రూపమునకు మంత్రమునకు ఉపాసకుని పిండాండమునకు గురు స్వరూపమునకును సంకేత రూపమై యున్నది. ఈ క్రింది శ్లోకమున సంగ్రహముగా శ్రీ చక్ర ముద్ధరింపఁ బడుచున్నది.

బిందు త్రికోణ వసుకోణ దశార యుగ్మ
మన్వస్ర నాగదళ షోడశ పద్మ యుక్తమ్
వృత్తత్రయంచ ధరణీ సదన త్రయంచ
శ్రీ చక్రరాజ ఉదితః పర దేవతాయాః.

శ్రీ చక్రమందలి తొమ్మిది చక్రము లిందు పేర్కొనబడినవి. అవరోహణ క్రమమున వాని పేర్లివి. 1. బిందుచక్రము 2 త్రికోణ చక్రము 3. అష్టకోణ చక్రము 4. దశార చక్రము 5. షోడశార చక్రము 6. మన్వస్ర చక్రము 7. అష్టదళ చక్రము 8. షోడశ దళ చక్రము 9. భూగృహ చక్రము. (సశేషము)



కల్లుడి శాసనము - ఒక విమర్శ

1972 అక్టోబరు భారతిలో శ్రీ కె. సుబ్బరామప్ప గారి ద్వారా గౌరిబిదనూరు జూనియరు కళాశాల చరిత్రోపన్యాసకులగు శ్రీ ఆర్. వి. రామారావుగారు మరియు ఉపాధ్యాయులగు శ్రీ బి. కె. మాధవ మూర్తిగారు 'కల్లుడి శిలా శాసనము'ను ప్రకటించినారు. శాసనచ్ఛాయ అత్యంత స్పష్టముగానుండి పాఠకులు మాతృకను సైతము అత్యల్ప శ్రమతో చదువుకొనుటకు వీలగు చున్నది. ముందు ముందు కొన్ని 'వీరగల్లుల'ను కూడ ప్రకటిస్తామని అన్నారు. చాల ముదావహము.

కాని సాధారణముగ భారతిలో ప్రకటించబడు చున్న శాసనములవలె శాసన పాఠమును సంపూర్ణముగ ప్రకటించుచు వివరణ సేయనందువలన పాఠకులకు కొన్ని సందేహము లేర్పడుటకు అవకాశమున్నది. వాటి గురించియైనను ఇకముందు వారు ప్రకటించబోవు శాసనములను సవివరంగా ప్రకటిస్తారని తలుస్తాము.

ఇక ఈ శాసనమును వివరించుచు '1938 లో విజయనగర చక్రవర్తి అయిన బుక్కరాయలు సింగయ భట్టు అనే హైడ్రాలిక్ (నీటిపారుదల) ఇంజనీయర్ను పిలిపించి కల్లుడినుండి రాతికాలువ మూలాన పెనుగొండ దగ్గరి సిరివెర చెరువునకు పెన్నానదినుండి నీటిని మళ్లించే యేర్పాటు చేసినాడట' అన్నారు.

కాని చరిత్ర పుటలు తిరుగవేస్తే క్రీ. శ. 1338 లో విద్యానగరమును పరిపాలించిన రాజు హరిహర రాయలు. అతడు క్రీ. శ. 1336 నుండి 1355 వరకు 20 సంవత్సరములు రాజ్యపాలన చేసి మరణించి నట్లు తెలియుచున్నది. అతని తరువాత అతని తమ్ముడగు మొదటి బుక్కరాయలు క్రీ. శ. 1355 నుండి 1377 వరకు విద్యానగర పరిపాలకుడుగా నున్నట్లు తెలియుచున్నది.

ఇక ఈ శాసనమందు 'పూర్వ పశ్చిమ సముద్ర దిక్పతి రాజాధి రాజ రాజ పరమేశ్వర వీర హరి హర రాయకుమార శ్రీ ప్రతాప బుక్కరాయరు' అని ఉన్నది. అందువలన ఈ శాసనమును ప్రకటించిన బుక్కరాయలు మొదటి హరిహర రాయల తమ్ముడగు బుక్కరాయలు కాక రెండవ హరిహరుని పుత్రుడగు బుక్కరాయలనియే స్పష్టమగుచున్నది. పోనీ మొదటి బుక్కరాయలు తాను స్వతంత్రముగా కాక రాజప్రతినిధిగా ఉన్నప్పుడు వేయించిన శాసనమందామా అంటే 'హరిహర రాయ కుమార' అన్న పదం తికమక పెట్టుతున్నది. లేదు కుమార బుక్కరాయలని చెప్ప యత్నిస్తే 'శ్రీకారం' తగాదాకు కారణమగుచున్నది.

ఇంకను మొదటి హరిహర రాయలు 'పూర్వ పశ్చిమ సముద్రాధీశ్వర మహామండలేశ్వర' అన్న బిరుదములు ధరించినాడే కాని రాజాధి రాజ రాజ పరమేశ్వర అను బిరుదము ధరించలేదు. ఈ బిరుదు ధరించిన వాడు రెండవ హరి[1]హరి రాయలే కాని మొదటి హరిహరుడు కాదు.

ఇక సంవత్సర నిర్ణయమునకై వారు దేని నాధారముగా చేసికొనిరో తెలియదు. కాని శాసనమున మాత్రము 1311 అని స్పష్టముగా నున్నది.

ఇందువలన తేలిన దేమన కల్లుడి శాసనమును వేయించిన వాడు మొదటి బుక్కరాయలు కాక రెండవ హరి హరుని కుమారుడగు రెండవ బుక్కరాయలనియే తేలుచున్నది. ఇతడు తండ్రియగు రెండవ హరిరాయలు విద్యానగర మేలుచున్నప్పుడు తాతయగు మొదటి బుక్కరాయల వలె పెనుగొండ గుత్తి దుర్గములకు రాజ ప్రతినిధిగా ఉండి యుండును. ఆ సమయముననే ఇతడు శాసనము వేయించి యుండును. అత్యంత విరళములైన ఇతని శాసనములలో ఇది యొకటి. ఇది రెండవ బుక్కరాయలు కూడా పెనుగొండ గుత్తి దుర్గములకు రాజ ప్రతినిధిగా నుండెనను నూతన చారిత్రక విషయమును తెలియజేయు చున్నందున అత్యంత ప్రధానమైనది.

ఈ శాసనము శకవర్షములు 1311 (అనగా క్రీ. శ. 1389 వ సంవత్సరమున) ఆశ్వయుజ బహుళ దశమి గురువారమునాడు వేయబడినది.

---

1. Forgotten Empire By Seewel.

పూర్వ పశ్చిమ సముద్ర దిక్పతియు రాజాధిరాజ రాజ పరమేశ్వర బిరుదాంచితుడైన రెండవ హరి హర రాయల కుమారుడగు శ్రీ వీరప్రతాప (రెండవ) బుక్కరాయలు పెనుగొండ గుత్తి దుర్గముల పాలించుచు పెనుగొండ నీటి యెద్దడికి గురియగు చుండుటచే తన ప్రజ లందరు సుఖముగా నుండుటకు పెన్నా నదినుండి కాలువ వేయదలచి సింగయ భట్టును వానిని పిలిపించి కాలువను త్రవ్వించి శాసనమును వేయించెను.

ఇది మొత్తము 28 పంక్తులు గల శాసనము. కాని 20 ది పంక్తులు మాత్రమే స్పష్టముగా గుర్తింప వీలగు చున్నది. చివరి పంక్తులు స్పష్టముగా కనిపించనందు వలన శాసన పాఠము సరిగా నిర్ణయించ వీలు కలుగ కున్నది.

విశేషములు:—ఇందు శాసన సమయము శక 1311 అని వ్రాయబడుచు విభవ నామ సంవత్సరము పేర్కొనబడినది. అది కూడ అంత స్పష్టముగా లేదు 'విభళ' అన్నట్లు వ్రాయబడినది. ఇది విభవ నామ సంవత్సరమునకు దగ్గరగా ఉన్నందున అట్లే నిశ్చయించితిమి. కాని 1311 వ సంవత్సరము పంచాంగ రీత్యా శుక్లనామ సంవత్సర మగుచున్నది. సాధారణముగ పూర్వకాల శాసనము లన్నియు సంవత్సర నామముల దగ్గర పొరపాట్లతో కన్పడుచున్నవి. పూర్వమే అని ఎందులకు మొన్న కూడ మన ప్రభుత్వము వారిరు షేర్వాసురి జ్ఞాపకార్థం విడుదల చేయించిన తపాలా బిళ్లలో 16 వ శతాబ్దికి బదులు 15 వ శతాబ్ది అని వేసినారట. ఇట్లే లేఖక ప్రమాదము లెన్నియో కన్పడుచున్నవి. కొన్నిచోట్ల అక్షరములే మ్రింగి వేయ బడినవి.

ఇక ఆనాటి కాలములో కాలువలు నిర్మించు వానిని 'జలసూత్ర' అని పిలిచేవార. లిపి ప్రాచీన శాసనముల వలెనే వత్తులకే దీర్ఘము లివ్వబడినవి. ఆధి 'వ్వది' 'విద్య' చక్రవర్తి—వలపలగిలక '✓' అనియే కన్పడుచున్నది. అంతమాత్రమేగాక పూర్వ హల్ ద్విత్వ మింకను కన్పడుచునే యున్నది.

లేఖనాదు లెట్లున్నను ఈ శాసనము రెండవ బుక్కరాయలు పెనుగొండ గుత్తి దుర్గములను రాజ ప్రతినిధిగా పరిపాలించుచు ప్రజల క్షేమమును కాంక్షించి వారికి యుపయోగమగునటు పెన్నానది నీటిని కాలువ ద్వారా సిరివూరు చెరువుకు మళ్లించి నట్లు తెలుపు చున్నది. ఇట్లితడు తన తమ్ముడగు దేవరాయలకు తుంగభద్రానదిని విజయనగరమునకు మళ్లించుటకు ఆదర్శభూతమైనట్లు తోచుచున్నది.

శా స న పా ఠ ము

శ్రీ ఆయు రారోగ్య దాతారం
భవ వయిద్యం జగద్గురుం ఆధి వ్యాధి
హరం (చం)ద్ర పరాశక్తి యుతం శి
వం—స్వస్తి శ్రీ శక (వ)రు(ష)ధ 1131 నెయద
విభ(వ) సంవత్సరద ఆస్వయుజ బ॥ 10 గు
రు వారదలు పూర్వ పశ్చిమ సముద్ర దిక్ప
తి రాజాధి రాజ రాజ పరమేస్వర విర
హరి హర రాయ కువార శ్రీ ప్రలాప బుక్క
రాయరు పెనుగుండె దొడ నోడిలి గుతి
క రాజ్యం గెయుత్తలు ఎళ్లా ప్రజెగళూ సు(ఖ)
బదులి ఇరబె కాగి జివంగ నిగితా ఉదక
నె ప్రాణ హోగి పెనుకొండగె వాంనయున ధియ
నూ తరబె కందు శ్రీ విరప్రతాప బుక రా
య బాపడి ఒ—గి దశ విద్యా చక్రవర్తి జల
సూత్రద సింగాయు భట్టరగె విరూప(క్ష) విద్యా
...ఆ సింగయు భట్టను ఆ కాలువెయు వా పం
...నూ ప్రతాప బుక్కరాయు మండ లెడి కాలువె
యాగి మాడిసి శాసాన వనూ బరసి దను॥
యావం—రుద్దరాయ ప్రద్యావ చ్చంద్రి సమం
డల ప్రతాప బుక యా పాల తావ ప్రదాజా—మః
.........త్ర స్వర భాస్తి రసవేద్య ప
స్య......రూ రుద్రయు సంగరి—వ—
......కావారు బాపతె—కు॥ బెతా
(భ) ప్ర(భు) రుద్రాయు నమః యస్య శతహ...
...ద్యస వారిగ సిందు—క్టుజొ పముద్ర
ద్రిపాంత స్పితా యార్జ—నమః॥
...శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ.

శ్రీ ఎస్. ఎల్. నరసింహాచార్య,
శ్రీ ఎమ్. రామచంద్రరావు.

2. ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 1–11–72 పేజి నం. 15.

3. విజయనగర చరిత్రము (ఎన్. పేరరాజు) పేజి నం. 38.

గ్రంథవిమర్శలు

శృంగార శేఖర భాణః
అభినవ కాలిదాస విరచితః

(సంపాదకులు : డా. బి. రామరాజు, ప్రకాశకులు : ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడెమీ, కళాభవనము, సైఫాబాదు, హైదరాబాదు—4—డెమీ $\frac{1}{8}$ పే. 64 లు వెల రు. 1—50 లు.)

ఆం. ప్ర. సాహిత్య అకాడెమీ సంస్కృత భాషకు ప్రత్యేకముగా కమిటీని ఏర్పరచి వారి సూచనల ప్రకారము ఆంధ్రులు రచించిన సంస్కృత గ్రంథములను, ఆంధ్ర ప్రబంధ శతకాదులకు సంస్కృతీకరణములను విశాల లోకమునకు అందజేయు చున్నది. ఆంధ్ర భాషకు సంస్కృతభాషతో కల అవినాభావ సంబంధమును బట్టి ఈ విభాగ మెంతయు సంభావ్యమే. అభినవ కాలిదాస బిరుదాంకితుడగు ఈ భాణ కర్త వెల్లాల ఉమామహేశ్వర కవి యని సంపాదకులు ఆంధ్రాంగ్ల పీఠికలలో నిర్ధారించినారు. మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములో ఉన్న ఒక్క ప్రాతప్రతిని అనుసరించి దీనిని పరిష్కరించి ప్రచురించినారు.

పీఠికలలో ఆంధ్రులు రచించిన భాణముల నెన్నిటినో పేర్కొని, అభినవ కాలిదాస బిరుదాంకితులను కొందరిని గూర్చి ప్రస్తావించి, ఈ భాణకర్త భాగవత చంపూ ప్రబంధాదులు రచించిన కవి యని పేరు నిర్ధారణ చేసి సంపాదకులు కాలనిర్ణయము కూడ చేసినారు.

వారు పీఠికలలో పేర్కొనిన భాణములే కాక మా యింటనే (1) శ్రీ రంగాచార్య కృత పంచబాణ విజయ భాణము (1887) (2) శ్రీ వరదాచార్య కృత వసంతతిలక భాణము (1872) (3) ఈచంబాడి శ్రీనివాసాచార్య కృత శృంగార తరంగిణీ భాణము (1883) అచ్చు ప్రతు లున్నవి. ఈ ముగ్గురును ఆంధ్రులనియే తోచును.

దశ విధ రూపకములలో భాణము ఏకాంకిక; శృంగార వీరములలో నొకటి ప్రధాన రసముగా ఉండవలెనని లక్షణము. కాని మనకు అందుబాటులో ఉన్న భాణము లన్నియు శృంగార రస ప్రధానములే కాని వీర ప్రధానమైనవి కానవచ్చుటలేదు. ఈ శృంగారము కూడ మితిమీరి నేటి పాఠకులకు జుగుప్స కలిగించునదిగా ఉండుట సర్వసాధారణము. ఈ భాణమును అందుకు అపవాదము కాదు, చిత్రముగా ఈ భాణ కర్తలు తరుచుగా వ్యాకరణము, తర్కము, మీమాంస, వేదాంతము ఇత్యాది శాస్త్రములలో ఉద్దండ పండితులుగా కానవచ్చుచున్నారు. అందును గత శతాబ్దములో పుట్టినన్ని భాణములు అంతకు పూర్వము పుట్టినట్లు లేదు.

భాణము ఏకాంకికయే కాక ఏక పాత్ర ప్రయోగము కూడ కలది. ఐనా రంగప్రవేశము చేయని పాత్రల చర్యలు మాటలు ప్రస్తావింప బడును. ఈ కనబడని పాత్రల స్వరాదుల కనుగుణముగా రంగము మీద ఉన్న ఆ ఒక్క పాత్రయే కంఠ స్వరాదులు మార్చి కంఠస్వరములు ధ్వనులు ప్రదర్శింపవలసి ఉండును. ఖడ్గ యుద్ధాలు, పొట్టేళ్ల పోరులు, కోళ్ల పందెములు, జార ధర్మాసనములు వర్ణింప బడును. ఆయా సందర్భాలలో ఆయా శబ్దాలను పాత్ర అనుకరించి ప్రదర్శింపవలె. ఇతరుల కంఠాలను వివిధ శబ్దాలను అనుకరించి వినోదము కలిగించేవారు నే డెందరో కలరు. అట్టివారే భాణములో రంగములో ప్రవేశించే ఏకపాత్రధారులు! అందువల్ల భాణ రచన సంపాదకు లన్నట్లు శ్రవ్య కావ్యానికి దగ్గరగా ఉన్నట్లు కనిపించే మాట నిజమే. కాని ప్రయోగములో మాత్రము ఆ ఒక్క పాత్రయే అద్భుతమైన నాటకీయతతో,

కష్టసాధ్యమైన ధ్వన్యనుకరణములు చేసి అసాధారణ వినోదము కలిగించును. భాణములలో గల ఈ విశిష్ట గుణము సంపాదకులు ప్రస్తావించినచో బాగుండెడిది.

పీఠికలో సంపాదకులు 'కందర్ప సంభవ భాణము' రేచర్ల సింగభూపాల రచితముగా పేర్కొనిరి. ఆ భాణము లభించ లేదు. దానిని తన రచనయే యని 'చమత్కార చంద్రిక'లో విశ్వేశ్వర కవియు, 'రసార్ణవ సుధాకరము'లో సర్వజ్ఞ సింగభూపాలుడును పేర్కొన్నారు. రసార్ణవ సుధాకరము కూడ సర్వజ్ఞుని గురువును ఆస్థానకవియు నగు విశ్వేశ్వర కవియే రచించె నను వివాదమునకు కారణమైనది ఈ సందర్భమే. అందువలన ఆ భాణకర్త సర్వజ్ఞ సింగభూపాలుడో, విశ్వేశ్వర కవియో అని ఉదాహరించి యుండుట న్యాయ సమ్మతము.

ఈ భాణము కవితాస్థాయిని గూర్చి పీఠికలో సంపాదకు లిట్లనిరి: 'ఈ భాణంలో ప్రథమ శ్రేణికి చెందిన ప్రతిభావిలసనం తక్కువైనా, కవితాధారకూ, శృంగార వర్ణనలకూ, చమత్కారాలకూ లోటు లేదు. సాంప్రదాయికమైన కవి సమయాలను అనువుగా ఉపయోగించుకొనడంలో కవి చక్కని ప్రావీణ్యాన్ని ప్రదర్శించినాడు.' సంపాదకుల వచనములు సర్వథా సత్య సమ్మతములు. కవి రచనకు మచ్చుగా కొద్ది వచనమూ మూడు శ్లోకాలూ; ప్రస్తావనలో ప్రేక్షక సమాజమును గూర్చి సూత్రధారుడు:

'అధీ తరతి తన్త్రాణా మనఙ్గ
బ్రహ్మ వాదినామ్
సోఽయం విదగ్ధ మిత్రాణాం
సమాజ స్సముపస్థితః'

నాయకుడు, దారిలో చన్దనలత మాత రమ్మని లోనికి పిలువగా పోక, అనుచున్న మాటలూ శ్లోకమూ (పే. 11)

'కి మాత్థ? అన్తర్ణ ప్రవిశ్యతే భావేనేతి! సఖి, సామ్ప్రత ముత్పల మాలాయా దర్పణ పరిణయ నోత్సవార్థం గమ్యతే! శ్వః సమాగన్తాఽస్మి! ఇయ మాశీః॥'

'స్తనశాలి సుతాయు స్తే తరఙ్గిత
రతిక్రియస్సు
అస్తు మన్మథ సర్వస్వ మఖణ్డిత
మిదం వయం॥'

భరత వాక్యము కూడ కాముకుల ఆశయాలకు అనుగుణముగానే ఉన్నది.

'అనితర రసాధీనం భూయా
దనఙ్గపదం పదం
హృదయ మసకృ చ్ఛృఙ్గా
రాద్వైత శృఙ్ఖలితం నృణామ్
శశధర కలాపీడం శ్యామామయం
కరుణామయం
శమయతు పునర్జన్మ క్లేశం
మమాపి పరం మహః॥'

మొదటి పాదము చివరనున్న రెండుసార్లు వచ్చిన 'పదం పదం'లలో ఒకటి 'పరం' అని ఉండవలెనేమో అని మాకు తోచినది.

గ్రంథ పరిష్కరణము సంపాదకులు మొత్తము మీద చక్కగానే నిర్వర్తించి నారు.

ఆంధ్రులు చేసిన ఉత్తమ సంస్కృత రచనలు విశాల ప్రపంచానికి అందజేసే సాహిత్య అకాడెమీ ప్రయత్నము సర్వవిధముల శ్లాఘ్యమే. కాని ఇట్టివి కాక ప్రథమ శ్రేణి కవితా విలాసనము కల ఆంధ్రుల సంస్కృత రచనలు వెలికి తీసి దీనివలె దేవనాగర లిపిలో చక్కగా ముద్రించి ప్రకటింప బూనుకొనుట అకాడెమీ గౌరవమునకు ఎక్కువ అనుగుణముగా నుండు ననియు యుక్తతరమనియు సూచించు చున్నాము.

శ్రీ నోరి నరసింహ శాస్త్రి.

Lectures on Indian Philosophy (Introductory)

(రచన: శ్రీ కె. భాస్కరరావు. వెల: రు. 2-50 లు. ప్రతులకు—కామేశ్వరీ గ్రంథమాల,

18—2—47—కామేశ్వరీ కాలనీ, గాంధీ నగర్—తిరుపతి.)

మచిలీపట్నంలో స్నేహమంజరి ఆధ్వర్యాన జరిగిన సభలలో భారతీయ తత్వశాస్త్రం గురించి తిరుపతిలోని వెంకటేశ్వర ఓరియంటల్ కాలేజీ లెక్చరరు శ్రీ కె. భాస్కరరావు ఎం. ఏ. ఇచ్చిన ఆరు వుపన్యాసాల సంగ్రథనం ఇది. ఉపన్యాసాలు ఆంగ్ల భాషలో వున్నాయి, విపులమైన నోట్సు, రిఫరెన్సులతో, ప్రధానములయిన భారతీయ తాత్వికాలోచనలను పరిచయం చేయడం ఈ వుపన్యాసాల వుద్దేశం.

అలా చేయాలంటే ముందు వుండవలసింది, చారిత్రక దృక్పథం. అది లేనప్పుడు భారతీయ తత్వశాస్త్రాన్ని పరిణామ గతి క్రమదృష్టితో చూడలేరు. 'అన్నీ వేదాల్లోనే వున్నాయి. వేదాల్ని కాదనే వాళ్ళూ, ఔననేవాళ్ళూ తమ తెలివితేటల్ని ప్రదర్శించుకొనేందుకు తెచ్చిన వాద వైవిధ్యం మన దర్శనాలకూ, తాత్వికాలోచనలకూ మూలం' — అని వ్రాయాలి. రచయిత ఈ చిన్న పుస్తకంలో చేసిన పని అదే.

మానవుడు అనంత జిజ్ఞాసువు. పరిణామ క్రమంలో తాను వున్న ప్రతి దశా, వేసిన ప్రతి అడుగూ అతని ఆలోచనలను రెచ్చగొడుతూనే వుంది. ఎప్పటి కప్పుడు తనకు అందినంతలో సమాధానాలు చెప్పుకొంటూనే వున్నాడు. ఆ క్రమంలో భౌతిక వాద భావాలూ, విశ్వాస వాద భావాలూ చిలవలూ పలవలూ వేశాయి. ఒకప్పు డొక దానికీ, వేరొకప్పుడు రెండో దానికీ ప్రాధాన్యం ఏర్పడుతూ జిజ్ఞాసా, సమన్వయం అనంతంగా సాగుతూనే వున్నాయి.

ఈ స్థితిని అర్థం చేసుకొని పరిశీలించడం తత్వశాస్త్రబోధకులు చేయవలసిన పని.

భాస్కరరావుగారు అనుసరించినది ఈ మార్గం కాదని ప్రథమంలోనే తేలిపోయింది. అనూచానంగా వస్తున్న అలవాటుకొద్దీ భారతీయ తత్వశాస్త్రాలను నాస్తిక, ఆస్తిక భేదంతో వర్గీకరించారనుకొన్నా, నాస్తిక వర్గాన్ని దుష్టంగా జమ కట్టడంలో ఔచిత్యం కనబడదు. '' ంచి అర్థం చేసుకోడానికి చెడ్డను ముందు తెలుసుకోవడం న్యాయం'—అని సమర్థించుకొంటూ చార్వాక, జైన, బౌద్ధమతాలను వారు ఒక గుంటు పెట్టేరు.

వీరిలో చార్వాకుల వాదాలంటూ, ఒక శ్లోకాన్ని రిఫరెన్సు నోట్సులోనూ, ఒక వాక్యం, ఒక శ్లోకం ఉపన్యాసం లోనూ వుదాహరించేరు.

అగ్ని రుష్ణో జలం శీతం
సమ స్పర్శ స్తథా నిలః
కే నేదం చిత్రితం తస్మాత్
స్వభావాత్త ద్వ్యవస్థితః॥

మాధవారణ్యులు తమ సర్వ దర్శన సార సంగ్రహంలో చార్వాకుల స్వభావ వాదాన్ని తెలిపేందుకు వుదాహరించేరు దీనిని.

(నిప్పు వేడి. నీరు చల్లన. గాలి సమశీతోష్ణం. వాటినల్లా ఎవరు చేసేరు. అల్లాగే వుండడం వాని స్వభావం.)

అతిప్రాథమికమైన జీవిత స్థితిని తెలుపుతున్నాయి, ఇందులో ఇచ్చిన వుదాహరణలు. అందుచేతనే ఆ ఆలోచనలలో కూడ మెలికలు లేవు. భౌతిక వాదంలో అతిప్రాథమిక దశను ఇది తెలుపుతూంది.

తరవాత దేవుని అస్తిత్వాన్నీ, వేదాల ప్రామాణ్యాన్నీ చార్వాకులు నిరాకరిస్తారంటూ భాస్కరరావు గారు ఈ వాక్యాల నుదాహరించేరు.

'మోసగాళ్ళూ, వంచకులూ, పిశాచులూ సృష్టించేరు మూడు వేదాల్నీ. తమ బ్రతుకు తెరువు కోసం బ్రాహ్మణులు ఈ యజ్ఞ యాగాలు కల్పించేరు. ఈ లోకంలో చేసే హోమాలూ, తర్పణలూ స్వర్గంలో వున్న వాళ్లకి అందే మాటుంటే, ఇళ్ల కప్పుల మీద వుండేవారికీ ముడతాయి. బలి ఇచ్చిన మేక స్వర్గానికి వెళ్తేటట్లయితే యాజకుని తండ్రినే ఎందుకు బలి ఇవ్వకూడదు?' (పుట 7)

నిజంచేత జిజ్ఞాసువు వెయ్యవలసిన ప్రశ్న.

అయితే—చూసేసరికి మనకొకటి అర్థం అవుతుంది. మొదటి శ్లోక కాలం నాటిది కాదీ ప్రశ్న. మూఢ విశ్వాసాల అవహేళన, కర్మకాండల నిరాకరణ, ప్రతారకుల నింద—ఈ మధ్యకాలంలో సంఘంలో వచ్చిన ఆలోచనల్ని చూపుతున్నాయి. ఇదింకో దశను తెలుపుతూంది.

అల్లాగే వారుదహరించిన మరో శ్లోకం.

యావజ్జీవం సుఖం జీవేత్
ఋణం కృత్వా ఘృతం పిబేత్।
భస్మీభూతస్య దేహస్య
పునరాగమనం కుతః॥

వున్నంతకాలం సుఖంగా బ్రతుకు. ఋణం చేసైనా చెయ్యిమునగా నెయ్యి వేసుకు తిను. చచ్చి, శరీరం తగలపెట్టేక మళ్లీ రావడం వుంటుందా?

ఆర్థిక రంగంలో ఋణం వచ్చిన సమాజం అది. ఆలోచనలలోకి కర్మసిద్ధాంతం, పునర్జన్మ వాదన వచ్చేయి. వాటిని అవహేళన చెయ్యడం కనిపిస్తుందిక్కడ. ఇది పై రెంటికీ చాలదూరంలో వున్న స్థితి.

దీనిని పట్టి భౌతికవాద ధోరణీ, విశ్వాసవాద ధోరణీ సమాజగతితోపాటు పక్కపక్కనేనో, వెనకముందులు గానో వస్తున్నవేగాని, అన్యంకాదు. దీనిని చార్వాకుల అభిప్రాయాలలో వెదుగునుగా చూడ్డం ఎల్లాగో, భాస్కరరావు గారే చెప్పాలి.

అలాగే జైనమతం విషయంలోకూడా. అహింస, సూనృతం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహ—రూపమైన సమ్యక్చరిత్ర మోక్షమార్గమనిచెప్పి, దానిని కఠోరంగా అనుసరిస్తారు జైనులు. గాంధీ మహాత్ముడు మనదేశరాజకీయ జీవితంలోకి సత్యాహింస, బ్రహ్మచర్యాదుల్ని ప్రవేశపెట్టింది, ఈ మత ప్రభావంవల్లనే.

బహుశా, భాస్కరరావు గారు వీనిని అకార్య కరణాలుగా భావిస్తారనుకోను.

బౌద్ధమతం గురించి వ్రాస్తూ, బుద్ధుడు స్త్రీ—పురుష సమానత్వాన్ని అంగీకరించడంవలన బౌద్ధవిహారాలు లంజ దిబ్బలయాయన్నారు. అది వ్యతిరేకుల ప్రచారం కావచ్చు. ఒక దశలో నిజమూ అవునేమో. బుద్ధుడు చూసినది ఒక సామాజిక దృష్టి. ఋణగ్రస్తులూ, సైనికులూ శ్రమణకులుగా చేరి రాజదండననుంచి తప్పించుకోడం, దానివలన ఇబ్బందులు కలిగి బుద్ధుడే సన్యాసం ఇచ్చేముందు కొన్ని విధులు నిబంధించడం జరిగింది. ఇవన్నీ సామాజిక సమస్యలు. వీనికీ బౌద్ధదర్శనానికి వున్న సంబంధాలు ఆలోచించాలి. పుక్కిటి పురాణ కథలను నమ్ముతూ రావణుడు వైకుంఠంలో ద్వారపాలక వుద్యోగంలో త్వరగా చేరిపోవాలనే తహతహ సీతాపహర్తలోని మంచినిగా వర్ణించగలవారు ఆ విధమైన ఆలోచన చేయడం కష్టం. (6 వ పుట)

ద్వైత మతం గురించి వ్రాస్తూ, 'ప్రభువును ఎరక్కుండా కొలవడం ఎల్లా సాధ్యం?'—అని ప్రశ్నించే వారికి ద్వైతమతాచార్యులు చాల "excellant" గా సమాధానం ఇచ్చేరని భాస్కరరావుగారు నోట్సులో ఒక శ్లోకం ఇచ్చేరు.

తస్మిన్ ప్రసన్నే కిమిహాస్త్య లభ్యం
ధర్మార్థకామై రల మల్పకాస్తే!
సమాశ్రితా ద్బ్రహ్మతరో రనంతాత్
నిస్సంశయం ముక్తిఫలం ప్రయాంతి॥

(ఆయన ప్రసన్నుడైతే అలభ్యం ఏం వుంది? ధర్మార్థకామాలు వ్యర్థం. అవి అత్యల్పాలు. బ్రహ్మ పదార్థవృక్షాన్ని అంటిపెట్టుకువుంటే మనిషికి ముక్తి లభిస్తుంది.)

బాగానే వుంది. విశ్వాసం గలవారికి బాగానే వుండొచ్చు. కాని తత్వశాస్త్రం విశ్వాస సమసితం కాజాలదు. ఆలాగే ఆ సందర్భంలో వారిచ్చిన ముఖ్య మంత్రి దర్శన ప్రయత్నం వుదాహరణ కూడా చాలా బాలజల్పితంగా వుంది.

భాస్కరరావుగారు ఎంతో పూజ్యభావం కన బరచిన శంకరుణి కూడా నాస్తిక హననోత్సాహంలో వెర్రివెంగళప్పనుగా తయారుచేసేరు.

'బుద్ధుడు బోధించినదానికన్న ఎక్కువేదో బోధించవలసివుందనుకున్నాడు శంకరుడు. బుద్ధుని అనుయాయులు ప్రపంచానికీ మానవునికీ మధ్య అంతరం కనబరుస్తున్నారు. ఇంకో అడుగు ముందు వెయ్యాలనుకున్నాడు, శంకరుడు. 'అహం బ్రహ్మాస్మి'— అన్నాడు...ఈ అద్వితీయ సందేశం శంకరుని ఏకైక సంపద...బౌద్ధ తాత్వికాలోచనకు మెరుగుపెట్టడం ఆయన ఏకైక లక్ష్యం. బుద్ధుడు ఈ ప్రపంచం భ్రమ అన్నాడు. మానవుడు పరమాత్మకంటె భిన్నుడు కాదని శంకరుడన్నాడు. ప్రజ లావిధంగా శంకరునిచే ఆకర్షింబడ్డారు.' (14 వ పుట)

గొప్ప వ్యాఖ్యానం!

ఇక్కడ శంకరుడు గొప్ప తత్వవేత్తలాగాక, ఇప్పటి హైస్కూలు డిబేట్లలో వేదిక యెక్కిన విద్యార్థిగా రూపొందేడు.

ఈ విధమైన అశాస్త్రీయ పద్ధతి రచన మన దర్శనాలను అర్థం చేసుకొనేందుకు తోడ్పడదు. మన ఆలోచనా ధోరణి మారకపోతే లాభం లేదు.

"అవంతి"

శ్రీ శ్రీనివాస సప్తతి

(కృతికర్త: శ్రీ వింజమూరి—గోపాలకృష్ణమాచార్య, పాకెట్ సైజు—77 పుటలు. అమూల్యం, ప్రాప్తిస్థానం—శ్రీ వి. జి. కె. చారి, 29. ఫస్ట్ మెయిన్‌రోడ్., గాంధీనగర్, మద్రాసు—20.)

తిరుపతివంటి క్షేత్రం మరొకటి లేదనీ, 'కలౌ వేంకటనాయకః' అని యీ కలియుగంలో వెంకటాద్రీశుని పోలిన దేవుడు లేడనీ ఎంతో ప్రసిద్ధి. భగవంతు డున్నాడనే నమ్మకం లేనివారికి కూడా నమ్మిక కలిగించి, తనకు భక్తులు అయేటట్లు చేసుకునే శక్తి ఆ దేవునికి ఉన్నదని చాలా దృష్టాంతాలవల్ల తెలుస్తుంది. వేల సంఖ్యలో ఆయనకు ముడుపులు చెల్లించే భక్తులు వేలకొద్దీ ఉన్నారు. ఆ దేవదేవునిపై కీర్తనలు అల్లినవారూ, వచనాలు కూర్చిన వారూ, శతకాలు చెప్పినవారూ ఆంధ్రకవులలో అధిక సంఖ్యాకులు ఉన్నారు. ఈ శ్రీనివాస సప్తతి కూడా అట్టి స్తుతి రూపమైన కృతియే!

శ్రీ గోపాలకృష్ణమాచార్యగారు శ్రీనివాసుని భక్తాగ్రగణ్యులు. సహజ సరసకవితా కళావిలసితులు. ఏడుకొండలవాని ఆదేశానుసారం ఆ దేవదేవుని మహిమను వర్ణిస్తూ, ఏడు పదుల సీసపద్యాలను రమణీయంగా కూర్చారు. 'ఈ కావ్యనిర్మాణములో కవితా వైచిత్రిని ప్రదర్శింపవలెనను కండూతి యేమాత్ర మున్నూ లేదు. కేవలము హృదయగతమైన యావేదన నా ప్రభువుకు విన్నవించుకొనుటయే ధ్యేయము.' అని కవి వాక్యం. హృదయంలో పొంగిపొరలే భగవదనురక్తిని వాచా ప్రకటించడానికి కవి అయిన వానికి గేయాలు గాని, పద్యాలుగాని రావడం సహజం. అట్టి సహజ ధోరణిలోనే యీ పద్యాలు నడిచాయి.

శైలికి ఈ పద్యాన్ని గమనించ వచ్చును—

'సంపూర్ణ షడ్గుణైశ్వర్య సంపన్నతః
బర వాసుదేవాఖ్య వరలు దీవు
జ్ఞానమ్ము బలము యుష్మద్గుణమ్ములు గాగి
సంకర్షణాఖ్యతో జమదు వీవు

ఐశ్వర్య వీర్యమ్ము లధిగుణమ్ములు గాగ
ప్రద్యుమ్ననామాన బరగు దీవు
శక్తి తేజస్సు లాశ్రయగుణమ్ములు గాగ
ననిరుద్ధుడను పేర దనరు దీవు
పొలకడలిని నాల్గు వ్యూహాల బొలిచి
విశ్వచక్రమ్ము ద్రిప్పెదు విశ్వరూప!
అండజేరితి గరుణ గైదండ నీవె
శేషశైలేశ! జగదీశ! శ్రీనివాస!'

'వేంకట' శబ్దానికి 'వేంకట తీతి' వ్యుత్పత్తిని బట్టి పాపములను దహించే వాడని అర్థం. అంతే కాకుండా ఇహ—పర సంపద లిచ్చేవాడనిన్నీ అర్థం. ఆ విషయాలను రచయిత 12—వ పుటలోని పద్యంలో ఇంపుగా వివరించారు.

రచన సాఫీగా సాగింది. కవితా ప్రవాహానికి పండితీ ప్రకర్ష తోడు పడింది. కొద్దిచోట్లమాత్రం పదప్రయోగం సరిగా జరిపినట్లు లేదు. 'ధృత్వోర్ధ్వ పుండ్ర సందీపితోజ్జ్వల ఫాల!' (మొదటి పద్యం) ఇది సమస్తపదమైతే 'ధృతోర్ధ్వ...' అని ఉండాలి. 'ధృత్వా' సంస్కృతం—క్త్వార్థకావ్యయం. 'ధరించి' అని దాని అర్థం. 'త్వక్చక్షు కర్ణ జిహ్వాఘ్రాణముల నంగ' (పుట. 40) చక్షు-సరికాదు. చక్షుః—సకారాంతం. 'త్వక్చక్షుః కర్ణ' అనిచెప్తే ఛందస్సు పోతుంది. కవితా ధోరణిలో ఇట్టివి కానరాకుండా ఉండవచ్చు. శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీ మన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు ఈ కవిని 'భగవత్కవి' బిరుదంతో సమ్మానించడం సముచితంగా ఉన్నది.

"ఆంగీరస"

సు మ నో హ్లా ది ని

(రచయిత : శ్రీ కవికొండల వెంకటరావు. ప్రచురణ: సుమనోహ్లాదిని ప్రచురణలు, గుంటూరు—2 ముద్రణ : ఎ. యన్. ఆర్. పవర్ ప్రెస్, తెనాలి 1972. వెల రు. 3—00. క్రౌను పుటలు 64+60.)

ఇది రెండు భాగాలుగా ఉన్న ఒక కథల సంపుటి. ఆంధ్రభాషలో చిన్నకథల రచనా విధానము పరిణతి చెందుటకు మొదలయిన కాలములో అనగా ఇప్పటికి నలభై ఏండ్లక్రింద శ్రీ కవికొండల వెంకట రావుగారు కథానికా రచయితగా ప్రకాశకులు చెప్పుచున్నట్లు నూటయాభై కథలు వ్రాసి చేతనైనంత దోహదముచేసి తెనుగు కథానికను కొంతముందుకు నెట్టిరనియే చెప్పవలయును. కథానికా రచన ఈ నాటికి పొందిన స్థాయి ననుసరించి చూచినచో శ్రీ వెంకట రావుగారి కథలు జనరంజకముగా నుండవు. ఈ నాటి సమస్యలు సంస్కారములు ఆ నాడు లేవుకదా! సాధారణముగా చిన్నకథలుగాని మామూలు నవలలు కాని సార్వకాలికములయిన భావానుభూతులచేత స్థిరము లయినవి కావు. అ ప్రక్రియలెప్పుడు తాత్కాలిక ప్రయోజనములను దృష్టిలో పెట్టుకొని కొనసాగుచుండును. అందు వలన ఈ సుమనోహ్లాదిని కథలు చదువుటకు సాధారణ పాఠకుల స్థాయి చాలదు. మొత్తమువిూద ఈ కథ లన్నియును కావలయునని చదువ వలసినవే.

క్రొత్తగా సినిమాలు దేశములో ఆడుటకు మొదలుపెట్టిన రోజులలో ఆడా, మొగ అంతా సినిమాలకు ఎగబడిపోవుట, స్కూళ్ల ఇన్స్పెక్టర్లు సకుటుంబముగా క్యాంపులుపోవుట, ధనవంతులు వేశ్యా సంబంధములలో తగుల్కొనుట, ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన టెన్నిసు ఆటకు స్త్రీ పురుషులు కలిసి ఆడుట, క్రొత్తగా ఆంగ్ల విద్యాభ్యాసాలకు దిగిన స్త్రీలు పురుషులు—మిషనరీలు ఈ మొదలైన బహు అంశాలను గురించి శ్రీ వేంకటరావుగారు ఈ కథలు వ్రాసినారు. కథలు చాలా చిన్నవి. రెండు మూడు పేజీలలో సమాప్తము లగును. ఏదో చిన్నభావమును ఆధారము చేసికొనియుండి వివరాలు అంతగా లేకపోవుటవలన త్వరగా ఆయాకథల ఆంతర్యము అవగాహనకాదు. అందుకే సాధారణ పాఠకులకీ కథలయందుత్సాహము పుట్టదు. అయినా కథానికా రచనలో శ్రీ వెంకటరావుగారి చెయ్యి తిరిగిన తనము చూచుటకీ కథలు కావల

యును. మిగిలిన అన్నికథలుకూడ ఇట్లే ప్రచురింప బడవలయును. సాహిత్య విద్యార్థులకి ఉపాదేయములు కాగలవు.

పెనుమంచిలి జైన దేవుడు

(రచయిత : శ్రీ కవికొండల వేంకటరావు. ప్రచురణ : సుమనోహ్లాదిని ప్రచురణలు, గుంటూరు—2. ముద్రణ : ఎ. యస్. ఆర్. పవర్ ప్రెస్సు, తెనాలి—1972. వెల రు. 1–50. క్రౌను పుటలు 62.)

ఇందులో పది కథ లున్నవి. పెనుమంచిలి జైన దేవుడు, శ్రీరంగపట్నం నడివీధి పెరుమాళ్ల స్తంభం, ఆచంటేశ్వరుడు, కన్నప్ప కల, గంధం వొలుపు వేలుపు ఈ మొదలైనవన్నియు చివరకు కాళహస్తి, సింహాచలము మొదలయిన దేవస్థానములను చుట్టుకొని యున్న కథలు. శ్రీ వెంకటరావుగారు ఆయా దేవస్థానములను గుఱించి ఆయా పట్టణాలను గురించి తాము పొందిన అనుభవాలను రకరకాలుగా వ్రాసి నారు. ఆంధ్రదేశములోని చారిత్రక ప్రదేశములును దివ్య క్షేత్రములును అయిన కొన్ని ప్రముఖ స్థానములను కేంద్రముగా చేసి శ్రీ వెంకటరావుగారీ కథలను వ్రాసి నారు. ఈ కథలు చదివినచో ఆయా ప్రదేశాలకు సంబంధించిన కొన్ని స్థానిక విశేషాలు చమత్కారాలు తెలియగలవు. మంగళగిరిని గుఱించిన అధర సుధారసం కథ, అచంటేశ్వరుని కథ సింహాచలం కథ చాలా బాగున్నవి.

హరి వినోదము

(రచయిత : శ్రీ కవికొండల వేంకటరావు. ప్రచురణ : సుమనోహ్లాదిని ప్రచురణలు, గుంటూరు—2. వెల రు. 3–50. క్రౌనుసైజు— పుటలు 99. ముద్రణ : ఎ. యస్. ఆర్. పవర్ ప్రెస్, తెనాలి. 1972.

హరి వినోదము అయిదు శతకముల సంపుటము. ఈ శీర్షిక కాక మమ్మైకదవ సంప్రార్థనము, శతథా, కందకుక్షి, ద్విపదలాక్షి అని నాల్గు శీర్షికలు కలవు. ఇందు మొదటి వన్నియు చాలవరకు వృత్తములు. చివరి రెండును ఆ ఛందస్సులతోడనే కలవు.

కవికొండల వెంకటరావుగారు 'కొండకొలకు వికసితోత్పల'గా మిక్కిలి ప్రసిద్ధి కెక్కిన నారు. ఆయన కథకుడుగా కవిగా మంచి చేయి తిరిగిన రచయిత. ఈ అన్ని శతకములందును శ్రీ వెంకటరావుగారి తాత్విక దృక్పథము లక్షణము స్పష్టముగా ప్రకాశించు చున్నది. ఆయన యందు భక్తిభావము మూర్తి పూజగా మొదలై జిజ్ఞాసను పెంచి పెంచి చిట్టచివరకు పరబ్రహ్మోపాసనముగా పరిణతిచెందిన విధానము కనిపించు చున్నది. ఇహపరములను రెండింటిని విచారించి వ్రాసిన పద్యములుగా చివరి రెండు శతకములును కలవు.

భగవంతుని ఉనికిమీది విశ్వాసముతో ఈ లోకముయొక్కయు లోకులయొక్కయు ఉత్తమ గతుల నుద్దేశించి శ్రీ వేంకటరావుగారు తత్వవిచారము చేసి ఈ అయిదు శతకములను వ్రాసిరి. మామూలు శతకములందున్నట్లు భక్తివైరాగ్య స్వభావముల యొక్క సమ్మేళన మిందును కలదు. ఏ శతకమునకును మకుటము లేదు. పరమేశ్వరుడు నామరూప రహితుడు కదా అని శ్రీ వేంకట రావుగా రిట్లు మకుటము లేకుండ చేసియుందురు.

పద్యముల నడక మంచిధార కలిగి బాగుగానే యున్నది. కందపద్యములు—ద్విపదలు మంచి లోకోక్తులతోను అనుభవములతోను హెచ్చరికలతోను చమత్కార కారులుగా నున్నవి. రవీంద్రనాథుని గీతాంజలి లక్షణములును ఈ శతకములయందు లేకపోలేదు. సహృదయులు సన్నిధిని కల్పించుకొని చదువవలసిన కృతులు—శ్రీ కవికొండల వారి స్మృతి చిహ్నముగా ప్రచురింపబడుట ఆనందింపదగినది.

కాళీపట్నం రామారావు కథలు

(రచయిత : శ్రీ కాళీపట్నం రామారావు. ప్రచురణ : సాగర గ్రంథమాల, విశాఖపట్నం—2.

ముద్రణ : బెస్టుప్రెస్, విజయవాడ—2. 1972. వెల రు 2-50. (క్రౌను పుటలు 140.)

ఇది శాంతి, వీరుడు—మహావీరుడు, చావు అను శీర్షికలతో ఉన్న మూడు కథల సంపుటి. శ్రీ రామారావుగారు చాలా కాలమునుండి చక్కని కథలువ్రాసి ప్రసిద్ధికి వచ్చిన వారు. భారతి పత్రికలో వెనుక ప్రచురించిన రాగమయి మొదలయిన కథలు చిన్నకథలుగా గాక కొద్దిపాటి నవలలుగా ఉన్నవి. కథలను ఇంత విస్తృత పరిధిలో వ్రాయుటయే శ్రీ రామారావుగారి ఒక ప్రత్యేకత. ఆయన కథలు అనేక విషయాలను పాఠకుల స్ఫురణకు వదలి తాము అంత సుదీర్ఘములై పరిసమాప్తము లగును. అక్కడ సాధారణ పాఠకులు తికమకపడుట కలదు.

ఈ కథలలో చావు చివర కున్నది. అదే మొదట యుండవలయును. ఈ చావు తరువాతి బ్రతుకునకు మొదలు. బ్రతకు అంతయు వీరుడుగా మహావీరుడుగా నుండును. చావుకు బ్రతుకునకు నడుమ శాంతి. ఈ సంపుటములో కథలు శాంతి చావులు మొదటను చివరన కలవు.

మన సమాజము అట్టడుగున పడి ఉన్న దళిత వర్గాలవారి జీవిత మమతలను ప్రధానముగా చావు ప్రదర్శించు చున్నది. ఆయా దళితవర్గాల పట్ల బలిసిన సమాజమెంత నిర్లక్ష్యముచేసి ఎంత వక్రముగా ప్రవర్తించు చున్నదో శ్రీ రామారావుగారు చక్కగా చిత్రించి నారు. కడుపుకు తిండి కట్టుకొనుటకు గుడ్డ లేని ఎరకయ్య కుటుంబముయొక్క పరమ దైన్యావస్థను శ్రీ రామారావుగారు ఎరకయ్య తల్లి తాను చనిపోయినప్పుడు తప్పక తగులబెట్టుమని కొడుకునకు చెప్పినదని వ్రాసి స్ఫురింప చేసినారు. ఆమె బ్రతికి యుండగా చలికొరికి వేయుటనుండి రక్షణ లేదు. చనిపోయిన తరువాత పూడ్చిపెట్టినచో అప్పుడును వేడి తగులదు. అప్పుడైనను ఇంతవేడి తగులుటకు ఆమె తనను కాల్చుమని చెప్పినది. శ్రీ రామారావుగారి పాత్రోచిత భాష, ఈ కథలోని సముచితములయిన సంఘటనలకు మంచి స్ఫూర్తిని కలిగించు చున్నది.

మిల్లు యజమాని పట్టాభిరామయ్య కార్మికులను పీల్చి పిప్పిచేసి వారిని వారి నాయకులను రూపుమాపుటకు కూడ వెనుదీయని మహానుభావుడు. కార్మిక శక్తిని వంచనచేసి కోటీశ్వరుడై కార్మిక శక్తి మేల్కొన్నప్పుడు ఆ ధాటికి తట్టుకోలేక పిచ్చెత్తి అన్నివిధాలయిన దురలవాట్లకులోనయి ఆ డబ్బునంతా ఆలా వ్యయపరచి వృధాగా బ్రతికిచచ్చే ధనపిశాచము పట్టినవారికి ఈ కథ మహాతీవ్రమైన హెచ్చరిక.

సమాజమున ఎవడు బలవంతుడో వాడికే అందరును అనుకూలము. ఇట్లు ప్రజలు అనుకూలురగు చున్న కొలదియు వాడు బలవంతు డగుచుండును. ఇది ఈ బ్రతుకు విధానము. దీనికి మార్పు లేదు. బలహీనుడు సమాజములో దోషము చేసిన వాడు. బలహీనులను తన్నువాడు వీరుడు. బలహీనులను వీరుల కప్పగించు వాడు మహావీరుడు. ప్రజలు గతిలేక ఆ వీరులను మహావీరులను పట్టుకొని బ్రతుకు చున్నారు. సామాన్య ప్రజలు మొదటి దెబ్బ పడకుండానే బ్రతుకులు వెళ్లదీసి కొనవలయును. ఒక దెబ్బ పడినచో ఇక దెబ్బమీద దెబ్బ. వారి నెవరును రక్షించరు. సమాజములోని వీరులు మహావీరులు బుద్ధిమంతులు కారు. ఒళ్లు బలిసినవారు. వారే అల్లీపురము వస్తాదు, కొత్తపేట శాండో. సమాజముయొక్క ప్రవృత్తిని ప్రదర్శించుటకు శ్రీ రామారావుగారు ఒక కిటికీని తెరిచి ఈ కథను వ్రాసినారు.

ఇంత సామాజిక దృక్పథముగల రచయితలు ఈనాటి కథకులలో ఉండవలసినంత ఎక్కువ సంఖ్యలో లేరు. శ్రీ రామారావుగారు మహాగంభీరముగా విస్తృతమైన ప్రాతిపదిక మీద కథలను వ్రాసి తాము చెప్పదలచుకొన్నది విస్పష్టముగా స్ఫురించునట్లు చేయగలరు.

మనం మనం బరంపురం

(సంకలన కర్త : అవసరాల రామకృష్ణారావు. ప్రచురణ : వికాసం కార్యాలయం, గాంధీనగరం, బరంపురం (గంజాంజిల్లా) ఒరిస్సా. క్రౌను పుటలు 174. వెల: రెండు రూపాయలు.)

గ్రంథ విమర్శలు

బరంపురం లోని ఆంధ్ర కథానికా రచయితలు పది మంది వ్రాసిన కథలు ఈ సంపుటముగా ప్రచురింపబడినవి. నల్లకారు అని మొదటి కథ. విషయము సాధారణమైనది. అనగా ప్రేమించిన వారికి పెళ్లికాకపోవుట. ప్రతీకారానికి ఒడిగట్టిన రంగయ్య ప్రపంచానుభవమువల్ల సాత్వికుడుగా నగుటను ఆదర్శముగా చెప్పినది. రెండవది బ్రహ్మపరం. మహిళా మండలి వారు బ్రహ్మలోకమునకు పోయినా రన్న అలౌకికమైన ఒక అద్భుతమును సృష్టించుట బాగుగానే ఉన్నది కాని, దానివలని ప్రయోజనమంత బాగా లేదు. మూడవది నిశీధినిజాలు. దేవదానవ లక్షణాలు మానవుల లోనివే. ప్రతి వ్యక్తిలోను దైవభావము ఎప్పుడో తలయెత్తి వాని చేత ఒక మంచిపని చేయించి తీరునన్న సత్యమును తెలుపుటయే ఈ కథా తాత్పర్యము. కాని అందు కాధారముగా కల్పించిన కథ సమంజసమైనది కాదు సమాజములో చెప్పకోదగినది కాదు. ఆడది ఆహ్వానించింది అనే పేరుతో సెక్సు బలహీనతను కప్పిపుచ్చుకొనుటకు వాగ్వ్యయము చేసిన ఒక సుబ్బారావు కథను వ్రాయుటవలన పదునాలుగు పుటలు వృథాయైనవి. అయిదవది మీ కంటే మీ నాన్నే నయం. వరకట్నం మీ నాటి సాధారణ కథావస్తువే అయినా శ్రీ మూర్తిగారు ఒక క్రొత్త కోణమునుండి దానిని దర్శించి ఈ కథ వ్రాసినారు. ఉదారముగా ప్రవర్తిస్తున్న వైఖరిని చూపే యువకుల అంతర్యములోని పిరికితనమును బయటపెట్టి—అలాంటి పెండ్లి కొడుకులకంటె ధైర్యంగా ఇంత కట్నము కావాలని కచ్చితముగా అడిగిన పెండ్లి కొడుకుల తండ్రులే మంచివారని—వారిలో వంచనా ప్రవృత్తి లేదని, వారే నిజంగా మనుష్యులని నిరూపించి యువతరములోనున్న పిరికితనముతో కూడిన వంచనా ప్రవృత్తిని వేలుపెట్టి చూపి అది క్షమింపరానిదని నిరూపించిన మూర్తిగారు అభినందనీయులు. ఆ వ్యాతము దర్శనము లేనివాడేమి రచయిత. శ్రీ మూర్తిగారు మాధవి పాత్ర ద్వారా తమ దృక్పథమును చక్కగా వ్యక్తీకరించినారు. రచనా రీతి కూడ ఉత్సాహజనకముగాను ప్రశంసా పాత్రముగాను న్నది. దీని తరువాతి చెయ్యి దాటిపోలేదు అన్న కథ కూడా ఇలాంటిదే. కుష్ఠు వ్యాధిని, మామూలు డాక్టర్లు వృత్తి ధర్మముగా భావించి, అదొక భయంకరమైన నయము గాని వ్యాధిగా ప్రచారము చేసి ప్రజలను హడలగొట్టుచున్నారు. దానిని మొలకగానే త్రుంచివేయుటకు సరియైన మందులతో ప్రభుత్వము తీవ్రముగా కృషి చేయుచున్నది. దీని మీద కథ నల్లిన శ్రీ మాష్టర్ రవిని మిక్కిలిగా అభినందింప వలయును. కథన శిల్ప మెంతో రమణీయముగా నున్నది. కొమ్మూరివారి 'భారతి' తరువాత ఆ దృష్టితో ఈ కథ చెప్పకోతగినదిగా నున్నది. డాక్టర్లు ప్రభుత్వోద్యోగులు స్వానుభవము మీద ఇలాంటి రచనలు చేయుట సమాజముయొక్క పురోగతికి ఎంతైనా అవసరము. చంపకం కథ మామూలుగా బాగానే యున్నది కాని అదొక పెద్ద ఆలోచింపవలసినంత ఉదాత్తమైన మనస్తత్వము కాదు. సేతుబంధనం కథా వస్తువు సామాన్యమైనదే కాని కథను మలచిన తీరు చమత్కారకారిగా నున్నది. ఆదర్శాలు ఆచరణలో ఏలా సాధ్యములు కావో నిరూపించటాన్ని మల్లికను చేసికొన్న భాస్కరం కథ ఇలా వ్రాయబడినది. ఎనిమిదవ కథ—టిట్టిభం. తన సౌశీల్యము యొక్క పతనమును పతనముగా బయటపడ నీయకుండుటకుగాను భర్తను నిందపాలు చేసి వదలిపెట్టి పోయిన అజ్ఞాన విలసితమైన బుద్ధి లక్షణముగల స్త్రీ టిట్టిభం. ఎలా అర్థం చేసికొనేది అన్న కథ డాక్టరు రాధికను కేంద్రముగా చేసికొని వలయాలను సృష్టించినది. పరస్పరానురాగముకల అద్వితీయులయిన వృద్ధ దంపతుల దాంపత్య రసపరిణతి డాక్టరు రాధికను ఎంతగా ప్రభావితము చేసినదో చిత్రించుటలో రచయిత్రి కుమారీ దేవి వారి జీవిత చరమఘట్టమును మహాదీప్తిమంతము చేసి చూపినారు. కథ చాల బాగున్నది. చిట్టచివరి కథ శిక్షింపబడని దోషులు. ఇది ఒక అసమర్థుని కథ. ప్రేమించి పెళ్లి చేసికొనలేక ఆత్మహత్యకు పాల్పడుట కథలుగా గాథలుగా ప్రచారము చేయదగినది కాదు. మనిషి పరిస్థితులు సమాజము మనస్తత్వము ఆర్థిక రాజకీయ తాత్విక దృక్పథము ఇవన్నీ తెలిసిన ఒక స్వతంత్రమైన దర్శనము రచయితలకు చాల ముఖ్యము. అది లేక వ్రాయకూడదు. వ్రాసిన వాటిని అచ్చు వేయకూడదు.

దేవీ మాహాత్మ్యము

(రచయిత: శ్రీ జోస్యము జనార్దన శాస్త్రి. ప్రకాశకులు: శ్రీ రామా బుక్ డిపో, సికింద్రాబాదు—3. ముద్రణ శ్రీ రామా విద్యున్ముద్రణాలయము. 1972. వెల: రు. 2–50. క్రౌను పుటలు 120.)

మార్కండేయ పురాణములోని శ్రీ దుర్గా సప్తశతికి ఇది తెనుగు పద్యములలో అనువాదము. మార్కండేయ పురాణము ననువదించిన మారనకవి ఈ సప్తశతిని గూడ వ్రాసినాడు. పురాణాంతర్గతమై యుండుటచేత వ్యస్తముగా అంత ప్రసిద్ధిని పొందలేదు. సప్తశతి యనగానే సంస్కృత మూలమునకు పోవుటయే పరిపాటి యైనది. అందువలన మారన కృతికి ప్రసిద్ధి రాలేదు.

ప్రస్తుతము శ్రీ జనార్దన శాస్త్రిగారు 'ఇది యసంతృప్తికరముగా నున్నయెడల నింతకు మిన్నగా వ్రాయవలయునను నుత్సాహము మరెవరికైన గలుగు గాతమనియు నెంచి' ఈ విధముగా సప్తశతిని అనువదించినారు. శ్రీ శాస్త్రిగారు చెప్పిన మాట అమ్మవారి దయవలన వినయముగా నున్నది. ఈ యనువాదము వీలైనంతలో చక్కగా నున్నదనియే చెప్పవలయును. కవిత్వ మనగానే లక్ష విషయములను విచారింపవలయును. అదొక ప్రపంచము. ఇట్టి గ్రంథముల యందు కవిత్వ మెంత యుండవలయునో అంతకు మించిన తత్త్వార్థ విశ్లేషణ ముండవలయును. ఈ విషయమున శ్రీ శాస్త్రిగారు చేసిన కృషి ప్రశంసనీయముగా నున్నది.

సప్తశతియందు మూడు చరిత్రము లున్నవి. దేవకార్య సంసిద్ధినొడ గూర్చుటకు అమ్మవారు మొదట మేల్కొల్ప బడినది. ఆమె మొదట శ్రీ మహావిష్ణువు యోగనిద్ర. అప్పుడు మధుకైటభులు వధింపబడిరి. ఇది ప్రథమ చరిత్రము. ఆ తరువాత మహిషాసురుడు పుట్టెను. వానిచేత దేవతలు పరాజితు లయిరి. అంత త్రిమూర్తులయొక్క తేజ మేక రూపమున అమ్మవారుగానై సర్వాయుధ సంపన్నయై ససైన్యముగా మహిషాసురుని వధించినది మాధ్యమ చరిత్రము. ఆ తరువాత శుంభ నిశుంభులు పుట్టి విజృంభించిరి. శ్రీ దేవి వారిని వారి సేనా నాయకులను తుదముట్టించిన కథ ఉత్తమ చరిత్రము. ఇంతవరకు మూలమున పది అధ్యాయములు. శ్రీ శాస్త్రిగారు నాల్గువందల తొమ్మిది పద్యములుగా అనువదించిరి. ఆ పిమ్మట మరి మూడు అధ్యాయములు స్తుతులుగా ఫలశ్రుతులుగా నున్నవి. మొత్తము మీద అయిదువందల రెండు పద్యములు. మారన కవి రెండువందల యేబది యెనిమిది గద్యపద్యములలో సప్తశతిని ఆంధ్రీకరించి పెట్టెను. ఈ శాస్త్రిగారి అనువాదమును మారన్నగారితో పోల్చి చూడరాదు. మూలమును వీలయినంతగా తెనుగునకు తెచ్చు ప్రయత్నము చేసి శ్రీ శాస్త్రిగారు కృతకృత్యులయినారు. మహిషాసుర వధయైనప్పుడు దేవత లమ్మ వారిని స్తుతించిన పద్యములు రెండు.

సురుచిర మందహాస పరిశోభిత
శుద్ధము నిష్కళంక వి
స్ఫుర దురు చంద్రబింబ సమమున్
గనకోత్తమ కాంతి కాంతమై
పరగు భవన్ముఖాంబుజము వైపటు
చూచుచు నున్న యట్లయ
త్తరి మహిషాసురుండు ప్రహతం
బొనరించుట అద్భుతంబగున్.

తూపులు బోలు చూపుగమితో
గుపిత భ్రుకుటీ కరాళమై
యేపున నెట్టనై పొడుచునిందుని బోలు
భవన్ముఖంబుపై
చూపులు నిల్పినంత మహిషుండటు
నీల్గమికే విచిత్రమౌ
నోపునొ? జంతువుల్ బ్రతుకునో
కుపితాంతక దర్శనంబునన్.

పరాభట్టారికా మహాదేవి లీలా విలాస క్రియా కలాపమును సప్తశతిని తెలుగులో వెలయించిన శ్రీ జనార్దనశాస్త్రిగారు మిక్కిలి అభినందనీయులు.

సాహిత్య తత్త్వము:
శివ భారత దర్శనము

(రచయిత: శ్రీ సర్దేశాయి తిరుమల రావు. ప్రతులకు: జె. యస్. భీమసేన రావు 14/150

కమలానగర్, అనంతపురము. డెమ్మి పుటలు 384. వెల: రు. 13–00.)

బ్రహ్మశ్రీ గడియారము వేంకటశేష శాస్త్రి గారు రచించిన చారిత్రక మహాకావ్యము శివభారతము అధునికాంధ్ర సాహిత్యములో వ్రేళ్ల మీద లెక్కబెట్ట దగినవాటిలో నొకటి. అందువల్లనే అది పుట్టినప్పటి నుండియు అనుకూల ప్రతికూల వాయువులచేత ఇంత వరకును తాడితమగుచునే యున్నది. ఇక ముందు కూడ అది అట్లే యుండగలదు. శ్రీ తిరుమల రావుగారిప్పుడు ఆ శివభారతము మీద ఇంత విమర్శనమును వెలయించిరి. ఇందువల్ల శివ భారతమునకు ప్రతికూల వాయు స్పర్శ తగులలేదు. సాహిత్యము జీవిత విమర్శనము అను శీర్షికతో పదునాల్గు పుటల ఉపోద్ఘాతముతో శివభారత విమర్శనము మొదలయినది. కావ్యనామము - స్వరూపము అను శీర్షికను సాగిన విచారధార అంతయును కావ్యేతివృత్తమును బట్టికొని కావ్య ప్రక్రియల తీరు తెన్ను లెట్లుండునో నిరూపించుచు చివరకు శివ భారతము పరిక్రియ అను ఒక ఇతిహాస భేదమని స్థాపించిరి. ఆ పిమ్మట కవిత— చరిత అను శీర్షిక పెట్టి మహాకవుల దృష్టి దేశ కాల పాత్రముల మీద పరుచుకొని సామాజిక దృక్పథము కలిగి కావ్య వస్తువుల నెన్నిక చేయుననియు, దాని నాధారము చేసికొని వర్తమానమున ప్రవర్తించుచున్న కవులు భూత భవిష్యత్తులను ఏక ముఖముగా ప్రదర్శించుటకే కావ్యములు వ్రాయుదు రనియు శివ భారత మట్లు వ్రాయబడినదనియు శ్రీ తిరుమలరావు గారు సలక్షణముగా ప్రతిపాదించినది తిరుగులేని విషయముగా నున్నది. శ్రీ వేంకటశేష శాస్త్రిగారు తిక్కన్న గారి వాక్కునందు మక్కువ కలవారు. తిక్కన్నగారి గారి మార్గమున శ్రీ శేషశాస్త్రిగా రిట్లెంతవరకు ప్రయాణ చేసినదియు పరిశీలించుచు నుడికారపు సొంపు అను శీర్షికను శివభారతము నందలి జాతీయములను సమాసములను నుడికారములను వాక్యములను కవి సమయములను మరియును కవి గారి కభిమాన పాత్రములయిన పదములను, ఊత పదములుగా వాడబడిన వాటిని ఇంకును వ్యావహారిక దేశ్య పదములను పదబంధములను శ్రీ తిరుమలరావు గారు ఏబదిమూడు పుటల మేర త్రవ్విపోసిరి. ఇదంతయు తిక్కన్న గారి ప్రభావము శివభారతము నందున్న దానికి నిదర్శనముగా నున్నదని శ్రీ తిరుమలరావు గారి నిర్ణయము. వచస్సు ఛందస్సు అను శీర్షికను విషయావస్థాను రూపముగా ఛందస్సులందు శివభారతకర్త వచస్సులను ప్రవర్తింపజేసిన విధము సోదాహరణముగా చర్చింప బడినది. ఇక్కడ శ్రీ తిరుమలరావు గారు లోనారసి చూచిన విధము మహనీయముగా నున్నది. 'సంయమ వచస్సులో విప్లవ భావము నెట్లు చిలికింపవచ్చునో సంప్రదాయ ఛందస్సులో ఆధునిక కవిత్వము నెట్లు కులికింపవచ్చునో శివ భారతము చదివిన తెలియును' శ్రీ తిరుమలరావుగారీ తమ యభిప్రాయమును కూలంకషముగా నిరూపించిరి. నాటకీయ శిల్పమనుపేరు క్రింద అదొక దాస్యవిమోచన నాటకమనియు, తల్లికొడుకులు నాయికా నాయకులై యజమానురాలుగా సేవకుడుగా ప్రవర్తించుటను ఇతివృత్తముచేసి శివభారతము వ్రాయబడిన దనియు, భారతమాత నాయిక కొడుకు శివాజి నాయకుడు—నాయికా నాయకుల విషయమున నాదొక క్రొత్త విప్లవ దృక్పథము శివభారతమునందు కలదని తిరుమలరావుగారు విచిత్రముగా వ్యాఖ్యానము చేసిరి. పంచసంధులును, సన్నివేశకల్పనములను పేర్కొని సమన్వయము చేసిరి. ఈ సందర్భమున నాటకీయ సంభాషణములుగల ఘట్టములు - మరియు అందలి ప్రధాన వాక్యములు—అని ఎన్నికచేసి చూపిన విషయములు ఉచిత రమణీయములుగా నున్నవి. గ్రంథ గ్రంథులన్న శీర్షిక ఒక నూత్న దృక్పథమును ప్రదర్శించు చున్నది. ఆధునికములయిన భౌతిక శాస్త్రాది విజ్ఞానములు, మరియు సార్వకాలికము లయిన ప్రాచీన భావములు శివభారతమున క్లిష్టములుగా కూర్చబడి వ్యాఖ్యేయములుగా నున్న వానిని

శ్రీ తిరుమలరావుగారు చర్చా పూర్వకముగా అర్ధ నిరూపణము చేసిరి. గోరక్ష. శివభారతము తీర్చిన శివాజి—శివాజి తీర్చిన శివభారతము, జీజియా అలంకారముల, శివభారత దర్శనము—ఈ మొదలయిన ఉపశీర్షికల క్రింద నాయకుడయిన శివాజీయొక్క లక్షణమును అతని వ్యక్తిత్వమును మరియు ఉత్తమములయిన మహానాయక పురుష లక్షణములను, ఈ శివభారతమున జీజియా పాత్ర పరిపోషణ విధానమును బహువిధములుగా నిరూపించి చిట్టచివరకు శ్రీ తిరుమలరావుగారు శివభారత మహేతిహాసము విశ్వసంస్కృతీ స్థాపకములయిన మహాగ్రంథములలో నొకటియని కీర్తించిరి—ఈ మొత్తము విమర్శన గ్రంథమును శ్రీ తిరుమలరావు గారొక ప్రత్యయ బుద్ధితోను, అభినివేశముతోను, స్వతంత్రమైన చూపుతోను రచించినారు. ఆయన తన సర్వవిజ్ఞానమును శివభారతమును విమర్శించుట కుపయోగించెను.

జే. మెందర్స్.

అ రు ణ
(న వ ల)

వి వా హం
(క థ లు)

ఆ రా త్రి
(క థ లు)

చలంగారి కలం స్పెషన్ పంపు
(క థ లు)

(ఈ నాలుగు పుస్తకాలు వ్రాసింది—చలం. వీనిని ప్రచురించింది—ఎమెస్కోవారు. ఒక్కొక్కదాని ఖరీదు 2–50.)

'స్త్రీని పాతగూళ్లల్లో, తుక్కుపురాణ నీతుల్లో, నవీన జీవితానికి ఏ సంబంధమూ లేక పుచ్చిన నీతి నిబంధనల్లో, కుళ్లిన ముసలమ్మల శాసనాల్లో, దర్పగమైన గృహాల్లో కళ్లుమూసి, బంధించి ఉంచాలని చూసే నేర్పుగల ధూర్తలోకం. కులగిరులే, దేవతలే, భూమే మారుతూవుంటే, స్త్రీనిమాత్రం జీవనంతీసి, శిలనిచేసి మూలదాచాలని చూసే మూర్ఖపులోకం' ఈ వాక్యాలెవరివో కాదు. ఒకప్పుడు సాంసారిక విప్లవ సాహిత్య సామ్రాట్టుగా, సెక్సు వాఙ్మయ బ్రహ్మగా పేరుమోసి, ప్రస్తుతం అరుణాచలయోగిగా అనుచరులకు ఈశ్వరాశీర్వచనాలందిస్తూన్న గుడిపాటి వెంకటచలానివి. సమాజాన్ని సంస్కరించాలని సనాతుల పద్ధతులపై తిరుగుబాటు చేసి లోకానికి గుణపాఠం నేర్పాలని కంకణం కట్టుకొని కన్నెపిల్లల జీవితాలను ఉద్ధరించటానికి రకరకాలైన 'సెక్సీకలరు' రచనలుచేసి ఆంధ్రసమాజాన్ని ఊపివేసారు. చలం ఆశించిన సమాజం ఆంధ్రదేశంలో అవతరించటం కల్ల. స్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛనియ్యాలని తన నారీమణులను విశృంఖలంగా ఇంటింటికి త్రిప్పించారు. ఆశయాలను ఆదర్శాలను ప్రచారం చేసేటప్పుడు సెక్సు దృష్టి కలిగించటం చలానికేమి అవసర మొచ్చింది? సాంఘిక సమానత్వం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సమానంగా స్త్రీ పురుషులకు కావలసిందే. అవి కావాలిగదా అని కనిపించిన మగవానితో నల్లా లేచిపోయి సిద్ధాంతరాద్ధాంతాలు చేయటమేనా? సామాజిక చైతన్యం రావాలంటే కట్టుకొన్న భర్తను వదల నక్కరలేదు. కఠిన పాషాణ హృదయులకు బలి కానక్కర లేదు. సంసారం అన్న తర్వాత వ్యక్తులు కరుణ కర్కశత్వాలమధ్య నలిగి పోవటం సహజం. దీన్ని రూపుమాపటం సాధ్యంగాదు. సమాజాన్ని నైతికపతనం చెందించేకంటె ఔన్నత్యం కలిగించటం జాతికి శ్రేయోదాయకంగా ఉంటుంది. పరజాతి సంస్కృతిని అనుకరించమని ప్రోత్సహించేకంటె స్వజాతి సంస్కృతిలో చైతన్యభావ విలాసాన్ని దర్శించి దానిని సమాజానికి నేర్పితే బాగుంటుందనిపిస్తుంది.

అ రు ణ.

ఇదొక నవల. చలం స్వాప్నిక జగత్తునుండి అవతరించిన భామిని అరుణ. భావ కవులు స్త్రీలో అలౌకిక స్వరూపాన్ని దర్శించి ప్రణయ పరమార్థం కనుగొంటే అరుణాచలం మాత్రం లౌకిక, అలౌకి ధర్మాలను చూపించారు. ముగింపులో అరుణను ఆధ్యాత్మిక భావ సమ్మేళనం చేశారు. అరుణకు సంసారం ఉన్నది. స్వేచ్ఛ కావాలని తపించింది కాని తరింప లేక పోయింది. క్షణికమైన సౌఖ్యంకోసం యిల్లు వదలి

వచ్చింది. తానేది సాధించాలను తాపత్రయం చెందిందో దానిని సాధింపలేక జీవితంలో ఓడిపోయింది. చివరకు భర్త చేతిలో తన్నులు కూడ తిన్నది. అప్పటికే జీవితంపైన విరక్తి కలిగినట్లుగా చిత్రించారు. స్త్రీని ఆటబొమ్మగా చిత్రించి ఆడించటం చలానికి సాధ్యమైనట్లుగా మరెవ్వరికి సాధ్యం కాదు. కథ అంతా చెప్పి పాఠకుల సానుభూతి ప్రాప్తికి అరుణను ఆధ్యాత్మికానుభూతితో సమన్వయించారు. తానూహించి చిత్రించిన అరుణ జీవితాన్ని పరిష్కరింపకుండ చలం అన్వేషణ గమ్యాన్ని చూపారు. 'అరుణ' ప్రారంభోప సంహారాలు చిత్రంగానే ఉన్నాయి.

వివాహం :

ఈ సంపుటంలో వివాహం — తరుణుల చిత్తంబు —కల్యాణి. వివాహం ఒక చిన్న నవలిక. తక్కినవి రెండు చిన్న కథలు.

మధ్య తరగతి సంసారాలు సామాన్యంగా కోప తాపాలకు రాగద్వేషాలకు గురైపోతాయి. బాధలు వ్యధలు ఈ సంసారాలను నానా విధాలైన సమస్యల్లోకి నెట్టి వేస్తాయి. మధ్య తరగతి జీవనం వ్యక్తిని బ్రతక నీయదు, చావనీయదు. సమస్యలు వాటంతటవే వచ్చి పడుతూ ఉంటాయి. పరిష్కరింపరాని సమస్యలు త్రెంచుకోలేని అనుబంధాలు స్త్రీ పురుషులను పెన వేసి పీల్చి పిప్పి చేస్తాయి. అట్టి వారిని సృష్టికర్తే సంరక్షించాలి.

గోపాలరావుకు రజస్వలకాని రవణతో వివాహ మయ్యింది. రవణకి గోపాలరావు అంటే భర్త అని మాత్రమే తెలుసుగాని మరేమి తెలియదు. భర్త ఎదురు పడితే సిగ్గుతో తల వంచుకు పోయేది. భార్యా భర్తలు పరస్పరం మాట్లాడుకొంటూంటే యితరు లెవరైనా చూస్తారేమోనని భయం. ఈ భయభీతుల మధ్య వారిద్దరు చిక్కి శల్యమైపోయారు. అమ్మ పెట్టనూ పెట్టదు— అడుక్కు తిననీయదన్న సామె తగా గోపాలరావు జీవితం గడచిపోతున్నది. పేదవాని కోపం పెదవికి చేటని భార్యవైపు చూడక స్తబ్దంగా ఉండిపోయాడు. కాచి రక్షిస్తున్నవారైనా ఒక్కసారి అయ్యో అని సానుభూతి చూపరు. ఎక్కడ సాను భూతి ప్రదర్శిస్తే భార్యాభర్తలొకటై పంజరం నుండి పారిపోతారేమోనని భీతి. చాదస్తులు కొందరు తమ స్వార్థమే ప్రధానంగా భావించి ప్రాణాలను బలిగా కోరారు. తన తమ్ముని కుమార్తె రవణ అనే భావం వెంకన్న పంతులకున్నా బయటకనే ధైర్యం లేదు. ఒక వేళ అంటే భార్య ఎక్కడ వచ్చి గొంతు నులుముతుందని భయం. గోపాలరావుని వెంక ట్రావు గారు పెంచి పోషించి చదువు చెప్పించారు. ఎంత చదువు చెప్పించినా గోపాలరావులో బీదవాడనను దైన్యస్థితి మాత్రం మారలేదు. రవణతో పలకా లంటే బీదరికం అడ్డొచ్చి అంతస్తులు నిర్మించి అంతఃకరణను ప్రేరేపించేది. కాని కాలం కలసి రాలేదు. భార్య అయినా తనది అని చెప్పుకొనే ధైర్యం లేకుండ పరిస్థితులు ఆందోళన కలిగించాయి. భర్త పరిస్థితి చూచి భార్య నిగ్రహించుకోలేని జాలి— ధైర్యం తన మనసులో ఏర్పరచుకొన్నది. నవయవ్వ నంలో సున్న భార్యా భర్తలకు పరిస్థితులు సానుకూలం కాకపోతే విపరీతమార్గాల వైపుకు దృష్టి కలుగు తుంది. ఈ స్థితిలో భర్తను భార్య ఉపేక్షింపలేదు. భార్యను భర్త సహింపలేదు. అంతరాంతరాలల్లో అగ్ని జ్వాలలు మండుతాయి. హృదయాలు దహించుకొని పోతాయి. ఆ సమయంలో ఎవరైనా కేలందిస్తే భార్యా భర్త లిరువురూ అదృష్టవంతులే అని చెప్పాలి. అట్టి అదృష్టం రవణ— గోపాలరావుకు కలిగాయి. ఒకరి నొకరు సన్నిహితులైనారు. పొరపొచ్చాలు నశించాయి. కాలచక్రంలో కొట్టుకొనిపోకుండ కళ్ళు తెరచి తమ బ్రతుకుల కొక ప్రయోజనాన్ని సాధించుటకై వెంక ట్రావు వారిరువురను ఒకటి చేసి పట్నవాసానికి పంపి పుణ్యం కట్టుకొన్నాడు.

ఈ నవలికలో చలం అద్భుతమైన కథా నైపుణ్యాన్ని మానసిక వ్యవస్థను చక్కగా చిత్రిం చారు. అభం శుభం తెలియని రవణ లాంటి అమాయిక స్త్రీలు వైవాహిక జీవితంలో శిఖరాలను అందుకో లేక, అను క్షణం ఆలోచింపక, అన్వేషణలో ఆనం దానుభూతిని గ్రహింపలేని అసమర్థురాలు. మానవా కారం దాల్చినా మాట మనసు ఉన్నా రంజింపలేని హృదయం, ఆవేశం పొంగి వచ్చినపుడు రాక్షసత్వంలో మగ్గిపోతుంది. గోపాలరావు భరింపరాని బాధ అనుభ వించాడు. తనకు భార్య ఉన్నా లేనివాడయ్యాడు. అడ్డు తెరలు తొలగాయి. రవణ— గోపాలరావులకు చల్లని నీడలు జీవితంలో అలముకొన్నాయి.

'తరుణుల చిత్తంబు, కళ్యాణి' కథల్లో చెప్పుకొనదగిన అంశ మేమీ లేదు.

ఆ రా త్రి

ఈ సంపుటంలో 'ఆర్రాత్రి, ఆరంభించరు, పాప ఫలాలు—రామభక్తుడు—అప్పుడూ—ఇప్పుడూ— హరిజన సమస్య—కళారాధన—రసపుత్రులు' అను ఎనిమిది కథ లున్నాయి. ఇవి 1927 తరువాత రచింప బడ్డాయి.

మొదటి కథ 'ఆర్రాత్రి'లో స్త్రీల జీవితం ఎంత దుర్భరమయ్యిందో తెలుస్తుంది. అందం ఆడదానికి శత్రువు. ఈ సమాజానికి అందం కనిపిస్తే ఆస్వాదించాలను ఉబలాటంలో వయో తారతమ్యాలు పరిగణనకు రావనే అభిప్రాయాన్ని చలం ఈ కథలో చూపించారు. తల్లీ కూతుళ్లు సమాజానికి మాంసపు ముద్దలు. నీతి నిజాయితీలు లోపించిన సంఘం వారిద్దరిని స్త్రీలుగా పరిగణించినా వారి మానాలను బహిరంగంగా బజార్లల్లో వేలం వేసారు.

'ఆరంభించరు'లో ఒక యువకునకు--యౌవ్వనం దాటని యువతికి మధ్య జరిగిన ఆశల ఆరాటం. ఆ ఆరాటంలో యువకుడు ఆవేశానికి బానిసయ్యి పోయాడు. బానిసత్వం నుంచి ఆ బానిసను ఆ యువతి విముక్తి కలిగించి బయట ప్రపంచంపై వదలింది. 'హరిజన సమస్య'లో చలం సమాజాన్ని అవహేళన చేసారు.

'ఎబ్బే ఁయా ప్రభుత్వం చేసే శాసనాలు ఏం లాభం లేదు. ఎన్నటికి కలుపుకోరు మమ్మల్ని. ఎన్ని శిక్షలతో బెదిరించినా, ఇంకా రంధ్రాలు వెతికి తప్పించుకుంటారు. అట్లా కాదు. హరిజనులు విప్లవం చేసి మా స్త్రీలకి హరిజన బిడ్డల్ని కనాలి' అని చలం ఉద్దేశం. ఈ ఉద్దేశం వృద్ధి పొందినపుడు హరిజన సమస్యే ఉండక పోవచ్చును.

ఇందులో ప్రతి కథకీ ఏదో ఒక రకంగా సెక్సు ముద్రలు వేసారు.

చలంగారి 'కలం స్టేషను పంపు':

దీనిలో పన్నెండు కథ లున్నాయి. కామ సంబంధం లేని కథేదీ లేదు. చిన్నవాడు సీతను మోహిస్తే 'సీత తల్లి' చిన్నవాడిని మోహించింది. 'సీత తల్లి, సీతకన్న బావుం ద'నిపించాడు కుఱ్ఱవాడి చేత చలం. కంటిచూపు కానిన వాడిని కాదనలేక దగ్గరకు తీస్తే ఆ స్త్రీపై వాడికి 'జెలసీ' కలిగి తన్ని తరమటానికి ప్రయత్నించాడు. 'ఆమె పెదవుల'కై ఆశించాడు అతడు. వయస్సు కళ్లు మూసింది. గ్రుడ్డివాడై వయసు మళ్లిన ముసలి పెదవులకై అన్వేషించాడు అభాగ్యుడు. అందం ఆనందం కలిగిస్తుంది. కాని ఒక్కొక్కసారి దయ్యంలా పీడించి 'దెయ్యమేనా' అనిపిస్తుంది. సారంగధరులు లేకపోయినా 'అభినవ సారంగధరుడు' అవతరించి ప్రత్యక్ష పురాణం చూపించి తన నిజాయితి ప్రదర్శించాడు. 'మణి' అని కలవరించి ఉవ్విళ్లూరిన వాడు తన ప్రియురాలు వంటిది కనుపింపలేదని అసంతృప్తి చెందాడు. పరవశించే వారు పరస్పరం కలసికొన్నప్పుడు 'లిల్లీతో స్నేహం ఎలా అయిందంటే' అని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. 'కంఠపు ఊపులతో లోకాన్ని భ్రమింప చెయ్యడం సాధన చెయ్యి.' అని స్త్రీకి ప్రబోధించారు చలం 'సరస్వతీ ప్రసన్నం'లో. 'ఒరేయ్ వెంకటచలం'లో స్త్రీ పురుషు లెలా చలాని కెలా లొంగిపోయారో తెలుస్తుంది. 'స్టేషను పంపు' కదిలిస్తుంది కోడెగాండ్రను, కలువభామ కలికి మాటలు నేర్చింది. ఆ భామకు వాడికి స్టేషను పంపు దగ్గరే పరిచయమయ్యింది. చివరకా పంపు పరిచయం వారిని దొంగతనంగా పారిపోయేలా చేసింది. ఒకరి భార్యను మరొకరు మోహించి లేవదీసికొని పోయారు 'ముక్కాలిపీట' కథలో. మహానుభావులు కొందరు మర్యాదకోసం మానాన్ని బజార్లో పెడతారు. దానివల్ల కలిగే ప్రయోజనంకంటె అనర్థమే అధికం. ఆ అనర్థం కలగకుండ కుసుమాదేవి సంజీవరాయుడును లాలించింది. కాని అతనికి 'మర్యాదస్తుని కో కథ' చెప్పాలనిపించి విరక్తినుండి ఆసక్తి కలిగించింది.

చలం చెప్పిన సమాజం విశృంఖలంతో ముడిపండింది. స్వేచ్ఛా వాయువులని అఱ్ఱులు సాచి దుర్గంధ భూయిష్ఠ పరిమళాలు క్రోలకుండా ఉంటే జీవితాని కది మహోపకారం. కాని చలం వాక్యం గుండెను చీల్చుతుంది. హృదయాన్ని తరింపజేస్తుంది. మనసును పరవశింప జేస్తుంది. అరుణాచల స్వామివారు ఒక్కసారి

ఈ లోకాన్ని ఈ సమాజాన్ని చూస్తే తను వ్రాసిన రచనల్లో మార్పులు, చేర్పులు కావాలని ఆశిస్తారా!

శ్రీ రామమోహన్.

వి. ఐ. లెనిన్

(సంక్షిప్త జీవిత చరిత్ర)

(ప్రచురణ : ప్రగతి ప్రచురణాలయం, మాస్కో వెల : రు 1–20.

ప్రపంచ నాయకులలో ఒకడుగా ప్రసిద్ధి చెందిన లెనిన్ పూర్తిపేరు వ్లడీమిర్ ఇల్యీచ్ ఉల్యానొవ్. జననం 1870 ఏప్రిల్ 10 (22) వ వోల్గా ఒడ్డునవున్న సీమ్ బీర్స్క్ యిప్పుడు (ఉల్యానొవ్స్క్) పట్టణంలో.

'ప్రజలకు మరింత మంచి జీవితం సంపాయించే ఆశతో ఆయన తన జీవితాన్ని జారిస్టు నిరంకుశత్వంమీదచేసే విప్లవ పోరాటానికి అంకితం చేయడానికి యెన్నుకున్నాడు. (12 వ పుట)' ఇటువంటి వాక్యాలు చాలా ఉన్నాయి యీ అనువాదంలో.

'1887 డిసెంబర్ తొలిరోజుల్లో ఆయన, విద్యార్థుల రహస్య సమావేశంలో పాల్గొన్నందుకుగాను, విశ్వవిద్యాలయంనుండి బహిష్కరింపబడి, తరువాత అరెస్టు చేయబడినాడు. (13 వ పుట.) ఈ శైలి ఎంత బాగున్నదీ?

'గోడ సమూలంగా పుచ్చిపోయింది. (13 వ పుట) గోడ పుచ్చిపోవడమేమిటో?

'19 వ శతాబ్ది మధ్యలో మార్క్సు ఎంగెల్సులు సామాజిక అభివృద్ధి నియమాల శాస్త్రం స్థాపించి సమాజ వివవ పరివర్తన మార్గాన్ని నిశ్చయించినారు (14 వ పుట). ఈ వాక్యంలోని స్థాపించి అనే క్రియ తప్పుకాకపోవచ్చు. కాని ప్రతిపాదించి, రూపొందించి అనే మాటలలో దేనినయినా ఉపయోగించితే అర్థం చెడిపోతుందా? ఔచిత్యం దెబ్బతింటుందా?

మార్క్సిజం సారాన్ని వివరిస్తూ లెనిన్ యిలా రాసినాడు : 'పెట్టుబడి మీద విప్లవ పోరాటంలో తిరుగుబాటుచేసే వాళ్లలో మొదటి వాళ్లుగా వుండడమూ, సమస్త శ్రామిక పీడిత జనాన్ని సమీకరించడమూ అనే తమ పాత్రనూ, తమ కర్తవ్యాన్నీ తమ జీవిత విధిని కార్మిక వర్గానికి సూచించడం మార్క్సు, ఎంగెల్సుల గొప్ప చరిత్రాత్మకమైన ఘనత, (15 వ పుట') ఈ వాక్యం ఎంతమందికి అర్థం అవుతుందీ! ఇంతకంటే సరళంగా అనువదించడం అసాధ్య మనుకుందామా?

ఇంగ్లీష్‌గానీ, రష్యన్ భాషగానీ రానట్టి తెలుగు పాఠకులకూ, రాజకీయ కార్యకర్తలకూ బాగా ఉపయోగపడుతుంది ఈ పుస్తకం. లెనిన్ జీవితాన్నీ, సిద్ధాంతాలనూ పరిచయం చేస్తుంది.

'తన రోజువారీ కార్యకలాపా లన్నిటిలోనూ సోవియెట్ కమ్యూనిస్ట్ పార్టీ జీవదాయకమైన లెనిన్ భావాలచేత, యే భావాలను అది సృజనాత్మకంగా అభివృద్ధిచేసి, ఆచరణలో ప్రయోగిస్తుందో వాటి చేత మినహాయింపులు లేకుండా నడిపించబడుతున్నది. సోదర పార్టీలు మార్క్సిజం—లెనినిజం ధనాగారానికి తమ చేర్పులు చేరుస్తున్నాయి. లెనినిజం సకల కమ్యూనిస్టు పార్టీలకూ, సకల దేశాల ప్రజలకూ సిద్ధాంత ఆయుధం' (214 వ పుట)

'లెనిన్ పేరూ, ఆయన ఉద్యమమూ ఆయన బోధలూ యుగాల తరబడి నిలుస్తాయి. లెనిన్ కార్యం దుర్వారం.'

శ్రీ వి. ఎస్. అవధాని.

సకల నీతి సమ్మతము

(మడికి సింగన ప్రణీతము. సంపాదకులు: విద్యారత్న శ్రీ నిడుదవోలు — వేంకటరావు, డాక్టర్ శ్రీ పోణంగి—శ్రీరామ అప్పారావు, డెమ్మీ సైజు 98 + 169 పేజీలు. వెల రూ. 4. ప్రచురణ— ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళా భవనం, హైదరాబాదు—4.)

రాజనీతిని తెలిపే ప్రాచీన గ్రంథాలలో ఇది మొదటిది. ఇది సంకలన గ్రంథం. అంటే ఆ యా విషయాలను గురించి వ్రాయబడిన పద్యాలు ఒక చోట చేర్చి కూర్చబడిన గ్రంథం. గ్రంథాంతరాల నుంచి పద్యాలు సంకలనం చేసినా, అక్కడక్కడ తాను రచించిన పద్యాలను కూడా సింగన దీనిలో చేర్చి యున్నాడు; అందువల్లనే గద్యలో 'సింగనార్య ప్రణీతంబైన' అని చెప్పుకున్నాడు.

అపూర్వ గ్రంథాన్ని సంపాదించి, సంస్కరించి ప్రకటింప బూనుకున్న కీర్తికాయులు మానవల్లి— రామకృష్ణకవి గారు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి సహాయ సంపత్తి మూలమున 1923–వ సం. ననే ప్రకటించారు. దీని ప్రకటన మూలంగా ఉపలబ్ధాలు కాని ప్రాచీన గ్రంథాలను గురించి తెలుసు కొనుట కెంతో అవకాశం ఏర్పడింది. శ్రీరామకృష్ణ కవిగారు తమకు లభించిన ఒక్క కాగితపు ప్రతి ఆధారంగా—అక్కడక్కడ లుప్తాలైన భాగాలను పూరించి అట్టి పూరణలను కుండలీకరణంలో సూచించారు. ఇప్పుడు మరికొన్ని వ్రాతప్రతులు లభించడంవల్ల పునఃపరిష్కరణ ఆవశ్యకమైంది. కవిగారు ప్రకటించిన గ్రంథం ఇప్పుడు లభ్యంకాదు. అందువల్ల వాఙ్మయసేవకు బద్ధకంకణులైన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారు దీనిని తిరిగి ప్రకటింపబూనుకున్నారు. సమర్థులైన విద్వాంసులు శ్రీ వేంకటరావు గారిచేతను, శ్రీ శ్రీరామ— అప్పారావుగారి చేతను పరిష్కరింపచేసి వెలయించారు. దీనికి శ్రీ వేంకటరావు గారు కూర్చిన విపులమైన పీఠిక, అనుబంధాలు కూడా ఉన్నవి.

పీఠికలో శ్రీ వేంకటరావుగారు ఎన్నో విషయాలను చర్చించారు. విద్వాంసులుకూడా గ్రహించవలసిన పెక్కువిషయాలను వెల్లడించారు. సింగనకాలాన్ని నిర్ణయిస్తూ, అతడు తన పద్మపురాణంలో ఇచ్చిన లెక్కనుబట్టి 1420 ప్రాంతంవాడని నిర్ణయించారు. సుప్రసిద్ధ చరిత్రకారులు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు సింగన చెప్పిన పద్యంలోని 'మార్గశిర పంచమి' అనే తిథి లెక్కకు కుదరదనీ, ఆ కాలం సరికాదనీ, అతడు 1347 ప్రాంతంవాడనీ, కాలాన్ని తెలిపే ఆ పద్యాన్ని ఇతరులు కల్పించి, గ్రంథానికి ఎక్కించారనీ తెలపగా, శ్రీ వేంకటరావుగారు 'మార్గశిర' తప్పనీ, 'మాఘసిత' (మాఘశుక్ల) అని వుండాలనీ, అలావుంటే లెక్క సరిపోతుందనీ, ఆ పద్యం ఇతరులు కల్పించినది కాదనీ సమర్థించారు.

రామకృష్ణ కవిగారికి ఒక్కవ్రాత ప్రతిమాత్రం లభించినందున లుప్తభాగాలను ఆయన పూరించవలసి వచ్చింది. అర్థంకాని చోట్ల ప్రశ్నచిహ్నాలను నిలపవలసి వచ్చింది. శ్రీ వేంకటరావుగారు ప్రథమ ముద్రణంలోని లోపాలనన్నింటినీ సంస్కరించారు. ఆ సంస్కార విధానాన్ని తమ పీఠికలో వివరించారు. ఆకరం చూపని పద్యాలకు ఆకరం తెల్పారు. 'మదీయము'లని చెప్పబడిన కొన్ని కందనమంత్రి నీతితారావళిలోని వని సప్రమాణంగా చూపారు. ఉదాహృత గ్రంథాలలోని పాఠభేదాలను ఇచ్చారు. గ్రంథాలనుగూర్చిన సమాచారం తెలియజేశారు. విషయ విభాగాన్ని పద్యసంఖ్యలతో చూపారు. పూర్వకవుల అనుసరణాలను వివరించారు. అవసరమైన కొన్ని పదాలకు అర్థాలిచ్చారు. అవసరమైనచోట్ల వివరణలను వ్రాశారు. తెలుగులోని ఆకర గ్రంథాలను గురించీ, శాస్త్రీయ వాఙ్మయాన్ని గురించీ విపులంగా తెలియజేశారు. శ్రీ వేంకటరావుగారి పీఠికయే ఒక విమర్శ గ్రంథంగా తయారై వాఙ్మయాభిమానులకూ, పరిశోధకులకూ ఎంతో ఉపయుక్తంగా ఉన్నది.

ఏతద్గ్రంథ సంపాదకులు రామకృష్ణకవి గారి ముద్రిత ప్రతిని చిన్న చూపుతో చూడలేదు. శ్రీ కవిగారి ఉపోద్ఘాతంతోపాటు ప్రథమ ముద్రణపు ముఖపత్రాలను యథాతథంగా ఇందు చేర్చారు. కవిగారి యెడల గల గౌరవాని కిది నిదర్శనం.

గ్రంథం చివర ఉన్న 'అనుబంధము'లో ఈ గ్రంథంనుండి ఇతర కవులు ఉదాహరించిన పద్యాలను పాఠ భేదాలతో చూపడమే కాకుండా ఇందులోని పద్యాలకు సూచికను ఇచ్చారు. చివర మడికి సింగన కాలాన్ని గురించి మరికొంత తెలిపి, కందనామాత్యుని నీతి తారావళిని గురించిన్నీ వ్రాశారు. పాఠ భేదాలను తెలిపారు. ఈ అనుబంధం కూడా పీఠిక వలెనే ఎంతో ఉపయుక్తమైనది.

ఎప్పుడో ముద్రితమై ఇప్పుడు అలభ్యంగా ఉన్న ఈ సకల నీతి సమ్మతాన్ని వ్రాత ప్రతులతో సంప్రతించి సంస్కరించి, విపులపీఠికతోనూ, అను బంధంతోనూ అందజేసిన సంపాదకులకూ, గ్రంథ ప్రకాశకులైన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమివారికీ ఆంధ్ర వాఙ్మయాభిమానులు ధన్యవాదాలను అర్పించవలసి యున్నది.

శ్రీ బులుసు వేంకటరమణయ్య.

Printed and Published For Nageswara Rao Estates (Private) Ltd., by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7 Thambu chetty Street, Madras-1, Editor : S. Radhakrishna.

భారతి

ప్రకటన రేట్లు

కవరు పేజీలు		కాజువల్ రేట్లు	కాంట్రాక్టు రేట్లు
4 వ కవరు పేజి	...	రు. 175/–	రు. 150/–
2 లేక 3 వ కవరు పేజి	...		
ఒకే (నలుపు) రంగు	...	రు. 150/–	రు. 125/–
లోపలి పేజీలు			
పూర్తి పేజి	...	రు. 125/–	రు. 100/–
అర పేజి	...	రు. 65/–	రు. 55/–
పావు పేజి	...	రు. 40/–	రు. 35/–

ప్రత్యేక స్థానములకు 25% అదనం.

సం॥నకు వరుసగా 6 ప్రకటనలు చేయువారికి కాంట్రాక్టు రేట్లు వర్తించును.

చందా వివరములు

సంవత్సర చందా	...	రు. 12—00
6 మాసముల చందా	...	రు. 6—00
విడి ప్రతి	...	రు 1—00

మేనేజరు, భారతి

మద్రాసు—1.